మార్గదర్శకులు
రూ॥ 120/-
పేజీలు: 130
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

దోషి 'క్షమాభిక్ష పిటిషన్'కు రాష్ట్రపతి తిరస్కరణ

ఉన్నత నేపథ్యం ఉన్న వ్యక్తులకే ప్రతిభ పరిమితం కావొద్దు

కేరళ స్థానిక సంస్థల్లో భారీ విజయమంటూ బిజెపి గోబెల్స్ ప్రచారం 05

సంపుటి 09, సంచిక: 19 | సోమవారం | 15-12-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00





# బిజెపి డిఎన్ఎలోనే ఓట్ చోరీ

**సత్యం-అహింస నినాదాలతో మోదీ-ఆర్ఎస్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం**

- న్యూఢిల్లీ ఓట్‌చోరీ ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రతిజ్ఞ
- బిజెపి కోసం పనిచేస్తున్న ఎన్నికల అధికారులను వదలబోమని సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు ప్రత్యక్ష హెచ్చరిక
- దేశాన్ని కాపాడేది కాంగ్రెస్ సిద్ధాంతమే : ఖర్గే
- బ్యాలెట్‌తో పోటీకి రావాలని ప్రియాంకాగాంధీ సవాల్

**న్యూఢిల్లీ:** సత్యం-అహింస అనే రెండు నినాదాలతో కేంద్రంలోని బిజెపి-ఆర్ఎస్ఎస్ 'ఓట్‌చోరీ' ప్రభుత్వాన్ని గద్దె దించుతామని న్యూఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో జరిగిన భారీ ర్యాలీలో కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ శపథం చేశారు. ఓట్‌చోరీ బిజెపి డిఎన్ఎ లోనే ఉందని, కొంచెం సమయం పట్టినాగానీ అంతిమంగా గెలిచేది సత్యమేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వంపైన, ఎన్నికల సంఘం తీరుతెన్నులపైన రాహుల్‌గాంధీ విమర్శలతో తీవ్ర దాడి చేశారు. ''సత్యానికీ-అసత్యానికీ మధ్య జరుగుతున్న ఈ పోరాటంలో ఎన్నికల సంఘం అసత్యంవైపు నిలబడింది, బిజెపి కోసం పనిచేస్తోంది, కాంగ్రెస్‌పార్టీ సత్యానికే కట్టుబడి ఉంది,

తరువాయి 2లో

## రాజ్యాంగాన్ని బిజెపి రద్దుచేయాలని చూస్తోంది

తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి



**న్యూఢిల్లీ :** రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బిజెపి చూస్తోందని, కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 'మహాత్మా గాంధీ, అంబేద్కర్ రాజ్యాంగ రచన సమయంలో రాజ్యాంగ సభలో దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, పేదలకు ఓటు హక్కు విషయమై చర్చిస్తున్నప్పుడు ఆరెస్సెస్ సిద్ధాంతకర్త ఎం.ఎస్ గోల్వాల్కర్ తదితరులు వారికి ఓటు హక్కు ఇవ్వొద్దన్నారని తెలిపారు. కానీ గాంధీ, అంబేద్కర్ వారికి ఓటు హక్కు కల్పించినందున ఈ దేశంలో ప్రభుత్వం ఏర్పాటులో వాళ్లు కూడా భాగస్వాములవుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్, గోల్వాల్కర్ భావజాలంతో ఉన్న నరేంద్ర మోదీ, అమిత్ షా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత వారి భావజాలాన్ని

తరువాయి 2లో



## పల్లెపోరు రెండో విడతలోనూ

# కాంగ్రెస్ సత్తా

- 2 వేలకుపైగా సర్పంచ్ అభ్యర్థులు విజయం
- వెయ్యికిపైగా గ్రామాల్లో బిఆర్ఎస్ గెలుపు
- 200పైగా బిజెపి, 600లకుపైగా ఇతర సర్పంచ్ అభ్యర్థులు విజయదుందుభి
- 30కి పైగా సిపిఐ అభ్యర్థుల గెలుపు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలో గ్రామపంచాయతీ ఎన్నికల రెండో విడత ఎన్నికలు చెదురుమదరు ఘటనలు మినహా ప్రశాంతంగా జరిగాయి. పోలింగ్ అనంతరం ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టారు. తొలి విడతలో వెలువడిన ఫలితాల మాదిరిగానే అధికార కాంగ్రెస్ రెండవ విడతలోనూ సత్తా చాటింది. కడపటి వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 2200కు పైగా సర్పంచి స్థానాల్లో విజయాలను తమ ఖాతాలో వేసుకున్నారు. భారత రాష్ట్ర సమితి మద్దతుదారులు 1100పైగా, బిజెపి మద్దతుదారులు 250కు పైగా స్థానాల్లో గెలుపొందారు. 600పైగా స్థానాల్లో ఇతరులు విజయం సాధించారు. 30కి పైగా స్థానాల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. తొలి విడతలో కాంగ్రెస్ 2400పైకుగా సర్పంచ్ స్థానాలను



విద్యానగర్‌కాలనీలో ఓటు వేసిన ఎమ్మెల్యే కూనంనేని

కైవసం చేసుకుంది. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో మొత్తం 85.86 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 3,911 సర్పంచ్, 29,917 వార్డు స్థానాలకు పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు మధ్యాహ్నం 2 గంటల నుంచి గ్రామ పంచాయతీల్లో ఓట్ల లెక్కింపును

తరువాయి 2లో



## బిజెపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నితిన్ నబీన్

**న్యూఢిల్లీ :** భారతీయ జనతా పారీట (బిజెపి) కీలక నియామకం చేపట్టింది. బిహార్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా ఉన్న నితిన్ నబిన్‌ను ఆదివారం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించింది. బిజెపి పార్లమెంటరీ బోర్డు ఈ పదవికి నబిన్‌ను ఎంపిక చేసింది. 'భారతీయ జనతా పార్టీ పార్లమెంటరీ బోర్డు బిహార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న నితిన్ నబిన్‌ను తక్షణమే అమల్లోకి వచ్చేలా భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమించింది' అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. కాయస్థ సామాజిక వర్గానికి చెందిన 45 ఏళ్ల నబిన్, ప్రస్తుత బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా తర్వాత ఆ పదవిని చేపట్టే అవకాశం ఉందని, ఈ పదవి వరించిన

తరువాయి 12లో

## శీతల గాలులు



- రానున్న రెండు రోజులు మరింత ఉధృతంగా చలి
- ఎల్లో అలెర్ట్ జారీ చేసిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో చలిగాలుల తీవ్రత మరింత ఉధృతమవనుంది. రాగల రెండు రోజులు రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో శీతల గాలులు బలంగా వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ పలు జిల్లాలకు అధికారులు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఈ రెండు రోజుల్లో రాష్ట్రంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే ప్రమాదం ఉందని

తరువాయి 2లో

## సబ్సిడీ విడుదల చేయండి

రాష్ట్రానికి రావాల్సిన రూ.1,468 కోట్లు మంజూరు చేయండి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్



కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన రూ. 1,468 కోట్ల సబ్సిడిని తక్షణమే విడుదల చేయాలని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కేంద్ర వినియోగదారుల సేవలు, ఆహారం ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రికి పలు అంశాలపై లేఖ రాశారు. కెఎంఎస్ 2014-15 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 6.88లక్షల మెట్రిక్ టన్నుల లేవి బియ్యానికి గాను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం

తరువాయి 2లో

## త్వరలో భారత్‌కు కొత్త ప్రధాని

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ చవాన్ జోస్యం

19న యునైటెడ్ స్టేట్స్‌లో వివాదాస్పద జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల విషయాన్ని పేర్కొంటూ పిఎం మార్పు ప్రస్తావన




**న్యూఢిల్లీ :** భారత్‌కు త్వరలో కొత్త ప్రధాని రానున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ చవాన్ జోస్యం చెప్పారు. మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ప్రధాని అయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల 19న యునైటెడ్ స్టేట్స్‌లో వివాదాస్పద జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల కానున్న

తరువాయి 12లో

## వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై

# యూనియన్లతో చర్చలు జరపాలి!

**పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా!**



**చండీగఢ్ :** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్లతో చర్చలు జరపాల్సిన అవసరం ఉందని పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా అభిప్రాయ పడ్డారు. వార్తా పత్రికలు, న్యూస్ ఏజెన్సీల ఉద్యోగసంఘాల కాన్ఫెడరేషన్ రెండురోజుల వార్షిక సమావేశాలను చండీఘ్ మున్సిపల్ భవన్‌లో ఆదివారం ఆయన ప్రారంభించారు. సమావేశానికి కాన్ఫెడరేషన్ అధ్యక్షుడు రాస్ బిహారీ అధ్యక్షత వహించారు. సమావేశాలకు ఆతిథ్యం ఇచ్చిన ది ట్రిబ్యూన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రుచిక ఎం ఖన్నా వక్తలను వేదికపైకి

తరువాయి 12లో



## హనుక్కా వేడుకల్లో ఉగ్రదాడి?

సిడ్నీ నగర బాండీ బీచ్‌లోకి దూసుకువచ్చి కాల్పులు జరిపిన అగంతకుడు


12 మంది మృతి, 8 మందికి గాయాలు

12


## రెండో విడతలో గెలుపొందిన సిపిఐ సర్పంచ్‌లు వీరే



బోడ భీమానాయక్ పడమటి తండా (ఖమ్మం) | చుంచిరి సృజన పల్లెగూడెం (ఖమ్మం) | బత్తుల వెంకటేశ్వర్లు దారెడు (ఖమ్మం) | పుచ్చకాయల శ్రీదేవి గూడూరుపాడు (ఖమ్మం) | ఈసం హన్మంతరావు ఊటుకూరు (ఖమ్మం) | అజ్మీరా సింధు 4 ఇంక్లైన్ (భద్రాది) | నూనావత్ కుమారి బాబుక్యాంపు (భద్రాది) | సపావత్ కళ్యాణి గౌతంపూర్ (భద్రాది) | రెడ్డి సుజాత పెనుబల్లి (భద్రాది) | కారం సీతారాములు పెనగడప (భద్రాది) | తాగోరి సరిత రామాంజనేయ కాలనీ(భద్రాది)



వాడే రాములు ప్రశాంతినగర్ (భద్రాది) | కుర్సం రాములు రేగులుగూడెం (భద్రాది) | బాణోత్ లక్ష్మీ మందెరకలపాడు(భద్రాది) | వట్టం బాబూరావు కారెగట్టు (భద్రాది) | వజ్జా కృష్ణవేణి పునుకుల (భద్రాది) | బోజన్ నిషారాణి ప్రభాత్ నగర్ (భద్రాది) | భూక్యా మంజుల లక్ష్మీ దేవిపల్లి ఎస్(భద్రాది) | తేజావత్ వినోద్ కుమార్ నాగారం కాలనీ (భద్రాది) | మాలోత్ అనీషా రంగాపురం (భద్రాది) | సోడె వెంకట రమణ దంతెలబోర ఎస్‌సి(భద్రాది) | భుక్యా శాంతిశ్రీ విద్యానగర్ (భద్రాది)



భుక్యా ఝాన్సీ బిక్కుతండా (భద్రాది) | బానోత్ రవి సంగెం (భద్రాది) | జి.రమేశ్ తవిసెల గూడెం (భద్రాది) | పిట్టల రామలక్ష్మయ్య సీతాయిగూడెం(భద్రాది) | తేజావత్ లక్ష్మి ఇల్లందులపాడు (భద్రాది) | జావీద్ దుప్పల్లి (యాదాద్రి) | వదకొప్పుల ఉమ లింగయ్య శాంతినగర్ (సూర్యాపేట) | మండవ జయమ్మ నారాయణపురం(సూర్యాపేట) | గుగులోతు లలిత జేరిపోతులగూడెం(సూర్యాపేట) | పి. సత్యనారాయణ అల్వాలపురం(సూర్యాపేట)

ఆదివారం జరిగిన గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల్లో ఏకగ్రీవమైన వారితో పాటు 32 మంది సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు.



# ప్రపంచం
WORLD NEWS

## హాంకాంగ్‌లో ప్రతిపక్ష డెమొక్రటిక్ పార్టీ రద్దు

**హాంగ్‌కాంగ్ :** హాంగ్‌కాంగ్‌లో చిట్టచివరి ప్రతిపక్షం ''డెమొక్రటిక్ పార్టీ'' రద్దైపోయింది. ఓటింగ్ ప్రక్రియ ద్వారా పార్టీ రద్దుకు ఆమోదం లభించింది. 97 శాతం మంది సభ్యులు బ్యాలెట్ పత్రాల ద్వారా జరిగిన ఓటింగ్ ప్రక్రియలో పార్టీ రద్దుకు సమ్మతించారని డెమొక్రటిక్‌పార్టీ ఛైర్మన్ లో కిన్ హెయి ఆదివారం చెప్పారు. పార్టీని అంతర్థానం చేయడానికి ఓటింగ్ ప్రక్రియ ఒక్కటే అత్యుత్తమమైన మార్గంగా తాము ఎంచుకున్నట్లు చెప్పారు. ఎంతో తీవ్ర మనోవేదనతో అనివార్యంగా ఈ అధ్యాయాన్ని పూర్తిచేస్తున్నామని చెప్పారు. తొలుత లో కిన్ హెయి మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో పార్టీని రద్దుచేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. కానీ పార్టీ సీనియర్ నాయకులు మాత్రం అసోసియేటెడ్ ప్రెస్‌తో మాట్లాడుతూ, ఒకవేళ పార్టీని రద్దుచేయకపోతే తీవ్రమైన పరిణామాలు సంభవిస్తాయని తాము ముందుగానే హెచ్చరించినట్లు చెప్పారు. హాంగ్‌కాంగ్ ఆర్థిక కేంద్రం 1997లో బ్రిటన్ పరిపాలన నుండి చైనా అధీనంలోకి వచ్చింది. దీనికి మూడు సంవత్సరాలు ముందుగా 1994లో హాంగ్‌కాంగ్‌లో డెమొక్రటిక్‌పార్టీ ఆవిర్భవించింది. హాంగ్‌కాంగ్‌లో ఇప్పటివరకూ మనుగడ సాగించిన అతిపెద్ద ప్రజాస్వామ్య అనుకూల పార్టీ ఇది ఒక్కటే.


# దక్షిణాఫ్రికాలో కుప్పకూలిన అహోబిల ఆలయం

భారతీయుడు సహా నలుగురు మృతి



**రెడ్‌క్లిఫే :** దక్షిణ ఆఫ్రికాలో నిర్మాణంలో ఉన్న నాలుగు అంతస్తుల హిందూ దేవాలయం కుప్పకూలిపోవడంతో ఒక భారతీయుడు సహా నలుగురు మరణించారు. మృతదేహాలను వెలికితీసి, శిథిలాలను తొలగించేందుకు సహాయ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శిథిలాల్లో ఇంకా ఎంతమంది చిక్కుకున్నారన్న విషయం తెలియరాలేదు. వాతావరణం ప్రతికూలండా ఉన్నందువల్ల సహాయ చర్యలను వేగంగా కొనసాగించలేకపోతున్నామని స్థానిక అధికారి ప్రేమ్ బలరామ్ చెప్పారు. ఈ ఆలయ ట్రస్టు కమిటీ కార్యవర్గ సభ్యుడు విక్కీ జయరాజ్ పాండే శిథిలాల్లో చిక్కుకుని మరణించారు. పాండే రెండు సంవత్సరాలుగా అక్కడే ఉండి ఆలయ నిర్మాణ పనులన్నీ చూసుకుంటున్నారని ట్రస్టు అన్నదాన విభాగం డైరెక్టర్ శాన్‌వీర్ మహారాజ్ చెప్పారు. క్వాజులు నాటల్ రాష్ట్రం రెడ్‌క్లిఫే పట్టణంలో ఒక భారతీయ కుటుంబం ఈ ఆలయాన్ని నిర్మిస్తోంది. ఆంధ్రప్రదేశ్ అహోబిలంలో ఉన్న దేవాలయం తరహాలోనే అదే నమూనాతో అచ్చుగుద్దినట్టుగా ''న్యూ అహోబిల దేవాలయం'' పేరుతో భారతీయ కుటుంబం ఈ నిర్మాణం చేపట్టింది. శనివారం జరిగిన ఈ ప్రమాదంలో విక్కీ జయరాజ్ ఈ ప్రమాదంలో మరణించగా ఆయనతోపాటు మరో ముగ్గురు కార్మికులు కూడా మరణించారు. ''ఇది ఊహించని పరిణామం'' అని స్థానిక అధికారులు చెప్పారు. ఐతే ఈ ఆలయాన్ని నిర్మించడానికి ప్రభుత్వం అనుమతి తీసుకోలేదన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఆలయ నిర్మాణ వ్యవహారంపై ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. ఈ ప్రమాద ఘటనపై ఆతెక్విని మున్సిపాలిటీ ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఆలయ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు తీసుకోలేదని, ఇది అక్రమ కట్టడమని స్పష్టం చేసింది. సహాయ చర్యలలో భాగంగా జాగిలాలను కూడా రప్పించారు. సజీవులు ఎవరైనా శిథిలాల్లో ఉంటారని భావిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణం కోసం భారతదేశం నుండి రాళ్ళను తరలించారు. దక్షిణాఫ్రికాలో కూడా కొన్ని రాళ్ళను సేకరించి ఒక గుహను పోలినవిధంగా ఆ ఆలయన నిర్మాణాన్ని తీర్చిదిద్దుతున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద దైన నృసింహస్వామి విగ్రహాన్ని ఈ ఆలయంలో ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేస్తున్న తరుణంలో ఈ ఘటన జరిగిందని నిర్మాణం చేపట్టిన భారతీయ కుటుంబం ప్రకటించింది. క్వాజులు నాటల్ రాష్ట్ర సహకార పరిపాలనా, సంప్రదాయ వ్యవహారాల మంత్రి థులాసిజ్వే బుథెలెజీ ఘటనా ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. శిథిలాలన్నింటినీ పూర్తిగా తొలగింపజేస్తామని, ఇంకా ఎవరైనా లోపల చిక్కుకున్నారా? అనే విషయం తెలుసుకుంటామని మంత్రి చెప్పారు.

# బెర్లిన్ వేదికగా ఉక్రేన్ శాంతి చర్చల సందడి








**బెర్లిన్ :** ఉక్రేన్‌లో యుద్ధం ముగించేందుకు 'ట్రంప్ ప్రణాళిక' ఆమోదంకోసం తుది చర్చలకు అమెరికా, యూరప్ ఉన్నతస్థాయి నాయకులు, అధికారులు బెర్లిన్ చేరుకున్నారు. ఇరు పక్షాలను ఒప్పించి క్రిస్‌మస్ వేడుకల నాటికి చరిత్ర సృష్టించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తాజా లక్ష్యం నిర్దేశించుకున్న పూర్వరంగంలో ఆయన తరపు దూతలు స్టీవ్ విట్‌కాఫ్, అల్లుడు జారెడ్ కుష్నెర్ ఆదివారం బెర్లిన్ డౌన్‌టౌన్‌లో ఫోటోగ్రాఫర్లకు చిక్కారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ అధికారులు బెర్లిన్‌లో వరుస సమావేశాలు నిర్వహిస్తారని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. తాను ముఖ్యంగా విట్‌కాఫ్, కుష్నెర్‌లను కలిసి చర్చిస్తానన్నారు. యూరోపియన్ యూనియన్ భాగస్వామ్య దేశాల నాయకులతో బెర్లిన్‌లోనే వరుస సమావేశాలు జరుపుతానన్నారు. యుద్ధం ముగించేందుకు వీలుగా ఒక రాజకీయ ఒప్పందం కోసం శ్రమిస్తున్నానన్నారు. ఇదేసమయంలో రష్యా కేంద్ర కార్యాలయం క్రెమ్లిన్ ప్రతినిధి యూరీ ఉషకోవ్ మాస్కోలో ఆదివారం పాత్రికేయులతో మాట్లాడుతూ, శాంతి ప్రణాళికలో ఉక్రేన్, యూరప్ నాయకులు ఏవైనా సవరణలు, ముఖ్యమైన మార్పులు ప్రతిపాదిస్తే సహించేది లేదన్నారు.

యుద్ధం ముగించేందుకు ఏడాదికాలంగా ట్రంప్ అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ''చాలా సులభంగా ఉక్రేన్‌లో యుద్ధం ఆపేస్తా'' అని అధికారంలోకి రాకముందే ఎన్నికల ప్రచారంలో ట్రంప్ ప్రజలకు అనేక వేదికలపై వాగ్దానాలు చేయడంతో, ఇంటా బయటా ప్రస్తుతం సమస్యల వలయంలో చిక్కుకున్న ఆయనకు ఈ ఒప్పందం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. జెలెన్‌స్కీ వ్యతిరేకత, ఆయన తీరుపై ట్రంప్ ఆగ్రహం, యూరోపియన్ యూనియన్ నాయకుల భయాలు, యూరప్ ''ఇష్టపడే వారి కూటమి'' నాయకులకు ట్రంప్‌పై ఉన్న సందేహాల నేపథ్యంలో తుదివిడత పేరుతో బెర్లిన్ చర్చలు జరుగుతున్నాయి. గతవారంలో ఫ్లోరిడాలో జెలెన్‌స్కీ తరపున ప్రతినిధులు, ట్రంప్ దూతలు మూడు రోజులు జరిపిన చర్చల తర్వాత కూడా జెలెన్‌స్కీ తన పట్టు వీడలేదు. రష్యాకు తమ భూభాగాలను వదులుకునేది లేదని స్పష్టం చేయడంతో, అసలు జెలెన్‌స్కీ తన ''28 అంశాల శాంతి ప్రణాళిక''ను పూర్తిగా చదవలేదని ట్రంప్ విచారం వ్యక్తం చేశారు. మరోవైపు ఉక్రేన్ అధీనంలో ఉన్న డోనెట్స్క్ రీజియన్‌లోని భూభాగాల నుండి సైన్యాలను ఉపసంహరించాలని, నాటో కూటమిలో ఉక్రేన్ చేరకూడదని రష్యా అధ్యక్షుడు పుతిన్ కోరుతున్నారు. గౌరవంగా సైన్యం వెనక్కు వెళ్ళకపోతే బలప్రయోగంతో ఆ ప్రాంతాలను స్వాధీనం చేసుకుంటామని ఆయన హెచ్చరిస్తున్నారు. దీనికి తోడు ట్రంప్ కూడా వెనక్కి తగ్గకుండా ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే మూడో ప్రపంచ యుద్ధానికి దారితీయగలదని హెచ్చరించారు. 'ఈ యుద్ధాన్ని ఆపడానికి నేను చాలా శ్రమ పడుతున్నా, ఈ యుద్ధం వల్ల మాకేం నష్టం లేదు, ఈ యుద్ధ పరిస్థితి అదుపు తప్పితేతప్ప దీనివల్ల అమెరికాకు ఎలాంటి నష్టం ఉండదు'' అని వైట్‌హౌస్‌లో డిసెంబరు 12న ట్రంప్ పాత్రికేయులతో అన్నారు.

ఇదిలా ఉండగా ఉక్రేన్–రష్యా మధ్య డ్రోన్, క్షిపణి దాడులు కొనసాగుతున్నాయి.

# బ్రౌన్ యూనివర్సిటీలో కాల్పులు

## ఇద్దరు మృతి : హంతకుడికోసం భారీ వేట



**ప్రొవిడెన్స్ :** అమెరికా బ్రౌన్ యూనివర్సిటీ ఐవీ లీగ్ క్యాంపస్‌లో అంతిమ పరీక్షలు జరుగుతున్నప్పుడు ఆదివారం మధ్యాహ్న సమయంలో ఒక గన్‌మెన్ కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించగా, మరో తొమ్మిదిమంది గాయపడ్డారు. నల్ల దుస్తులు ధరించి కాల్పులకు పాల్పడిన గన్‌మెన్ అదృశ్యమయ్యాడు. మొదటి అంతస్తులో పరీక్షలు జరుగుతున్న సమయంలో గన్‌మెన్ ఎలా ప్రవేశించాడు? ఎలా కాల్పులు జరిపాడు? అనే విషయం అధికారులకు అంతుబట్టడంలేదు. షూటర్ హేండ్ గన్ ఉపయోగించి ఉంటాడని భావిస్తున్నారు. అతడికోసం వందలమంది పోలీసులు భారీ ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసు అధికారులు అందరూ యూనివర్సిటీ క్యాంపస్‌లోని అన్ని భవంతులలోనూ తీవ్ర గాలింపు కొనసాగిస్తున్నారు. ఐతే కాల్పులకు పాల్పడిన ముష్కరుడు ఒక బస్సులో పారిపోయినట్లు గుర్తించారు. అతడి ముఖం గుర్తుపట్టడానికి వీల్లేకుండా కప్పుకున్నాడు. నిందితుడు 30 ఏళ్ళ వయసువాడై ఉంటాడని సందేహిస్తున్నారు. తూర్పు యూఎస్ క్యాంపస్‌ను లాక్‌డౌన్ చేశారు. రోడ్‌ఐలాండ్‌లోని ప్రొవిడెన్స్‌లో వీధులన్నీ భద్రతా దళాల వాహనాలతో నిండిపోయాయి. రోడ్‌ఐలాండ్‌లో తుపాకులను ఉపయోగించడంపై చాలా కఠినమైన నిబంధనలను అమలు చేస్తున్నారు. డెమోక్రాట్లు ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్నారు. ''ఊహించని ఘటన జరిగింది'' అని రోడ్‌ఐలాండ్ డెమోక్రాట్ గవర్నర్ డాన్ మెక్ కీ అన్నారు.

## ఆగని థాయ్–కాంబో యుద్ధం

**బ్యాంకాక్ :** థాయ్‌లాండ్–కాంబోడియా మధ్య యుద్ధం ఆగలేదు. విరామం లేకుండా కొనసాగుతున్న ఈ యుద్ధం ఆదివారంనాటితో రెండోవారంలోకి ప్రవేశించింద. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒక ప్రకటన చేస్తూ, రెండు దేశాలూ శాంతి ఒప్పందాన్ని గౌరవించాలని, కాల్పుల విరమణ పాటించాలని కోరారు. రెండు దేశాలూ శాంతికి అంగీకరించాయని ట్రంప్ చెప్పారు. ఐనాగానీ ఆయన మాటను గౌరవించలేదు. శాంతికి సిద్ధంగా ఉన్నట్లు ఇరువైపుల నుండి ప్రకటన వచ్చిన తర్వాత కూడా కాంబోడియాపై థాయల్‌లాండ్ దాడులు ఆగలేదు. దాడులు ఆపేదిలేదని థాయ్‌లాండ్ తాత్కాలిక ప్రధానమంత్రి అనుతిన్ చార్ విరాకుల్ చెప్పారు. దళాలన్నింటినీ సరిహద్దుల నుండి తరలించాలని, మందుపాతరలను తొలగించాలని, అప్పటివరకూ ట్రంప్ ప్రతిపాదన ఒక ప్రత్యామ్నాయంగా మాత్రమే ఉంటుందని అనుతిన్ స్పష్టం చేశారు. ''మా దేశానికీ, మా ప్రజలకు ఎలాంటి హానీ జరగదని మేం భావించేంతవరకూ మాసైనిక చర్య కొనసాగుతుంది, తామే దీనిని ధృవీకరించుకోవాల్సి ఉంటుంది'' అని అనుతిన్ ఎక్స్‌పోస్టింగ్‌లో చెప్పారు.

## సబ్సిడీ విడుదల చేయండి

(మొదటి పేజీ తరువాయి)

నుంచి రూ.1,468.95 కోట్ల సబ్సిడి రావాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి డిఎఫ్‌పిడి కి గత సెప్టెంబర్ 26 రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాయడమే కాకుండా దీనిని పరిశీలించాలని గత నవంబర్ 20 జరిగిన సమావేశంలో ఎఫ్‌సిఐ ధక్షిణాది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కి దృష్టికి కూడ తీసుకువచ్చామన్నారు. అదేవిధంగా ఏఫ్రిల్ 2022లో పిఎంజికెవైకి సంబంధించి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సప్లై చేసిన 85,988 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను కేంద్ర ప్రభుత్వం నుంచిరావాల్సిన రూ.343.27 కోట్ల సబ్సిడీని సైతం విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖలో కోరారు. కెఎంఎస్ 2024–25 (ఖరీఫ్, రబీ) కోసం కేంద్ర ప్రభుత్వం 35 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించిందని అయితే 202425 రబీ నుండి ఇప్పటి వరకు 17.83 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ 1.13 లక్షల మెట్రిక్ టన్నులముడి బియ్యం సరఫరా చేయడం జరిగిందని వివరించారు. ఇంకా 1.56 లక్షల మెట్రిక్ టన్నుల పారా బాయిల్డ్ ,14.01 లక్షల మెట్రిక్ టన్నుల ముడి బియ్యం సరఫరా చేయాల్సి ఉందని తెలిపారు. ఫిబ్రవరి 2026 నాటికి ప్రభుత్వం 18 లక్షల టన్నులు తీసుకోవాల్సి ఉన్నందున, 24–25 గాను 10 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ అదనపు కోటా ఇవ్వాలని మంత్రి కోరారు. అలాగే ఖరీఫ్ 2024–25కు సంబంధించి సిఎంఆర్ బియ్యం డెలివరీ సమయం గత నెల12తో ముగియడంతో సరఫరా వ్యవధి 2026 జనవరి 31వ తేదీ వరకు పొగించాలని కోరారు. బియ్యం సరఫరాలకు గాను గత సంవత్సరం (జనవరి నవంబర్) తో పోలిస్తే ఈ ఏడాది రేక్‌లకు సంబంధించి 13.5 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉందని దీంతో సిఎంఆర్ డెలివరీలు ఆలస్యం అవుతుందని తక్షణమే అదనపు రేక్‌లను కేటాయించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈఏడాది 2025–26 ఖరీఫ్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 36లక్షల మెట్రిక్ టన్నుల మాత్రమే సేకరణ లక్ష్యంగా నిర్ధేశించిందని అయితే రాష్ట్ర ప్రభుత్వం 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని (54లక్షలమెట్రిక్ టన్నుల బియ్యం) సేకరణ లక్ష్యంగా నిర్ధేశించకోగా, ఇప్పటికే 52లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు లేఖలో పేర్కొన్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం బియ్యం సేకరణను మరింత పెంచాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కోరారు. అలాగే తెలంగాణలో ప్రస్తుతం ఎస్‌డబ్లూసి, సిడబ్లూసిలనిల్వ సామర్థ్యం 65.00 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఉందని, దీంతో కొత్త ధాన్యం సేకరణ మీద ప్రభావం చూపుతుందని అన్నారు. మరో 15 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యాన్ని పెంచేందుకు పిఇజి పథకాన్ని పునరుద్ధరించాలని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

## కాంగ్రెస్ సత్తా

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టారు. దీంతో మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. రెండో విడతలో 4,332 సర్పంచ్ స్థానాలకు గానూ 415, వార్డుల్లో 38,322కి గాను 8,304 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. కాగా, వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లిలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మద్దతుదారుల మధ్య స్వల్ప వాగ్వాదం తలెత్తింది. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. పరకాల ఎంపిడిఓపై హనుమకొండ కలెక్టర్ స్నేహాశబరీష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌంటింగ్ కోసం ఉపయోగించే పెట్టెలకు గుర్తింపు స్టిక్కర్లు అంటించడంలో ఆలస్యం చేయడంపై ఆమెను నిలదీశారు. పరకాల మండలం నాగారంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, బిఆర్‌ఎస్ మాజీ ఎంపిపి మధుసూదన్ రెడ్డికి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు పరిస్థితిని చల్లబర్చారు. రెండో విడతలో అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 91.72 శాతం, అత్యల్పంగా నిజామాబాద్ జిల్లాలో 76.71 శాతం పోలింగ్ నమోదు అయింది. రాష్ట్రవ్యాప్తంగా ఓటర్లు ఉత్సాహంగా పాల్గొనడంతో పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. 193 మండలాల్లోని 3,911 పంచాయతీలు, 29,917 వార్డులకు పోలింగ్ జరిగింది. 12,782 మంది సర్పంచి పదవులకు, 71,071 మంది వార్డు సభ్యుల స్థానాలకు బరిలో నిలిచారు. మొత్తం 4,332 సర్పంచ్ స్థానాలకుగానూ 415, అలాగే 38,322 వార్డుల్లో 8,304 స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఐదు గ్రామాలు, 108 వార్డుల్లో నామినేషన్లు దాఖలు కాకపోవడంతో అక్కడ ఎన్నికలు నిలిచిపోయాయి. మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ కొనసాగింది. 1 గంట వరకు క్యూలైన్‌లో ఉన్న వారికి అధికారులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. ఉదయం 7 గంటల నుంచే ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంతమంది చలిలో చంటి పిల్లలతో కలిసి పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఓటర్లు పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూకట్టారు. ఉపాధి కోసం నగరాలు, పట్టణాల్లో ఉన్న ఓటర్లు స్వస్థలాలకు తరలివచ్చారు. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు కుటుంబ సభ్యుల సాయంతో పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. ఓట్ల లెక్కింపు పూర్తయిన గ్రామాల్లో ఫలితాలను ప్రకటించారు. ఆ తర్వాత వార్డు సభ్యులతో సమావేశాలు నిర్వహించి ఉప సర్పంచి ఎన్నికలు నిర్వహించారు.

**జిల్లాల వారీగా పోలింగ్ శాతం..**

జిల్లాల వారీగా నమోదైన పోలింగ్ శాతం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిజామాబాద్ 76.71, 2జగిత్యాల 78.34, భద్రాద్రి కొత్తగూడెం 82.65, నిర్మల్ 82.67, వికారాబాద్ 82.72, ములుగు 82.93, నాగర్‌కర్నూల్ 83.98, పెద్దపల్లి 84.15, నారాయణపేట 84.33, రాజన్న సిరిసిల్ల 84.41, మంచిర్యాల 84.59, మహబూబాబాద్ 85.05, జయశంకర్ భూపాలపల్లి 85.25, రంగారెడ్డి 85.30, కామారెడ్డి 86.08, కరీంనగర్ 86.58, మహబూబ్‌నగర్ 86.62, కొమరం భీమ్ ఆసిఫాబాద్ 86.63, 86.68, సంగారెడ్డి 86.96, వనపర్తి 87.05, జోగులాంబ గద్వాల్ 87.08, హన్మకొండ 87.34, వరంగల్ 88.11, 25సిద్దిపేట 88.36, జనగాం 88.52, నల్లగొండ 88.74, మెదక్ 88.80, సూర్యాపేట 89.55, ఖమ్మం 91.21, యాదాద్రి భువనగిరి 91.72, కాగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 31 జిల్లాలలో 85.86 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు.

## శీతల గాలులు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఉదయం, రాత్రి వేళల్లో దట్టమైన పొగమంచు కమ్మే అవకాశం కూడా ఉందన్నారు. ఉత్తర, మధ్య, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఆదివారం, సోమవారం చలిగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కామారెడ్డి, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలలకు అధికారులు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు. గత కొద్ది రోజులుగా రాత్రిపూట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే దిగువకు పడిపోతుండటంతో జనం గజగజ వణుకుతున్నారు. బహిరంగ ప్రాంతాలు, శివారుల్లో చలి తీవ్రత మరింత అధికంగా ఉండటంతో ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల్లో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. చర్మం పగుళ్లు, కళ్ల నుంచి నీళ్లు కారడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలు ప్రాంతాల్లో రోడ్లపై మంచు దుప్పటిలా కమ్ముకోవడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించడం లేదు. తెల్లవారు జామున ప్రయాణాలు చేసే వారు అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. చలిగాలులు వీస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## రద్దుచేయాలని చూస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేసేందుకు 400 సీట్లు కావాలని కోరుకున్నారని, బిజెపికి 400 సీట్లు ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తారని, రిజర్వేషన్లు ఎత్తివేస్తారని రాహుల్ గాంధీ చెప్పడంతోనే దేశ ప్రజలు ఆ పార్టీని 240 సీట్లకు పరిమితం చేశారని పేర్కొన్నారు. అలా చేయబట్టే నేడు రాజ్యాంగం, రిజర్వేషన్లు ఉన్నాయని, అందుకే ఇప్పుడు ఎస్‌ఐఆర్ పేరుతో ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. నాడు పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీల కోసం గాంధీ, అంబేద్కర్ నిలబడినట్లే, ఇప్పుడు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిలుస్తున్నారని కొనియాడారు. మనం వారికి అండగా నిలవాలని కోరారు. ఎస్‌ఐఆర్ పేరుతో తొలుత ఓటరు కార్డు తొలగిస్తారని, తర్వాత ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ రద్దు చేస్తారని ఆరోపించారు. ఆ తర్వాత మనకు ఉన్న హక్కులన్నీ గుంజుకుంటారని తెలిపారు. ఈ సమస్య ఎన్నికలదో, కాంగ్రెస్ పార్టీదో కాదని, దేశ సమస్య అని, ఈ సమస్యకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేసే పోరాటంలో కలిసి సాగేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని ప్రకటించారు. దేశ ప్రజలంతా కలిసి రావాలని కోరుతున్నానని తెలిపారు. 'ఎస్‌ఐఆర్, ఓట్ల చోరీ పేరుతో దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, పేదల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆ రోజు గాంధీజీ, అంబేద్కర్ వారి కోసం నిలబడ్డారు. ఇప్పుడు రాహుల్‌గాంధీ, మల్లిఖార్జున ఖర్గే ఈ జాతి ప్రజల కోసం నిలబడి మోదీ , అమిత్‌షాకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు . ఆ ఆర్‌ఎస్‌ఎస్, ఆ గోల్వాల్కర్ భావజాలన్ని ఓడించేందుకు రామ్‌లీలా మైదానంలో మనం ఇక్కడికి ఒకటిగా చేరాం. అక్కా, తమ్ముళ్లారా ఇది పోటీ కాదు. ఇది కాంగ్రెస్ సమస్య కాదు. ఈ సమస్య దేశానిది. దేశంలో పేదలది, దళితులది, ఆదివాసీ, మైనార్టీలది. ఈ సమస్య కోసం రాహుల్ మోదీకి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అందుకే రాహుల్‌కు మరింత బలాన్ని ఇచ్చి ఆయనకు అండగా నిలబడాలి. ఈ యుద్ధంలో రాహుల్‌గాంధీని దేశం గెలిపించాలి. లేకుంటే పేదల ఓటు హక్కును లాక్కుంటారు. ఆ తర్వాత ఆధార్‌కార్డ్ తొలగిస్తారు. రేషన్‌కార్డు తీసేస్తారు. భూములు, ఆస్తులను లాక్కుంటారు. ఆదివాసీలు సర్వం కోల్పోతారు. అందుకే మనమందరూ ఒక్కటై రాహుల్‌గారికి మద్దతుగా సైన్యంగా మారి మోదీకి వ్యతిరేకంగా పోరాడాలి. తెలంగాణ తరపున మేము ఇక్కడికి వచ్చాము. మీరు మాతో పోరాడేందుకు సిద్ధమా?' సిఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు. 'ఓట్ చోర్‌గద్దీ ఛోడ్' పేరుతో ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ మహా ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ నుంచి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రసంగించారు.

## ఓట్ చోరీ

(మొదటి పేజీ తరువాయి)



సత్య నిరూపణ చేస్తుంది, ఆ సత్యమార్గంలోనే నరేంద్రమోదీ–ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతుంది'' అని హెచ్చరించారు.

కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజానుకూల పద్ధతిలో ఎన్నికల సంఘాన్ని సంస్కరిస్తుందని, బిజెపి ఓట్‌చోరీ చేసేందుకు సహకరించిన ఉన్నతస్థాయి ఎన్నికల సంఘం అధికారులను ఊరికే వదిలిపెట్టేదిలేదన్నారు. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిల పేర్లు ప్రస్తావించి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు దేశంలో ప్రజలకోసం పనిచేయడం లేదని, వారు బిజెపి కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. బిజెపి చేస్తున్న ఓట్ చోరీ గురించి ప్రశ్నించి నిలదీస్తుంటే కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు వణుకు పుడుతోందని అన్నారు.

''ఓటు దొంగ– గద్దె దిగు'' అని నినదిస్తూ ఆదివారం నిర్వహించిన భారీ ర్యాలీలో రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఇతర నాయకులు ప్రసంగించారు. సత్యం–అహింస నినాదాలనే ఆయుధాలుగా మలచుకుని నరేంద్రమోదీ–ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని బహిరంగ సభకు హాజరైన ప్రజల సమక్షంలో రాహుల్‌గాంధీ ప్రతిజ్ఞ చేశారు. ఎన్నికల సంస్కరణలపై పార్లమెంటులో చర్చ జరిగినప్పుడు 'ఓట్ చోరీ' ఆరోపణలపై అమిత్ షా మాట్లాడుతుంటే ఆయన చేతులు వణికిపోయాయని, ఆయన వైఖరి ఆయనలో పుట్టిన దడే వాస్తవాలను తెలియజేస్తున్నాయని అన్నారు.

''మేం సత్యం కోసం పనిచేస్తాం, అహింస కోసం పనిచేస్తాం, ఈ రెండు ఆయుధాలతో మోదీని, అమిత్ షాను ఓడిస్తాం, కొంచెం ఆలస్యం కావచ్చు, కానీ అంతిమంగా సత్యమే జయిస్తుంది'' అన్నారు. ''కాంగ్రెస్ సిద్ధాంతాన్ని అనుసరించేవారి డిఎన్‌ఎలో సత్యం ఉంది, బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ డిఎన్‌ఎలో అసత్యం, ఓట్‌చోరీ ఉన్నాయి'' అన్నారు.

''మేం సత్యం పక్షాన నిలబడ్డాం, సత్యాన్నే నమ్మాం, వారి దగ్గర 'సత్తా' (అధికారం) మాత్రమే ఉంది, ఆ అధికారంతో వారు ఓట్‌చోరీకి పాల్పడుతున్నారు'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిజెపి ప్రభుత్వం రూ.10,000 వంతున ఓటర్లకు బదిలీ చేసిందని, కానీ ఎన్నికల సంఘం నోరు విప్పలేదని, వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ''ఎన్నికల సంఘంలో ఉన్న ఉన్నతస్థాయి అధికారులకు ఎలాంటి హానీ కలగకుండా, వారు చేసే తప్పులన్నింటికీ కవచం తగిలించేందుకు మోదీ ఒక కొత్త చట్టాన్ని తీసుకువచ్చారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ చట్టాలను వెనక్కు మళ్ళిస్తామని చెప్పారు.

''ఎన్నికల సంస్కరణలపై చర్చ సందర్భంగా పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో అమిత్ షాకు–నాకు మధ్య వాగ్వాదం జరిగింది, ఈ వాగ్వాదంలో ఓట్‌చోరీ ఆరోపణలపై సమాధానం చెబుతున్నప్పుడు ఆయనకు దడ పుట్టింది, ఆయన చేతుల్లో నరాలు వణికిపోయాయి, పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ నేను ఆయనకు సవాలు విసిరాను, నిజాలు మాట్లాడేవారు ఎవరో దేశాన్నే చెప్పమని అడుగుదాం, అప్పటివరకూ ఎదురుచూద్దాం, మీరు గమనించారా? ఆయన (అమిత్ షా) చేతులు ఎందుకు వణికాయి? ఎందుకంటే వాళ్ళు అధికారంలో ఉన్నప్పుడు మాత్రమే ధైర్యంగా ప్రవర్తిస్తారు, వాళ్ళ దగ్గర అధికారం ఉంది కాబట్టి'' అని రాహుల్‌గాంధీ విమర్శించారు.

**బిజెపీ–దోపిడీ...**

కాంగ్రెస్‌పార్టీ దేశవ్యాప్తంగా ప్రతి మారుమూల ప్రాంతం నుండి ఓట్‌చోరీకి వ్యతిరేకంగా ఆరుకోట్లమంది సంతకాలు సేకరించింది, ఈ సంతకాలను తర్వాత భారత రాష్ట్రపతికి సమర్పిస్తుంది. ''చోరీ చేయడమే బిజెపి డిఎన్‌ఎ'' అని ఎక్స్ వేదికగా రాహుల్‌గాంధీ విమర్శించారు. ధనం దోచుకోవడం, భూమి దోచుకోవడం, వ్యవస్థలను దోచుకోవడం, హక్కులను దోచుకోవడం, ఉద్యోగాలను దోచుకోవడం, ప్రజాతీర్పును దోచుకోవడం, ఎన్నికలను దోచుకోవడం... దోపిడీ... దోపిడీ... అధికార నిచ్చేన ఎక్కడం కోసం ప్రజల నుండి బిజెపి అన్నీ దోచుకుంటుంది'' అని ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు.

**దేశాన్ని కాపాడేది కాంగ్రెస్ సిద్ధాంతమే: ఖర్గే**

బిజెపి ప్రజాద్రోహి అని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. రామ్‌లీలా మైదాన్ ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, ఓట్‌చోరీకి పాల్పడినవారు ప్రజాద్రోహులన్నారు. వారిని అధికారం నుండి తొలగించాలని పిలుపు ఇచ్చారు. ప్రజల ఓటు హక్కులను కాపాడేందుకు, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇలాంటి ద్రోహులను అధికారం నుండి తొలగించాలన్నారు. మోహన్ భగవత్, ఎం.ఎస్.గోల్వాల్కర్, మనుస్మృతి సిద్ధాంతాలు దేశాన్ని సర్వనాశనం చేస్తాయన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతం మాత్రమే దేశాన్ని కాపాడుతుందన్నారు. రాజ్యాంగాన్ని మట్టుపెట్టేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నం చేస్తున్నాయని, అదే పనిలో నిమగ్నమై ఉన్నాయన్నారు. పటేల్, నెహ్రూ మధ్య విభేదాలు నాటేందుకు సైద్ధాంతిక విభేదాల బీజాలు నాటేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము అడిగిన ప్రశ్నలకు పార్లమెంటులో మోదీ సమాధానాలు చెప్పడంలేదని విమర్శించారు. బెంగళూరులో తన కుమారుడికి శస్త్రచికిత్స జరుగుతున్నాగానీ, అక్కడికి వెళ్ళకుండా తాను ఈ సభలో పాల్గొన్నాననీ, దేశ ప్రజలను కాపాడటమే తనకు ముఖ్యమైన విషయమని ఖర్గే అన్నారు.

**బ్యాలెట్‌తో పోటీకి రండి.. ప్రియాంకా వాద్రా సవాల్**



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో కాకుండా బ్యాలెట్ పత్రాలతో ఎన్నికల్లో పోటీకి రావాలని కాంగ్రెస్ పార్టీ ఎంపి, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా బిజెపిని సవాలు చేశారు. రామ్‌లీలా మైదాన్ ర్యాలీలో ఆమె ప్రసంగిస్తూ, బ్యాలెట్ పత్రాలతో జరిగే ఎన్నికల్లో న్యాయబద్ధంగా బిజెపి విజయం సాధించి చూపించాలని సవాలు చేశారు. ప్రజల ఓటు హక్కులను ఏ విధంగా దోచుకున్నారనే విషయంపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు ఏదో ఒకరోజున దేశ ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తుందని, ఆ రోజు వస్తుందని హెచ్చరించారు. దేశంలో ఇప్పుడు జరుగుతున్న పోలింగ్ ప్రక్రియలో అడుగడుగునా సందేహాలు తలెత్తుతున్నాయన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ గ్యానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషీలపేర్లను ఈ దేశం ఎప్పటికీ మరచిపోదని, వారు దేశ ప్రజల ఓటు హక్కులను దోచుకున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలట్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం వ్యవస్థలను డొల్లగా మార్చిందని విమర్శించారు. ఎన్నికల వ్యవస్థ న్యాయబద్ధంగా పనిచేయాలన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## హైదరాబాద్‌లో విదేశీ మీడియా ప్రతినిధుల పర్యటన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మధ్య ఆసియా ప్రాంతంలోని అర్మేనియా, జార్జియా, కజాఖస్తాన్, కిర్గిజాస్తాన్, తజికిస్తాన్, తుర్క్మెనిస్తాన్‌తో పాటు ఉజ్బెకిస్తాన్ దేశాలలోని ప్రముఖ ప్రింట్, టివి, న్యూస్ ఏజెన్సీలకు చెందిన 21 మంది మీడియా ప్రతినిధులు పర్యటనలో భాగంగా ఆదివారం హైదరాబాద్ చేరుకున్నారు. ఈ బృందం 17వ తేదీ వరకు హైదరాబాద్‌లోని ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తుంది. దేశ అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న తెలంగాణలోని పలు వాణిజ్య, ఆధ్యాత్మిక, ఐటి, పర్యాటక ప్రాంతాలను ఈ ఏడు దేశాల మీడియా బృందం సందర్శిస్తుంది. ఆయా దేశాలతో వాణిజ్య, విద్య, సాంస్కృతిక సంబంధాలను దృఢ పరిచేందుకు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చేస్తున్న కృషిలో భాగంగా మీడియా బృందం పర్యటన లను ఏర్పాటు చేస్తున్నది. ఈ పర్యటన రాష్ట్ర సమాచార పౌర సంబందాల శాఖ ప్రత్యేక కమిషనర్ సిహెచ్.ప్రియాంక సమన్వయం చేస్తున్నారు.

## సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు పనివేళలు, ఉద్యోగ భద్రతకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు పనివేళలు, ఉద్యోగ భద్రతకు సంబంధించి సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివ రావు డిమాండ్ చేశారు. ఐటి ఉద్యోగుల సంక్షేమానికి సమగ్ర చట్టం చేయాలని హైకోర్టు చేసిన వ్యాఖ్యల పట్ల హర్షం వ్యక్తం చేశారు. పేరుకు వైట్ కలర్ ఉద్యోగులైనప్పటికీ విపరీతమైన పని గంటలతో పాటు, మానసిక ఒత్తిడికి ఇబ్బందులు పడుతున్నారని, చిన్న వయసులోనే జీవనశైలి వ్యాధులకు గురవుతున్నారని కూనంనేని సాంబశివ రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాలకు రక్షణ లేకుండా, వారిని ఎప్పుడు పడితే అప్పుడు ఉద్యోగాల నుంచి తొలగించడం, రాజీనామా చేస్తే డబ్బులు చెల్లించాలనే అగ్రిమెంట్లు రాయించుకోవడం పట్ల జస్టిస్ నాగేష్ భీమపాక ధర్మాసనం వ్యాఖ్యలను కూనంనేని ఆహ్వానించారు. ఐటి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, పని గంటలకు సంబంధించి సమగ్ర చట్టం తీసుకురావాలని సాంబశివరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

## నేడు బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న రవీంద్రభారతిలో పద్మవిభూషణ్, గాన గంధర్వ ఎస్‌పి.బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆవిష్కరించనున్నారు. విగ్రహావిష్కరణను అడ్డుకుంటామని పలు ప్రజా సంఘాలు హెచ్చరించడంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యానాయుడు, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు పాల్గొననున్నారు.

## 19న బిఆర్‌ఎస్ కార్యవర్గ భేటీ

హాజరు కానున్న పార్టీ అధినేత కెసిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ కార్యవర్గం, శాసనసభాపక్ష సంయుక్త సమావేశాన్ని ఈనెల 19న మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించనున్నారు. బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అధ్యక్షతన జరిగే ఈ సంయుక్త సమావేశంలో కృష్ణా గోదావరి జలాల అంశాలు,పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులు, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపైన చర్చించనున్నారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ,పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం, జలాల కేటాయింపు,గోదావరి, కృష్ణా జలాల అంశంలో ఆంధ్ర జల దోపిడి తదితర అంశాలపైన పోరాడేందుకు ఒక ఉద్యమ స్వరూపానికి ఈ సమావేశంలో శ్రీకారం చుట్టనున్నట్టు బిఆర్‌ఎస్ వర్గాలు పేర్కొనాయి. ఈ సమావేశంలో ప్రజా ఉద్యమాల నిర్మాణం, కార్యాచరణపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. గోదావరి ,కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొల్లగొడుతున్నప్పటికీ దీనిని అడ్డుకునే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఇటువంటి సందర్భంలో రాష్ట్ర ప్రజల, రైతాంగ సాగునీటి హక్కులను కాపాడేందుకు మరో ప్రజా ఉద్యమం తప్పదని, ఇందులో భాగంగా తదుపరి నిర్మించబోయే ప్రజా ఉద్యమాలకు సంబంధించి పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో లోతుగా చర్చ జరగనున్నట్టు బిఆర్‌ఎస్ ఆదివారం ఒక ప్రకనటలో తెలిపింది. తెలంగాణ,రైతాంగ ప్రయోజనాలకు బిజెపి గండి కొడుతున్నదని, తెలంగాణ రాష్ట్రానికి సాగునీటి విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని, కావేరి తదితర నదుల అనుసంధానం పేరుతో ఆంధ్ర రాష్ట్ర జలదోపిడికి సహకరిస్తున్న కేంద్ర బిజెపి విధానాన్ని ఎదుర్కోవాలంటే , తెలంగాణ సమాజం మరొకసారి ప్రత్యక్ష పోరాటాలే శరణ్యమని కెసిఆర్ భావిస్తున్నట్టు బిఆర్‌ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 91 టిఎంసిలు కేటాయిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కేవలం 45 టిఎంసిలు ఇస్తే చాలని కేంద్రం ముందు దేబరించడం బాధాకరమని బిఆర్‌ఎస్ పేర్కొంది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి 45 టిఎంసిలకు అంగీకరిస్తూ కేంద్రం వద్ద మోకరిల్లడం రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలను తాకట్టు పెట్టడమేనని, కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేయడమేనని పేర్కొంది.

# 632 ఎకరాల దేవాదాయ భూములు స్వాధీనం

'ప్రజాపక్షం' ఇంటర్వ్యూలో
దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
అక్రమార్కుల చెర నుంచి విడిపించిన ప్రజాప్రభుత్వం
252 ఎకరాల భూమిని ఇందిరా మహిళా గ్రూప్‌లకు అప్పగింత
భూముల రక్షణ కోసం సైన్‌బోర్డుల ఏర్పాటు చేస్తా



**(బిరుదరాజు వాసుదేవరాజు)**

"కబ్జాకు గురైన దేవాదాయ శాఖకు చెందిన 632.12 ఎకరాల భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ప్రజాప్రభుత్వం విజయం సాధించింది. ఇందులో 252 ఎకరాల భూమిని ఇందిరా మహిళా గ్రూప్‌లకు అందించాం. గ్రూప్‌ల సభ్యులకు స్వయం ఉపాధి కల్పన కోసం ఆ భూములలో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటును చేపట్టాం. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిరాదరణకు గురైన దేవాలయాలన్నింటినీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి చేస్తున్నది. రాష్ట్రంలో దేవాలయాల్లో ఆదాయాలు గణనీయంగా పెరిగాయి" అని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ చెప్పారు.

మంత్రి కొండా సురేఖతో 'ప్రజాపక్షం' ప్రతినిధి ఇంటర్వ్యూ ఈ విధంగా ఉంది.

**ప్రశ్న: దేవాదాయ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**మంత్రి సురేఖ :** దశాబ్దాలుగా భూ కబ్జాదారుల చేతిలో అన్యాక్రాంతమైన భూములను తిరిగి సాధించడంలో తాము పైచేయి సాధించాం. కోర్టులో ఉన్న కేసులను కూడా త్వరితగతిన క్లియర్ చేస్తున్నాం. ప్రతి దేవాలయం భూమిని జియో ట్యాగింగ్ చేశాం. ఇప్పటికే 632 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నాం. ఆక్రమణలో ఉన్న మరికొన్ని భూములను రానున్న రోజుల్లో స్వాధీనం చేసుకుంటాం. ఆలయ భూములను పరిరక్షించడంలో భాగంగా స్పెషల్ డ్రైవ్ ద్వారా సైన్ బోర్డులు ఏర్పాటు చేశాం. టిజిఆర్‌ఎసితో ఎండోమెంట్ భూముల డిజిటలైజేషన్‌తో పాటు రక్షణ కోసం జిఐఎస్‌ని ఉపయోగించి ఎండోమెంట్స్ ప్రాపర్టీల ఇన్వెంటరీ, మ్యాపింగ్ ప్రక్రియ ప్రారంభించాం.

**ప్రశ్న: దేవాదాయ భూముల నుంచి ఎలాంటి ఆదాయాలు వస్తున్నాయి?**

**మంత్రి సురేఖ :** ఖాళీగా ఉన్న దేవాదాయ భూములు తిరిగి ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు ఇప్పటికే 252.35 ఎకరాలను స్థానిక మహిళా గ్రూప్‌లకు అప్పగించాం. వాటిలో ప్రభుత్వ ప్రోత్సాహంతో సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నాం. దానిపై వచ్చే ఆదాయంతో మహిళా గ్రూప్ సభ్యుల కుటుంబాలు బాగుపడతాయి.

**ప్రశ్న: రాష్ట్రంలో ఏఏ దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నారు?**

**మంత్రి సురేఖ :** దేవాదాయ శాఖలోని వివిధ దేవాలయాలలో అభివృద్ధిలో భాగంగా బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతి దేవస్థానం, ధర్మపురిలోని శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం, కీసరలోని శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థానం, చెరువగట్టులోని శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంతో పాటు తదితర ముఖ్య దేవాలయాలకు బృహత్ ప్రణాళికలకు రూపకల్పన చేస్తున్నాం.

**ప్రశ్న: సర్వ శ్రేయోనిధి అభివృద్ధి పనులు ఎంతవరకు వచ్చాయి?**

**మంత్రి సురేఖ :** సర్వ శ్రేయోనిధి కింద రూ.105.77 కోట్ల వ్యయంతో 340 పనులు మంజూరు చేశాం. అందులో 50 శాతం పనులు పురోగతిలో ఉన్నాయి. మిగిలిన 50 శాతంలో కొన్ని పనులు ప్రారంభ దశలోనూ, మరికొన్ని పనులు టెండర్ ప్రక్రియలో ఉన్నాయి.

**ప్రశ్న: మేడారం జాతర ఏర్పాట్లుపై ఎలా జరుగుతున్నాయి?**

**మంత్రి సురేఖ :** శ్రీసమ్మక్క శ్రీసారలమ్మ జాతర 2026 అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.101 కోట్ల నిధులు విడుదల చేశాం. శ్రీసమ్మక్క శ్రీసారలమ్మ, పొడిగిద్దరాజు గోవిందరాజుల గద్దెలతో పాటుగా గద్దెల ప్రాంగణం ప్రహరీ గోడ రాతి కట్టడంతో శరవేగంగా నిర్మాణం జరుగుతున్నది. ఈ నిర్మాణం అమ్మవార్ల జాతర కంటే (15) రోజుల ముందుగానే పూర్తిచేయాలనే సంకల్పంతో పనులు కొనసాగుతున్నాయి.

**ప్రశ్న: వేములవాడ అభివృద్ధిలో బాధితులకు న్యాయం జరిగిందా?**

**మంత్రి సురేఖ :** వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం పునరాభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రోడ్డు వెడల్పు కారణంగా దుకాణాలు, ఇల్లు కోల్పోయిన బాధితులకు పూర్తి న్యాయం చేశాం. దేవాలయ పునర్ నిర్మాణానికి రూ.76కోట్ల నిధులను మంజూరు చేశాం. ఇందులో అన్నదాన సత్రాన్ని రూ.36కోట్లతో నిర్మిస్తున్నాం. దేవాలయ పునర్ నిర్మాణం అన్నసత్రం అభివృద్ధికి హెచ్‌ఎండిఎ ద్వారా రూ. 50 కోట్లు ఖర్చు పెడుతున్నాం. శ్రీబద్ది పోచమ్మ ఆలయం, వేములవాడ అభివృద్ధికి రూ.20కోట్లు మంజూరు చేశాం.

**ప్రశ్న: వేదపాఠశాల అభివృద్ధి ఎంత వరకు వచ్చింది?**

**మంత్రి సురేఖ :** రాయగిరి వద్ద రూ.43.79 కోట్ల అంచనా వ్యయంతో శ్రీకంచి కామకోటి పీఠం మార్గదర్శకత్వంలో వేద పాఠశాల అభివృద్ధి చేస్తున్నాం. శ్రీలక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం, శ్రీస్వామి వారి బంగారు గోపురానికి విమాన గోపురానికి 63 కిలోల బంగారు పూత చేయించాం. యాదగిరిగుట్టను సందర్శించే భక్తులకు షెడ్లు, డార్మిటరీ హాల్, తాగునీటి సౌకర్యం, ల్యాటేటింగ్ రూమ్‌లు, లాకర్ సౌకర్యాలు పెంచడంతోపాటు ప్రసాదం కౌంటర్లు, సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, మహిళా భక్తులకు బ్యాటరీ వాహనాలు తదితర సౌకర్యాలు కల్పించారు.

**ప్రశ్న : ఇప్పటి వరకూ రాష్ట్రంలో ఎన్ని ధర్మకర్తల మండళ్లు ఏర్పడ్డాయి?**

**మంత్రి సురేఖ :** మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్సవ కమిటీల ఏర్పాటు కోసం 2024లో జిఒ 4 జారీ చేసింది.

ఇప్పటి వరకు వివిధ స్థాయిలలో ఉన్న 443 దేవాలయాలకు ధర్మకర్తల మండళ్లను ఏర్పాటు చేశాం. అలాగే అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా జరిగేందుకు ధర్మకర్తల పదవీ కాలం ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాలకు పెంచాం.

**ప్రశ్న: దేవాదాయ శాఖలో సిబ్బంది కొరత ఉందా?**

**మంత్రి సురేఖ :** వివిధ స్థాయిలలో గల దేవాలయాలలో 324 మతపర ఖాళీలను పూర్తి భర్తీ చేయడానికి చర్యలు చేట్టాం. దాదాపుగా 16 సంవత్సరాల తరువాత శాఖలోని 646 దేవాలయాలలో పనిచేస్తున్న ఉద్యోగులను జిఒ 243, 274 ద్వారా ఆలయ పరిపాలన ఉద్యోగులను బదిలీ చేశాం.

## ఇంధన పరిరక్షణకు గాను తెలంగాణకు..
# జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంధన పరిరక్షణకు గాను తెలంగాణకు జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డు (ఎన్ఇసిఎ) 2025 రెండవ బహుమతి లభించింది. తెలంగాణ రాష్ట్ర పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ ( టిజిఆర్‌ఈడిసిఓ) నేతృత్వంలోని ఇంధన పరిరక్షణ, ఇంధన సామర్థ్యం రంగంలో తెలంగాణ అత్యుత్తమ పని తీరుకు ఈ అవార్డు లభించింది. ఆదివారం న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఎన్ఇసిఎ 2025 అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, టిజిఆర్‌ఈడిసిఓ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ వి. అనిల, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా ఈ అవార్డును అందుకున్నారు. టిజిఆర్‌ఈడిసిఓ జనరల్ మేనేజర్ జి.ఎస్.వి. ప్రసాద్ ,డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం. వెంకటరమణ పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖలోని బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బిఈఈ ) స్థాపించిన ప్రతిష్టాత్మక జాతీయ ఇంధన పరిరక్షణ అవార్డులు (ఎన్‌ఈఇఎ) 2025 కింద రాష్ట్ర పనితీరు అవార్డు విభాగంలో రెండవ బహుమతిని అందుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వానికి గర్వంగా అధికారులు ప్రకటించారు. ఈ అవార్డు తెలంగాణ ఇంధన పరిరక్షణలో స్థిరమైన, ప్రభావవంతమైన మరింత చొరవను చూపేందుకు అవకాశం కల్పించందన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో అమలు చేసిన కూల్ రూఫ్ డెమో ప్రాజెక్ట్, 36,746 చదరపు అడుగుల విస్తీర్ణంలో, సుమారు 7,000 కెడబ్ల్యూహెచ్ వార్షిక ఇంధన ఆదాతో పాటు, భవనాలలో మెరుగైన విద్యుత్ సౌకర్యాన్ని అందించడానికి దోహదపడిందన్నారు. చేసింది.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రిచ ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ల నేతృత్వంలో పునరుత్పాదక ఇంధనం, ఇంధన నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, తయారీ, పెట్టుబడులు, ఉపాధి కల్పనను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతోదంన్నారు. ఇందులో భాగంగా తీసుకు వచ్చిన తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ద్వారా రాష్ట్ర ప్రయత్నాలు మరింత బలోపేతం చేసిన సిఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు టిజిఆర్‌ఈడిసిఓ తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటాం

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
మృతుని కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేత
బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ కెటిఆర్

**ప్రజాపక్షం/నూతనకల్ :** ఇటీవల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల చేతిలో హత్యకు గురైన ఉప్పుల మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని బిఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. ఆదివారం మండలంలోని లింగంపల్లి గ్రామంలో మృతుడు మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హత్యారాజకీయాలను ప్రోత్సహిస్తుందని, అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలు గడవకముందే హత్యా రాజకీయాలను మొదలుపెట్టి ప్రజలను ఆగం చేస్తుందని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి సరిగ్గా అమలు చేసిందిలేదన్నారు. ఇచ్చిన 6 గ్యారెంటీల హామీలను తుంగలో తొక్కి తమ ఇష్టానుసారంగా పరిపాలన కొనసాగిస్తుందని అన్నారు. గత పది సంవత్సరాల కెసిఆర్ పరిపాలన కాలంలో ఎలాంటి హత్యారాజకీయాలకు తావు లేకుండా పరిపాలనను శుభప్రదంగా నడిపించడం జరిగిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలైన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలోనే ఓడిపోతామనే భయంతో హత్యా రాజకీయాలను మొదలుపెట్టిందని విమర్శించారు. చిత్తశుద్ధి ఉంటే ఇప్పటి నుండి అయినా సరైన పాలనను అందించి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. మృతుని కుటుంబానికి బిఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కచ్చితంగా ఉద్యోగం ఇప్పించే ఏర్పాటు చేస్తామన్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, కోదాడ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కె.భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో 42శాతం ఇవ్వకుంటే యుద్ధమే

బిసిల రిజర్వేషన్లపై ఎంపి ఆర్.కృష్ణయ్య




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** త్వరలో జరిగే ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలను బిసిలకు 42శాతం రిజర్వేషన్లతోనే నిర్వహించాలని, లేనిపక్షంలో యుద్ధమేనని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 14 బిసి సంఘాల సమావేశం బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి డా.ర్యాగ అరుణ్‌కుమార్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. దీనికి ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు తగ్గించి అన్యాయం చేసినా, మొత్తం గ్రామపంచాయతీ సీట్లలో 51శాతం సర్పంచ్ పదవులను బిసిలు గెలుచుకొన్నారని తెలిపారు. రాజ్యాంగబద్ధంగా, చట్టబద్ధంగా 42శాతం రిజర్వేషన్లను బిసిలకు ఇవ్వాలని, కానీ పంచాయతీ ఎన్నికల్లో 22 శాతానికి తగ్గించి, 17శాతానికి కుదించి, తీరని ద్రోహం చేశారని పేర్కొన్నారు. జనాభా లెక్కలు ఉన్నందున న్యాయస్థానాల్లో బిసి బిల్లుపై వేసిన కేసు గెలుస్తుందన్నారు. కానీ, ఆ దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసి, కేసును వాదించేందుకు సీనియర్ న్యాయవాదిని నియమించాలని కోరారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, బిసి రిజర్వేషన్లపై ప్రధానితో చర్చించకపోవడం విచారకరమన్నారు. బిసి రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం ఆగదన్నారు.

సమావేశంలో బిసి నేతలు భీంరాజు, మోదీ రాందేవ్, రాజ్‌కుమార్, మణికుమార్, నిఖిల్ తదితర నేతలు పాల్గొన్నారు.

## కవులు, రచయితలకు సాహితీ శిక్షణ అవసరం

బిసి కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలుగు రాష్ట్రాల కవులు, రచయితలకు సాహితీ ప్రక్రియల్లో శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని బిసి కమిషన్ మాజీ చైర్మన్ బి.ఎస్.రాములు పేర్కొన్నారు.

ఆదివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోయబ్ హాలులో భారతీయసాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళారత్న డా.బిక్కి కృష్ణ అధ్యక్షతన డా.యశోద గొట్టిపర్తి రాసిన నాలుగు పుస్తకాలను అతిథులు ఆవిష్కరించారు. యశోకాంక్ష కథల సంపుటిని బి.ఎస్.రాములు ఆవిష్కరించారు.

'యశో గీతిక'ను డా.పి.విజయలక్ష్మి పండిట్, 'యశోబాలానందం' పుస్తకాన్ని డా.వి.డి.రాజగోపాల్, 'శ్రీ వేంకటేశ్వర స్వామితో నేను అనే పుస్తకాన్ని' రామకృష్ణ చంద్రమౌళిలు ఆవిష్కరించారు. డా.యశోద గొట్టిపర్తి రచనలు సాహితీ చరిత్రలో అక్షరదీపాలుగా మిగిలిపోతాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా రచయిత్రి డా.యశోద గొట్టిపర్తి దంపతులను ఫౌండేషన్ చైర్మన్ డా. బిక్కి కృష్ణ ,బి.ఎస్ రాములు ఘనంగా సన్మానించారు.

డా.రాధా కుసుమ నిర్వహించిన కవిసమ్మేళనం సభికులను అలరించింది.

## ఉద్వేగంతో మాటలకు మంటలు నేర్పిన వ్యక్తి జ్వాలాముఖి

కవితాజ్వాల(కవితా సంపుటి మలిముద్రణ) ఆవిష్కరణలో వక్తలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నిత్యచైతన్యం, నిప్పులు చిమ్మే ఉపన్యాసం, సంకుచితత్వానికి అతీతమైన సహజ గంభీరం, జీవితమంతా ఉద్వేగంతో మాటలకు మంటలు నేర్పిన వ్యక్తి జ్వాలాముఖి అని పలువురు వక్తలు అన్నారు. విప్లవకవి జ్వాలాముఖి 17వ వర్ధంతి సందర్భంగా బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆదివారం కవితాజ్వాల(కవిత సంపుటి మలిముద్రణ) ఆవిష్కరణ చేశారు. డా.జతిన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రంలో విప్లవ కవి నిఖిలేశ్వర్, దర్భశయనం శ్రీనివాసచార్య, డా.నాళేశ్వరం శంకరం, విజయ రంగనాథం, ఎవి.రామాచారి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్వాలాముఖితో పాటు ఆయన సతీమణి సీతాదేవి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. అనంతరం జ్వాలాముఖితో తమకు ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా డా.జతిన్‌కుమార్ మాట్లాడుతూ జ్వాలాముఖిగా సుపరిచితమైన వీరవెల్లి రాఘవాచార్య తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక రచనల ద్వారా ప్రత్యేక స్థానం సంపాదించిన కవి, రచయిత, మేధావి, ఆయన కేవలం సాహిత్య రంగంలోనే కాకుండా సామాజిక చైతన్యంలోనూ తనదైన ముద్ర వేశారని అన్నారు. సమాజంలోని అన్యాయాలను, అసమానతలను ఎండగట్టే రచనలతో, మానవతా విలువలను ప్రతిబింబిస్తూ జ్వాలాముఖి తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచారని కొనియాడారు. విప్లవకవి నిఖిలేశ్వర్ మాట్లాడుతూ సుమారు 6 దశాబ్దాలు జ్వాలాముఖితో కలిసి ప్రయాణించాను అని, తమ ఇద్దరినీ జంటకవులని పిలుస్తారని అన్నారు. ఆయన ప్రసంగం వినడానికి వేల మంది ప్రజలు తండోపతండాలుగా సమావేశాలకు తరలి వచ్చేవారని, సభ, సమావేశాల్లో ఆయన ప్రసంగిస్తుంటే ఊపిరి బిగబట్టాల్సిందేనని, ఆ మాటలు జలపాతంలో దూకేయాల్సిందే అని పేర్కొన్నారు.

దర్భశయనం శ్రీనివాసచార్య మాట్లాడుతూ జ్వాలాముఖి విప్లవ కవిగా, మహావక్తగా, విరసం, జనసాహితి వ్యవస్థాపక నాయకులలో ఒకరిగా, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ, గ్రామీణ పేదల సంఘంలో చురుకైన కార్యశీలిగా, భారత్ చైనా మిత్రమండలి కేంద్రనాయకుడిగా చిర ప్రతిష్ఠను పొందారని అన్నారు. నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ జ్వాలాముఖి అనే పేరు, ఆ కవితా స్ఫూర్తి, ఆ విప్లవ వాగ్వైభవం ఇప్పటికీ సజీవంగా జ్వలిస్తూ, చైతన్యాన్ని రగిలిస్తూనే ఉన్నాయన్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ, పరిస్థితులు మరింత దిగజారుతూ ఆయన రచనలు, భావాలు మరింత ఎక్కువ ప్రాసంగికతను సంతరించుకుంటున్నాయని అన్నారు. జ్వాలాముఖి సోదరి విజయ రంగనాథం మాట్లాడుతూ జ్వాలాముఖి కవిత్వాన్ని లోతుగా పరిశీలించవలసిన ఆవశ్యకత, వాటికి తిరిగి ప్రాచుర్యం కలిగించవలసిన అవసరం అధికమవుతున్నది. జన విప్లవ విజయం పట్ల విశ్వాసం, మంచి భవిష్యత్తును నిర్మించుకోగలమనే అపారమైన నమ్మకం ఆయన సాహిత్యానికి ఆయువు పట్టు అని చెప్పారు. ఎవి.రామాచారి మాట్లాడుతూ జ్వాలాముఖి అనే నామం ఒక రకమైన నిర్వేదం, నిరాశ సమాజాన్ని కమ్ముకుంటున్న వేళ ఆయన సాహిత్యాన్ని తిరిగి చదువుకోవటం మనలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తుందని, ఉద్యమాల తప్పిదాలను సరిచేసుకునే దృష్టిని కలిగిస్తుందని అన్నారు. అందుకే ఈనాడు ఆయన కవితల ప్రస్తావన విప్లవాభిమానుల తలపులలోకొస్తున్నది పేర్కొన్నారు. జ్వాలాముఖి దంపతుల స్మృతికి నీరాజనంగా జ్వాలా ప్రచురణలు మరోమారు ముద్రించి కొత్తతరం పాఠకులకు అందిస్తున్నామని తెలిపారు.

## అప్పుల బాధతో పురుగుల మందు తాగి..
# ఇద్దరు రైతుల ఆత్మహత్య



**ప్రజాపక్షం/జఫర్‌గడ్ :** మండలంలోని హిమ్మత్‌నగర్‌గ్రామానికి చెందిన అదేవిధంగా తిడుగు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారని

ఎస్ఐ రామారావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన మందాపూర్ రవి (48)దాదాపు రూ.10లక్షలు అప్పు కావడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారు.

అదేవిధంగా మండలంలోని తిడుగు గ్రామానికి చెందిన బొబ్బిలి రాజు (42) తనకున్న రెండెకరాలలో వ్యవసాయం చేసుకుంటున్నాడని అప్పులు ఎక్కువై తీర్చేమార్గం లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడన్నారుఎ. మృతుల కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## గుండెపోటుతో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి మృతి

**ప్రజాపక్షం/మునుగోడు:** బిఆర్ఎస్ నుండి సర్పంచ్ గా పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థికి గుండెపోటు వచ్చి మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో చోటుచేసుకుంది.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం అదే గ్రామానికి చెందిన చెనగొని కాటంరాజు( 45) సర్పంచ్ ఎన్నికల్లో ఆగ్రామ సర్పంచ్ గా బిఆర్ఎస్ పార్టీ నుండి పోటీ చేశారు. బుధవారం జరిగిన ఎన్నికల్లో సమీప అభ్యర్థిపై 143 ఓట్లతో ఓడిపోయాడు.ఆదివారం తన నివాసంలో హఠాత్తుగా సొమ్మసిల్లి పడిపోవడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ యశోద హాస్పెటల్ కు తరలించగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాటంరాజు అకాల మృతి పట్ల ఆ గ్రామంలోని ప్రజలు శోకసముద్రంలో ఉన్నారు.



## కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిద్దాం

పలు గ్రామాలలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే బాలునాయక్, ఎమ్మెల్సీ సత్యం ప్రచారానికి అద్భుత స్పందన

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ మండలంలోని పడమటి పల్లి, యల్లారెడ్డిబావి, పడమటిపల్లి పొత్లావత్‌తండా, తూర్పుపల్లి గ్రామాల్లో కాంగ్రెస్, సిపిఐ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యంలు ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాభివృద్ధికి కృషి చేస్తారని, తన పూర్తి సహకారం ఉంటుందని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తెలివిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, కాంగ్రెస్, సిపిఐ అభ్యర్థులు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

## యాదాద్రి జిల్లాలో 91.72 శాతం

యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలో రెండవ విడత ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. ఆదివారం జిల్లాలోని భువనగిరి, వలిగొండ, బీబీనగర్, పోచంపల్లి, రామన్నపేట మండలంలో జరిగిన రెండవ విడుత ఎన్నికల సందర్భంగా 91.72 శాతం పోలింగ్ నమోదు అయ్యిందన్నారు. జిల్లాలో పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా జరిగేందుకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. రెండవ విడత ఎన్నికల ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు, ఫ్లయింగ్ స్క్వాడ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ, కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది, పోలింగ్ అధికారులు సమన్వయంతో సమర్థవంతంగా విధులు నిర్వహించారని తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన ఎన్నికలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ నెల 17వ తేదీన 3వ విడత ఎన్నికలను కూడా అధికారులు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు.

## మిర్యాలగూడ డివిజన్‌లో 88.74శాతం పోలింగ్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని పది మండలాల్లో ఆదివారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో 88.74 శాతం పోలింగ్ జరిగింది. డివిజన్‌లో సుమారు 299576 మంది ఓటర్లు ఉండగా 265821 వినియోగించుకోగా అందులో 146709 పురుషులు, 152840 మంది మహిళలు ఉన్నారు. పోలింగ్‌లో అధికంగా మహిళలే పాల్గొన్నారు. పురుషులు 130941 మంది, 134901 మంది మహిళలు మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అదేవిధంగా మిర్యాలగూడ మండలంలో 55,537 మొత్తం ఓటర్లలో 22,583 మంది పురుషులు, 23341 మంది మహిళలు ఉన్నారు. మిర్యాలగూడ మండలం కొత్తపేటలో 477 ఓటర్లలో 341 ఓటు హక్కు వినియోగించుకున్నారు. 71.5 శాతం నమోదు కాగా, జేత్యాతండాలో 96.7 శాతం పోలింగ్ నమోదైంది. కొన్ని పంచాయతీల్లో ఓటర్లు ఉదయం 11గంటలకు 70శాతం ఓటు వేశారు. డివిజన్ వ్యాప్తంగా పురుషుల కంటే మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం వేళల్లో పోలింగ్ మందకొడిగా సాగినా మధ్యాహ్నం సమయంలో ఓటర్లు కేంద్రాలకు పోటెత్తారు.

## ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికీ మేలు

ప్రభుత్వవిప్,ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య




**ప్రజాపక్షం/గుండాల:** కాంగ్రెస్ ప్రజా పాలనలో రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందని, రాష్ట్ర ప్రజలందరికి ప్రజా పాలనలో సంక్షేమ ఫలాలు అందుతాయని ప్రభుత్వ విప్ ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని బండకొత్తపల్లి, వస్తాకొండూరు, పెద్దపడిశాల, వంగాల, అంబాల, పాచిళ్ల, సుద్దాల, నూనెగూడెం, గంగాపురం గ్రామాలలో పర్యటించి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించిన గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఈరసారపు యాదగిరిగౌడ్, మోత్కూర్ మార్కెట్ కమిటి చైర్మన్ నూనెముంతల వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ బిక్షం, మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సాగర్‌లో ప్రముఖుల సందడి

చీఫ్ సెక్రటరీ,హైకోర్టు న్యాయమూర్తి లతో పాటు పలువురు ఉన్నతాధికారులు

**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జునసాగర్‌లో రెండు రోజులుగా ప్రముఖుల సందడి నెలకొంది. నాగార్జునసాగర్ ఏ పీ ఆర్ జె సి లో శని, ఆదివారాలలో కళాశాల స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ కళాశాలలో 1975నుండి2025 వరకు చదువుకున్న విద్యార్థులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరవడంతోనాగార్జునసాగర్ ప్రముఖులతో కళకళలాడింది. ఈ కళాశాలలో చదువుకొని ఐఏఎస్,ఐపీఎస్, ఐఎఫ్ఎస్ లాంటి ఉన్నత పదవుల్లో ఉన్న వారందరూ స్వర్ణోత్సవాలకు హాజరు కావడంతో నాగార్జునసాగర్‌లో ఉన్నత స్థాయి అధికారుల సందడి నెలకొంది. దీనిలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఆదివారం నాగార్జునసాగర్‌కు చేరుకొని ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని అనంతరం హిల్ కాలనీలోని తెలంగాణ టూరిజం విజయ విహార్ గెస్ట్ హౌస్ లో కొద్దిసేపు గడిపారు. సాగర్‌కి వచ్చిన వారిలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి తుకారాంజి, రిటైర్డ్ డిజిపి మహేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. రిటైర్డ్ డిజిపి మహేందర్ రెడ్డి కళాశాల సర్వోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం బుద్ధవనాన్ని తన సహచర తరగతి మిత్రులతో కలిసి సందర్శించారు. వీరికి బుద్ధవనం అధికారులు శాసన,రవిచంద్రలు బుద్ధవనం విశేషాలను తెలియజేసి బుద్ధ వనం కండువాలతో, బ్రోచర్లతో సత్కరించారు. వీరితోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్,అడిషనల్ కలెక్టర్ నారాయణ అమిత్,జెన్‌కో చీఫ్ ఇంజనీర్ మంగేష్ కుమార్,పెద్దవూర రెవెన్యూ ప్రోటోకాల్ ఆర్ఐ దండా శ్రీనివాస్ రెడ్డి,విజయ విహార్ మేనేజర్ కిరణ్ తదితరులు ఉన్నారు.



## సూర్యాపేట జిల్లాలో 89.55 శాతం పోలింగ్

ప్రశాంతంగా ముగిసిన రెండో విడత పంచాయతీ ఎన్నికలు

అధికార కాంగ్రెస్ వైపే ఓటర్ల మొగ్గు





**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో ఆదివారం జరిగిన రెండవ విడత పంచాయితీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 8 మండలాల పరిధిలో అధికారులు ఎన్నికలు నిర్వహించారు. వీటిలో సూర్యాపేట నియోజక వర్గంలోని చివ్వెంల, పెన్‌పహాడ్, కోదాడ నియోజక వర్గంలోని అనంతగిరి, చిలుకూరు, కోదాడ రూరల్, మోతె, మునగాల, నడిగూడెం మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో మొత్తం 181 గ్రామపంచాయతీలు 1628 వార్డులు ఉండగా ఇందులో 23గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు, 339వార్డులకు అభ్యర్థుల ఏకగ్రీవంగా ఎన్నకయ్యారు. మరో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురికాగా దీంతో 158 సర్పంచ్, 1287వార్డులకు అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఇందులో సర్పంచ్ అభ్యర్థులుగా 493మంది వార్డు పరిధిలో 3224మంది బరిలో ఉన్నారు. మొత్తం 2,35,137 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,14,803, స్త్రీలు 1,20,326, ఇతరులు 8 మంది ఉన్నారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం రెండు గంటల నుండి అధికారులు ఓట్ల లెక్కింపును మొదలుపెట్టారు. మొదట పోలైన ఓట్లను వార్డుల వారీగా విభజించి బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కట్టి లెక్కింపు చేపట్టారు. అనంతరం వార్డుల వారీగా గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించారు. ఈ ప్రక్రియ ముగిసిన తరువాత సర్పంచ్ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు చేపట్టారు. రాత్రి పొద్దుపోయేంత వరకు ఓట్ల లెక్కింపు అధికారులు కొనసాగించారు. ఓట్లు తక్కువగా ఉన్న గ్రామ పంచాయితీల ఫలితాలను సాయంత్రం 5 గంటల నుండి వెల్లువడ్డాయి. ఈ ఎన్నికల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదు. పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె నరసింహ లు ఎన్నికలు జరుగుతున్న ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొదటి విడత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల వైపే మొగ్గు చూపిన ఓటర్లు రెండవ విడత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ అభ్యర్థుల వైపే మొగ్గు చూపారు. అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. సూర్యాపేట నియోజక వర్గంలోని చివ్వెంల, పెన్‌పహాడ్ మండలంలో 60 శాతానికి పైగా కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులు విజయం సాధించగా కోదాడ నియోజక వర్గంలో 70 శాతానికి పైగా కాంగ్రెస్, సిపిఐ బలపర్చిన సర్పంచ్, వార్డు సభ్యులు విజయ బావుటా ఎగురవేశారు.



## ఉస్తేల నారాయణరెడ్డి గెలుపు ఖాయం

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థి ఉస్తెల నారాయణ రెడ్డి ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతుంది. గెలుపుకి మూడు అడుగుల దూరంలో ఉందని రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తెల సృజన ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేసి, భూపోరాటంలో ముందుండి పేదలకు భూములు పంచిపెట్టిన మహానుభావులు ఉస్తెల వీరారెడ్డి, నందిరెడ్డి రాంరెడ్డి ఆశయ స్పూర్తితో మహనీయుల వారసులుగా ఉస్తెల నారాయణరెడ్డి గ్రామంలోని ప్రతి కుటుంబానికి అండగా ఉన్నాడని చెప్పారు. చింతలపాలెం గ్రామ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పెట్టుకుని మీ ముందుకు సర్పంచ్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ అభ్యర్థి ఉస్తెల నారాయణరెడ్డి మాట్లాడుతూ నన్ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించినట్లైతే గ్రామంలో డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, డ్రైనేజీ పనులు, ప్రాథమిక వైద్యశాల, పశువైద్యశాల, ఇందిరమ్మ ఇల్లులు, లిఫ్టు ఇరిగేషన్ నీళ్ళు పూర్తిస్థాయిలో రైతులందరికి అందే విధంగా అలాగే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సహకారంతో గ్రామానికి కావల్సిన మౌళిక వసతులు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోర్తాల సీతారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నందిరెడ్డి ఇంద్రారెడ్డి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చింత్రియాల రవి, చింతలపాలెం మండల కాంగ్రెస్ పార్టీ కమిటి సభ్యులు, మండల సిపిఐ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

## దామరచర్ల కేంద్రం పిఒకు షోకాజ్ నోటీసు

ఒక బూత్‌లో ఎక్కువ మంది ఓటర్లు ఉండడంపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం

ఎన్నికల పోలింగ్ కేంద్రాల ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/నల్లగొండ/మిర్యాలగూడ :** రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా ఆదివారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,జిల్లా సాధారణ పరిశీలకురాలు, ఐఏఎస్ అధికారి కొర్ర లక్ష్మితో కలిసి మిర్యాలగూడ డివిజన్లోని దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లతో ముఖాముఖి మాట్లాడడమే కాకుండా, ఓటు వేసేందుకు గుర్తింపుగా తీసుకువచ్చిన గుర్తింపు కార్డుల గురించి జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణలోని ఒక పోలింగ్ బూతులో పోలింగ్ పరిస్థితిని గమనించిన జిల్లా కలెక్టర్ పరిమితికి మించి ఓటర్లు పోలింగ్ కేంద్రంలో ఉండడం పట్ల ప్రిసైడింగ్ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను ప్రిసైడింగ్ అధికారి,స్కూల్ అసిస్టెంట్ సంధ్యకు షోకాజ్ నోటీస్ జారిచేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రతిరోజూ టెలికాన్ఫరెన్స్‌తో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి తెలియజేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ తో పాటు,డిపిఓ వెంకయ్య,దామరచర్ల ప్రత్యేక అధికారి,డిసిఓ పత్యా నాయక్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రమేష్ ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన రెండో దశ స్థానిక ఎన్నికలు

జలాల్పురం మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ప్రారంభించి పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మండల వ్యాప్తంగా 21 గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం ఓటర్లు 27497కి 25066 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం 93.11 నమోదైనట్లు మండల ఎన్నికల ప్రధాన అధికారి ఆర్.భాస్కర్ తెలిపారు. అత్యధికంగా దంతూరు గ్రామంలో 1104 ఓట్లకు గాను 1055 మంది ఓట్లతో 95.47 ఓటింగ్ శాతంతో మొదటి స్థానంలోనూ, మెహర్‌నగర్‌లో 730కి 694 పోల్ అయ్యి 95.07 శాతం ఓటింగ్‌తో రెండవ స్థానంలో, కప్రాయపల్లిలో 1521 మంది ఓట్లకు గాను 1445 ఓట్లు పోల్ అయ్యి 95 శాతంతో మూడో స్థానంలో నిలిచింది. 13733 మంది పురుషులకు గాను 12415 మంది, 13763 స్త్రీలకు గాను 12651 మంది ఓట్లు వేశారు. ఎక్కడ ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీస్ సిబ్బంది పోలీస్ యంత్రాంగం మొత్తం ఎక్కడికక్కడ భద్రత ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జలాల్పురం మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సుందరంగా అలంకరించిన జలాల్పురం పాఠశాల ప్రాంగణాన్ని చూసి ఆయన మురిసిపోయి మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డిని డిప్యూటీ తహసిల్దారు నాగేశ్వరరావు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకటరెడ్డిలను అభినందించారు. ఆర్డీవో శేఖర్ రెడ్డి, ఎండిఓ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, ఎంఈఓ ప్రభాకర్ రిటర్నింగ్ అధికారులు పోలింగ్ సిబ్బంది గ్రామ ప్రజలు ఆయన వెంట ఉన్నారు.




## అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు.ఆదివారం నల్లగొండ పట్టణంలోని 7వ వార్డు లూయిస్ నగర్ లో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వార్డు ఇన్చార్జి గుండగోని సాయితో కలిసి ఓర్సు శ్రీను నర్సమ్మ దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నల్లగొండ నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు కాక నల్లగొండ పట్టణంలోనే 550 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని అన్నారు. నూతనంగా ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకొని గృహప్రవేశం చేసిన శ్రీను నర్సమ్మ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్జ రమేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాబా, కత్తుల కోటి,ఖలీల్,ఎండి జావిద్, యాదయ్య,పిల్లి రమేష్ యాదవ్,అశోక్,పాదం అనిల్ , యువజన కాంగ్రెస్ నాయకులు గాలి నాగరాజు,మామిడి కార్తీక్, కంచర్ల ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.

# ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్!

సూర్యాపేట మున్సిపాలిటీలో వెలుగు చూసిన అక్రమాలు...

వీటిపై విచారణ చేపడితే ఇలాంటివి మరెన్నో...



**ప్రజాపక్షం/సూర్యాపేట :** జాతీయ స్థాయిలో ఆదర్శ మున్సిపాలిటీగా పేరొందిన సూర్యాపేట మున్సిపాలిటీ కొంతమంది అధికారుల అవినీతి, అక్రమాలతో ప్రతిష్ఠ మసకబారుతుంది. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాల్సిన వారు అడిగినంత డబ్బులిస్తే ఏ పని అయినా చేస్తున్నారు. మున్సిపాలిటీలోని రెవెన్యూ అధికారులు తాజాగా ఏలాంటి ఇంటి నిర్మాణం లేని ఖాళీ స్థలానికి ఇంటి నంబర్ కేటాయించినట్లు వెలుగు చూసింది. ఓ వ్యక్తి రోడ్డును కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్నాడంటూ ఆ ఖాళీ స్థలం ప్రాంతంలో నివాసం ఉంటున్న కొందరు మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన టౌన్ ప్లానింగ్ అధికారులకు వెనువెంటనే సమాచారం ఇవ్వడంతో శనివారం సెలవు దినమైనా సిబ్బంది అక్కడికి వెళ్ళి పనులను అడ్డుకున్నారు. నిర్మాణం చేపట్టిన వ్యక్తులు అక్కడికి వచ్చి మాకు అన్ని అనుమతులు ఉన్నాయని మున్సిపల్ రెవెన్యూ అధికారులు ఇంటి నెంబర్ కేటాయిస్తూ ఇచ్చిన పత్రంతో పాటు ఇంటి పన్ను చెల్లించిన రశీదును వారికి చూపడంతో అందరూ అవాక్కయ్యారు. రోడ్డు ఖబ్జా చేశారన్న విషయం పక్కకు పెడితే ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయించడం అధికారుల అవినీతి, అక్రమాలకు అద్దం పడుతుంది. ఈ ఇంటి నెంబర్ల కేటాయింపులపై అధికారులు లోతుగా విచారణ చేపడితే ఇండ్ల నిర్మాణం లేకుండానే ఖాళీ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించినవి మరెన్నో వెలుగుచూసే అవకాశం లేకపోలేదు.

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని కుడకుడ సమీపంలో న్యూకలెక్టరేట్ రోడ్డుకు వెళ్ళే 100 ఫీట్ల రోడ్డును ఎవరో ఖబ్జా చేసి అక్రమ నిర్మాణం చేపడుతున్నారంటూ సూర్యాపేట మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డికి రెండవ శనివారం సెలవు దినం కావడంతో ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో వెనువెంటనే స్పందించిన ఆయన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఉయ్యాల సోమయ్యకు తిరిగి ఫోన్‌లో విషయం చేరవేశారు. తన సిబ్బందిని అక్కడికి పంపగా వారు దానిని అడ్డుకున్నారు. రోడ్డుపై నిర్మాణం చేపడుతున్న వారు ఈ స్థలం తమదని మేము దీనిని ఖబ్జా చేయలేదంటూ వారి వద్ద ఉన్న భూమికి సంబంధించిన హక్కు పత్రాలను వారికి చూపించారు. సర్వే నెంబర్ 362లో 42 ప్లాట్ నంబర్, 253 చ.గజాల విస్తీర్ణం ఉన్నట్లుగా ఆ స్థలం రిజిస్ట్రేషన్ అయ్యి ఉంది. వీటితోపాటు మున్సిపల్ రెవెన్యూ విభాగం అధికారులు తమకు ఇంటి నెంబర్ కేటాయిస్తూ జారీ చేసిన పత్రాన్ని, చెల్లించిన ఇంటి పన్ను రశీదును కూడా వారికి చూపించడం జరిగింది. అధికారులు ఖాళీ స్థలానికి నింద్ర మల్లయ్య, కల్లెం కృష్ణారెడ్డి జాయింట్ పేర్లపై ఇంటి నెంబర్ 1266/1/1 గా ఇటీవల జారీ చేయగా దీనికి సంబంధించి రూ.2,719 ఇంటి పన్నును కూడా సదరు వ్యక్తులు మున్సిపాలిటికి చెల్లించడం గమనార్హం. నిర్మాణం జరుగుతున్న ఖాళీ స్థలం కబ్జా చేసిందా... లేక వారి సొంతమా... అన్నది పక్కకు పెడితే ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయించడాన్ని చూసి అక్కడికి వచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులతోపాటు ఆ ప్రాంతవాసులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టిన వారు ఇంటి నెంబర్ కోసం దరఖాస్తు చేసుకుంటే కాళ్ళు అరిగేలా తమ కార్యాలయం చుట్టూ తిప్పుకునే అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ఏలాంటి నిర్మాణం లేని ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయించడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఇదిలా ఉంటే నిర్మాణం చేపట్టే స్థలం ప్రభుత్వానిదా (100 ఫీట్ల రోడ్డు) లేక వారి స్వంతమా అన్నది తేలాల్సి ఉంది.

సూర్యాపేట మున్సిపాలిటీలోని రెవెన్యూ విభాగం అధికారులు కేటాయించిన ఇంటి నెంబర్లపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపడితే మరెన్నో అక్రమాలు బయటపడే అవకాశం ఉంది. గతంలో కూడా అధికారులు ఇంటి నెంబర్లు కేటాయించగా గత కమిషనర్ రామాంజులరెడ్డి గుర్తించి వాటిని రద్దు చేయించారు. రెవెన్యూ విభాగంలో పనిచేస్తున్న కొందరు అధికారులు అక్రమ సంపాదనకు మరిగి ఇలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్లు మొదటి నుంచి ఆరోపణలు ఉన్నాయి. ఈ ఇంటి నెంబర్ల కేటాయింపుల్లో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లు మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. సూర్యాపేట మున్సిపాలిటి ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్న జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామా రావు ఇప్పటికైన దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఖాళీ స్థలానికి ఇంటి నెంబర్ కేటాయించింది వాస్తవమే : మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి**




ఖాళీ స్థలానికి రెవెన్యూ అధికారులు ఇంటి నెంబర్ కేటాయించింది వాస్తవమేనని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి చెప్పారు. ఆయన ప్రజాపక్షంతో మాట్లాడుతూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదిలా ఉంటే 100 ఫీట్ల రోడ్డు లో నిర్మాణం చేపట్టిన స్థలం ప్రభుత్వానిదా... లేక రోడ్డు కబ్జా చేసి నిర్మాణం చేస్తున్నారా అన్నది విచారణ జరుపుతున్నామని స్పష్టం చేశారు. ఆ స్థలం రోడ్డుదే అని తేలితే ప్రభుత్వ పరంగా సదరు వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపు

కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/కోదాడ (అనంతగిరి) :** కౌంటింగ్‌కు ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు మధ్య ఓట్ల లెక్కింపుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. ఆదివారం అనంతగిరి మండలం బొజ్జగూడెం తండ, లక్కవరం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని, కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. మధ్యాహ్నం 1 గంటల లోపు పోలింగ్ కేంద్ర ఆవరణలో ఉన్న ప్రతి ఒక్కరికి టోకెన్లు జారీచేసి ఓటు వేసే అవకాశం కల్పించాలని, మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభించాలని, కౌంటింగ్‌కు ఇబ్బంది లేకుండా రెండు ఏర్పాటు చేసుకోవాలని కౌంటింగ్ ప్రక్రియను వీడియోగ్రాఫి చేయించాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎటువంటి సెల్‌ఫోన్స్ అనుమతించకూడదని ఎన్నికల సిబ్బందికి సూచించారు. బొజ్జగూడెం తండ గ్రామ పంచాయితీలోని 8 వార్డులలో 1215 ఓట్లు ఉన్నాయని మధ్యాహ్నం 12.30 గంటల వరకు 91 శాతం, లక్కవరం గ్రామ పంచాయితీలోని 8 వార్డులలో 972 ఓట్లు ఉన్నాయని మధ్యాహ్నం 12.40 గంటల వరకు 92 శాతం పోలింగ్ పూర్తి అయిందని ఆర్ఓలు నరసింహారెడ్డి, తేజోరామ్‌లు కలెక్టర్‌కు వివరించారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## లక్షద్వీప్‌లో భారత తీర దళం ఆపరేషన్ తరలింపు

కొచ్చి: లక్షద్వీప్ నుండి కొచ్చికిఅత్యవసర వైద్య తరలింపు నిర్వహించడం ద్వారా భారత తీర దళం 75 ఏళ్ళ వృద్ధుడి ప్రాణాలు కాపాడిందని ఓఅధికారి తెలిపారు. సబాక్యూట్ సబ్‌డ్యురల్ హెమటోమా వ్యాధితో బాధపడుతున్న రోగిని ఆక్సిజన్ సహాయంతో, విమానంలో లక్షద్వీప్ లోని అగట్టి నుండి కొచ్చి లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి ఆదివారం ఉదయానికి ఆపరేషన్ పూర్తి చేశారని అన్నారు. అగట్టి ఎయిర్ ఫీల్డ్ లో రన్‌వే ఆపరేషన్‌లు మూసివేసిన తర్వాతవచ్చిన అత్యవసర అభ్యర్థన మేరకు ఐసిజి డిస్ట్రెస్ హెచ్ఎడిఆర్ యంత్రాంగాన్ని సక్రియం చేసిందని తెలిపారు. ఈతరలింపు సులభతరం చేయడానికి ఐసిజి రాత్రి గం.10 కొచ్చి ఎయిర్ పోర్టులోని ఐసిజి ఎయిర్ ఎన్‌క్లేవ్ విమానాశ్రయాన్ని ఉపయోగించారు. రాత్రి గం.11.20 ని.లకు విమానం అగట్టి ద్వీపంలో దిగింది. అక్కడ అతనిభార్య, వైద్య బృందం, అతడి పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని బయలు దేరారని చెప్పారు. కోస్ట్‌గార్డు ప్రకారం, విమానం 25 ని.లలోనే సురక్షితంగా కొచ్చి ఎయిర్ పోర్టులో ఆదివారం 1.10 కల్లా చేరింది.

### రెండేళ్ల చిన్నారి కిడ్నాప్, 'హ'త్యాచారం

## దోషి 'క్షమాభిక్ష పిటిషన్'కు రాష్ట్రపతి తిరస్కరణ

2019 అక్టోబరు 3న రవిఅశోక్ ఘుమారేకు మరణశిక్ష విధించిన 'సుప్రీం'

ఇంకా వికసించని చిన్నారి బాలిక జీవితాన్ని నిర్ధాక్షిణ్యంగా కబళించాడని వ్యాఖ్య

న్యూఢిల్లీ : మహారాష్ట్రలో 2012లో రెండేళ్ల బాలికను కిడ్నాప్‌చేసి, అత్యాచారం, హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఓ వ్యక్తి క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తిరస్కరించారు. ఆదివారం ఈ విషయాన్ని అధికారులు వెల్లడించారు. 2022, జూన్ 25 న పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్రపతి తిరస్కరించిన మూడవ క్షమాభిక్ష పిటిషన్ ఇది. 2019, అక్టోబరు 3న అత్యున్నత న్యాయస్థానం రవి అశోక్ ఘుమారేకు విధించిన మరణశిక్షను ధృవీకరిస్తూ అతని 'శరీర కోరికలను' నియంత్రించలేదని, అతడి లైంగిక ఆకలిని తీర్చుకోవడానికి మాత్రమే అన్ని సహజ, సామాజిక, చట్టపరమైన పరిమితులను అధిగమించాడని పేర్కొంది. జస్టిస్ సూర్యకాంత్ (ప్రస్తుతం భారత ప్రధాన న్యాయమూర్తి)తో కూడిన ముగ్గురు న్యాయమూర్తుల త్రిసభ్య ధర్మాసనం తన తీర్పులో 2 :1 మెజారిటీ తీర్పులో ఆ వ్యక్తి ఇంకా వికసించని జీవితాన్ని నిర్ధాక్షిణ్యంగా ముగించాడు. రెండేళ్ల చిన్నారితో అసహజ నేరానికి పాల్పడిన అతడి చర్య 'ఒక మురికి వికృతమైన మనస్సును ప్రదర్శిస్తుందని, క్రూరత్వం యొక్క భయంకరమైన కథను ప్రదర్శిస్తుంది' అని పేర్కొంది. రాష్ట్రపతి భవన్ వెల్లడించిన క్షమాభిక్ష పిటిషన్ స్థితి ప్రకారం, రవి అశోక్ ఘుమారే క్షమాభిక్ష పిటిషన్‌ను 2025 నవంబరు 6న రాష్ట్రపతి తిరస్కరించారు. అలా చెప్పబడిన తర్వాత, బాధితురాలు కేవలం రెండేళ్ల పసికందు అని తెలుస్తోంది.ఆమెను అప్పీల్‌దారు (రవి అశోక్ ఘుమారే) కిడ్నాప్‌చేసి, ఆమె తుదిశ్వాస విడిచేవరకూ నాలుగు నుండి ఐదు గంటల దాకా దాడి చేస్తూనే ఉన్నాడని, తన శారీరక కోరికలపై నియంత్రణలేని అప్పీల్‌దారుడు తన లైంగిక కోరికలను తీర్చుకోవడానికి అన్ని సహజ, సామాజిక, చట్టపరమైన పరిమితులను అధిగమించాడని, అతడు ఇంకా వికసించని జీవితాన్ని నిర్ధాక్షిణ్యంగా నాశనం చేశాడని జస్టిస్ సూర్యకాంత్ తనకు తానుగా (ఇప్పుడు పదవీవిరమణ చేసిన) జస్టిస్ రోహింటన్ ఫాలి నారిమన్‌కు తీర్పు రాస్తూ అన్నారు. అప్పీల్‌దారు తండ్రి ప్రేమను, ఆప్యాయతలను చూపించే బదులు, సమాజంలోని చెడులకు వ్యతిరేకంగా బిడ్డకు రక్షణ కల్పించే బదులు తన కామానికి ఆమెను బాధితురాలిని చేశాడని మెజారిటీ తీర్పు చెప్పింది. 'ఇది నమ్మక ద్రోహం చేయబడిన, సామాజిక విలువలు దెబ్బతినే సందర్భం.రెండేళ్ల పసిబిడ్డతో అసహజ లైంగిక సంబంధం అతడి మురికి మనస్సును, వికృతమైన మనస్సు క్రూరత్వం యొక్క భయంకరమైన కథను ప్రదర్శిస్తుంది' అని ప్రాసిక్యూషన్ తెలిపింది.ఈ సంఘటన 2012, మార్చి 6న మహారాష్ట్ర జాల్నా నగరంలోని ఇందిరానగర్ ప్రాంతంలో జరిగింది. రవి అశోక్ ఘుమారే బాధితురాలికి చాక్లెట్ ఆశ చూపించి ఆమెను ఆకర్షించి తన కామవాంఛను తీర్చుకున్నాడు.

## సాల్ట్ లేక్ స్టేడియంలో విచారణ కమిటీ, గవర్నర్ తనిఖీ

మెస్సీ ఈవెంట్‌లో గందరగోళంతో చర్యలు ముమ్మరం

చెల్లాచెదురుగా ఉన్న పాదరక్షలు, చిరిగిన బ్యానర్లు, విరిగిన రెయిలింగ్‌లు, దెబ్బతిన్న ఫైబర్‌గ్లాస్‌తో దర్శనమిచ్చిన స్టేడియం



కోల్‌కతా: కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో శనివారం అర్జెంటీనా ఫుట్‌బాల్ ఐకాన్ లియోనెల్ మెస్సీ ఈవెంట్‌లో గందరగోళం నెలకొంది. మెస్సీ కేవలం పది నిమిషాలు మాత్రమే స్టేడియంలో ఉండడం, ఆయన చుట్టూ విఐపిలు, ప్రముఖులు, భద్రతా బలగాలు మోహరించడంతో మెస్సీని చూడలేకపోయామంటూ అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేడియంలో ఉన్న ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో బెంగాల్ ప్రభుత్వం నియమించిన విచారణ కమిటీ సభ్యులు ఆదివారం వేదికను సందర్శించి నష్టాన్ని అంచనా వేసినట్లు అధికారులు తెలిపారు. భారతదేశంలోని అతి పెద్ద ఫుట్‌బాల్ మైదానాల్లో ఒకటైన స్టేడియంలో జరిగిన తనిఖీలో ముగ్గురు సభ్యుల బృందం విరిగిన ప్లాస్టిక్ కుర్చీలు, వక్రీకృత మెటల్ బారికేడ్లు, చెత్తా చెదారంతో నిండిన గ్యాలరీలను పరిశీలించిందని వారు తెలిపారు. కలకత్తా హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ అషిమ్ కుమార్ రే నేతృత్వంలో, మెస్సీ వివేకానంద యుబా భారతి క్రిరంగన్‌లోకి ప్రవేశించి స్టేడియం లోపల అతని కదలికను ట్రాక్ చేయడానికి ప్రయత్నించిన ప్రదేశం నుండి కమిటీ తన తనిఖీని ప్రారంభించిందని అధికారులు తెలిపారు. ప్రధాన కార్యదర్శి మనోజ్ పంత్, హోం కార్యదర్శి నందిని చక్రవర్తితో కూడిన ప్యానెల్ ఈనెల 13న ఈవెంట్ సందర్భంగా ఎంట్రీ కారిడార్లు, భద్రతా ఏర్పాట్లు, పరిసర గ్యాలరీలను పరిశీలించిందని వారు తెలిపారు. మరోవైపు పశ్చిమ బెంగాల్ గవర్నర్ సివి ఆనంద బోస్ కూడా ఆదివారం స్టేడియంను విడిగా సందర్శించి ప్రత్యక్ష తనిఖీ నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి, సీనియర్ పోలీసు అధికారులతో కలిసి, బోస్ సంఘటనను అంచనా వేయడంలో భాగంగా వేదికలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారని అధికారులు తెలిపారు. శనివారం సాల్ట్ లేక్ స్టేడియంలో గందరగోళం, జనసమూహం కారణంగా మెస్సీ కార్యక్రమానికి అంతరాయం కలిగిందని, గేట్లు మూసివేయబడిందని, స్టేడియం లైట్లు ఆపివేయబడ్డాయని ఆయన గుర్తించారు. ఆయన ప్రవేశాన్ని అడ్డుకునేందుకు ఈ చర్య ఉద్దేశించబడిందని గవర్నర్ ఆరోపిస్తూ వివరణాత్మక వివరణ కోరారు. కాగా, ఆదివారం స్టేడియంలో శుభ్రపరచడం, పునరుద్ధరణ పనులు నిలిపివేయబడ్డాయి. దీంతో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి, గందరగోళానికి దారితీసిన ఘటనల క్రమాన్ని పునర్నిర్మించడానికి ప్యానెల్‌కు వీలు కల్పించారని ఒక అధికారి తెలిపారు. స్టేడియం గ్యాలరీలోని అనేక బ్లాక్‌లలో చెల్లాచెదురుగా ఉన్న పాదరక్షలు, చిరిగిన బ్యానర్లు, విరిగిన రెయిలింగ్‌లు, దెబ్బతిన్న ఫైబర్‌గ్లాస్ సీట్లు కనిపించాయి. భద్రతా ఏర్పాట్లు, జనసమూహ ప్రవాహ సరళిని ప్యానెల్ పరిశీలించినప్పుడు పోలీసులు వేదిక విభాగాలను కాపలాగా ఉంచారని మరొక అధికారి తెలిపారు. విచారణ కోసం విధ్వంసం పరిధిని నమోదు చేయడానికి కమిటీతో పాటు వచ్చిన అధికారులు తనిఖీ అంతటా వీడియోగ్రఫీ మరియు ఫోటోగ్రఫీని నిర్వహించారని ఆయన చెప్పారు.

### ఈవెంట్ ఆర్గనైజర్‌కు బెయిల్ నిరాకరణ

లియోనెల్ మెస్సీని భారతదేశానికి తీసుకురావడం తన చొరవే అని ప్రముఖంగా చెప్పుకున్న క్రీడా ప్రమోటర్, నిర్వాహకుడు శతద్రు దత్తాకు ఆదివారం కోర్టు బెయిల్ నిరాకరించబడింది. 14 రోజుల పోలీసు కస్టడీకి అప్పగించబడింది. అర్జెంటీనా ఫుట్‌బాల్ స్టార్‌ను హైదరాబాద్‌కు తీసుకెళ్తున్న చార్టర్డ్ విమానం ఎక్కడానికి ప్రయత్నిస్తున్నప్పుడు శతద్రును పశ్చిమ బెంగాల్ పోలీసులు శనివారం మధ్యాహ్నం అరెస్టు చేశారు. స్టేడియం ఏ పోలీసు పరిధిలోకి వస్తుందో, ఆ బిధాన్‌నగర్ పోలీసులు స్వచ్ఛందంగా నమోదు చేసిన కేసుల ఆధారంగా, శనివారం బిధాన్‌నగర్ సౌత్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. అల్లర్లకు కారణమయ్యే ఉద్దేశ్యంతో రెచ్చగొట్టడం, స్టేడియం సముదాయంలో ఆస్తికి ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించడం, గాయాలకు దారితీసే తీవ్రమైన నేరాలు, నీటి సరఫరాకు అంతరాయం కలిగించడం, అగ్ని లేదా పేలుడు పదార్థాలను ఉపయోగించడం వంటి అభియోగాలను పోలీసులు అతనిపై మోపారు. ఆదివారం, పోలీసులు నిందితుడిని బిధాన్‌నగర్ సబ్‌డివిజనల్ కోర్టులో హాజరుపరిచి, పోలీసు కస్టడీ కోరారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. శతద్రును జైలు వ్యాన్ నుండి బయటకు తీసి కోర్టు సముదాయంలోకి తీసుకువస్తున్నప్పుడు ప్రజలు 'దొంగ, దొంగ' అని నినాదాలు చేస్తూ అతనిపై చెప్పులు విసరడంతో కోర్టు వెలుపల ఉద్రిక్తత నెలకొంది. మెస్సీ గోట్ ఇండియా టూర్ కార్యక్రమం సందర్భంగా సాల్ట్ లేక్ స్టేడియంలో జరిగిన గందరగోళానికి తన క్లయింట్ బాధ్యుడు కాదని శతద్రు తరపు న్యాయవాది కోర్టుకు వివరిస్తూ బెయిల్ కోరారు. బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన కోర్టు, అతడిని పోలీసు కస్టడీకి అప్పగించింది.

### ఉన్నత నేపథ్యం ఉన్న వ్యక్తులకే

## ప్రతిభ పరిమితం కావొద్దు




సాధారణ కుటుంబాల నుండి వచ్చిన సమర్థులను గుర్తించి మద్దతు ఇవ్వాలి

శరద్ పవార్

ముంబయి: ప్రతిభ, నాయకత్వం ఉన్నత నేపథ్యం ఉన్న వ్యక్తులకే పరిమితం కాదని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి సాధారణ కుటుంబాల నుండి వచ్చిన సమర్థులైన వ్యక్తులను గుర్తించి, వారికి మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆదివారం ఆయన ముంబయిలోని యశ్వంతరావు చవాన్ సెంటర్‌లో జరిగిన శరద్ పవార్ ఇన్‌స్పైర్ ఫెలోషిప్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి యశ్వంతరావు చవాన్ జీవితం, విలువల స్ఫూర్తితో ఈ ఫెలోషిప్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. చాలా మంది బలమైన నేపథ్యం, మద్దతు వ్యవస్థ ఉండటం వల్ల జీవితంలో విజయం సాధిస్తారు, కానీ అలాంటి మద్దతు లేకపోయినా సమాజం కోసం పనిచేయగల సామర్థ్యం, దార్శనికత ఉన్నవారు చాలా మంది ఉన్నారని, వారికి అవకాశాలు, ప్రోత్సాహం అవసరమని చెప్పారు. చవాన్ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ, పవార్ మాట్లాడుతూ ఆయన చాలా సాధారణ నేపథ్యం నుండి వచ్చారని, అయినప్పటికీ మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, దేశానికి రక్షణ మంత్రిగా, ఆర్థిక మంత్రిగా, విదేశాంగ మంత్రిగా కూడా సేవలందించారని చెప్పారు. సామర్థ్యం కొద్దిమందికే సొంతం కాదనడం యశ్వంత్‌రావు జీవితం నిదర్శనమని, ఇది సాధారణ ప్రజలలో కూడా ఉంటుందదని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత అన్నారు. ఫెలోషిప్ కార్యక్రమం ద్వారా మహారాష్ట్ర వ్యాప్తంగా అలాంటి వ్యక్తులను గుర్తించి, వారికి ఎదగడానికి ఒక వేదికను అందిస్తున్న యశ్వంతరావు చవాన్ ప్రతిష్ఠాన్ పనిని ఆయన ప్రశంసించారు. వివిధ రంగాలలో వేగంగా వస్తున్న మార్పులను ప్రస్తావిస్తూ, ముఖ్యంగా వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు (ఎఐ) పెరుగుతున్న పాత్రను ప్రముఖంగా పేర్కొన్నారు. ఎఐ ఆధారిత సాంకేతికతలు నీరు, ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూనే పంట ఉత్పాదకతను గణనీయంగా మెరుగుపరుస్తాయని, సరైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం ద్వారా, ఖర్చులను తగ్గిస్తూనే వ్యవసాయ ఉత్పత్తిని 25 నుండి 30 శాతం వరకు పెంచవచ్చన్నారు. నాసిక్ జిల్లాలోని సహ్యాద్రి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఉదాహరణను పవార్ ఉదహరిస్తూ, అది సామూహిక ప్రయత్నాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం ద్వారా యువ రైతులకు విజయవంతంగా పారిశ్రామికవేత్తలుగా మార్చిందని చెప్పారు. పవార్ ఫెలోషిప్ అవార్డు గ్రహీతలను అభినందించి, ఈ కార్యక్రమం ద్వారా పొందిన జ్ఞానం, అనుభవం గ్రామం, తాలూకా, జిల్లా స్థాయిలలో మార్పు తీసుకురావడానికి సహాయపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. పాల్గొన్నవారు మంచి పనులపై మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక ప్రభావాన్ని కొనసాగించడానికి బలమైన సంస్థలను నిర్మించడంపై కూడా దృష్టి పెట్టాలని ఆయన కోరారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్‌పి) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే మాట్లాడుతూ వచ్చే ఏడాది నుండి శరద్ పవార్ ఇన్‌స్పైర్ ఫెలోషిప్‌ను ప్రత్యేకంగా మహిళల కోసం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## సిఎఎ కింద ఇద్దరికి భారత పౌరసత్వం

అసోంలో నాలుగుకు చేరిన సంఖ్య





గువాహటి: ఒక మహిళతో సహా ఇద్దరు వ్యక్తులకు సిఎఎ కింద భారత పౌరసత్వం లభించింది. దీంతో ఈ చట్టం కింద అసోంలో పౌరసత్వం పొందిన వారి సంఖ్య నాలుగుకు చేరిందని వారి న్యాయవాది తెలిపారు. ఈశాన్య రాష్ట్రంలో ఈ చట్టం కింద ఒక మహిళకు పౌరసత్వం మంజూరు చేయడం ఇదే మొదటిసారి అని, సిల్చర్‌లోని ఫారెనర్స్ ట్రైబ్యునల్‌లో సభ్యుడిగా కూడా ఉన్న సీనియర్ న్యాయవాది ధర్మానంద దేబ్ అన్నారు. 40 ఏళ్ల ఆ మహిళ 2007లో బంగ్లాదేశ్ నుండి భారతదేశంలోకి ప్రవేశించి శ్రీభూమిలో నివసిస్తుండగా, 1975లో దేశంలోకి వచ్చిన 61 ఏళ్ల వ్యక్తి కచార్‌లో నివసిస్తున్నారని ఆయన చెప్పారు. హోం మంత్రిత్వ శాఖ శుక్రవారం సర్టిఫికేట్లను జారీ చేసిందని, అయితే సామాజిక వేధింపులు ఎదురయ్యే అవకాశం ఉన్నందున వారి పేర్లను వెల్లడించడానికి నిరాకరిస్తూ, ఆ ఇద్దరు వ్యక్తులు భారతదేశంలోకి ప్రవేశించిన రోజు ను ఒడే పౌరసత్వం అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని దేబ్ తెలిపారు. బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్‌కు చెందిన మహిళ, సిల్చార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో చికిత్స కోసం ఒక కుటుంబ సభ్యుడితో కలిసి వచ్చిందని ఆయన చెప్పారు. ఆమె శ్రీభూమికి చెందిన ఒక వ్యక్తిని వివాహం చేసుకుని, ఒక కుమారుడికి జన్మనిచ్చి అక్కడే ఉండిపోయింది.గతేడాది సిఎఎ నిబంధనలు నోటిఫై అయిన తర్వాత ఆమె పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకుందని దేబ్ తెలిపారు. గతేడాది జూలైలో ఆమె మొదటి సారిగా దరఖాస్తు చేసుకోగా, లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగిన నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ వల్ల ఏర్పడిన గందరగోళం కారణంగా తిరస్కరించబడింది. ఆమె ఇప్పుడు నివసిస్తున్న బదర్‌పూర్ ప్రాంతం పాక్షికంగా శ్రీభూమి నుండి కచార్‌కు మార్చబడటంతో, ఆమె ప్రాంతం అధికార పరిధిపై అనిశ్చితి ఏర్పడింది. న్యాయవాది మళ్లీ దరఖాస్తు చేయగా, చివరికి ఆమె కేసు ఆమోదించబడింది. సిఎఎ కింద అసోంలో పౌరసత్వం పొందిన మొదటి మహిళ ఈమే అని, ముఖ్యంగా రిజిస్ట్రేషన్ మార్గం ద్వారా రాష్ట్రంలో పౌరసత్వం పొందిన మొదటి వ్యక్తి కూడా ఈమే అని దేబ్ అన్నారు. 'ఇది పౌరసత్వ చట్టం, 1955లోని సెక్షన్ 6బితో కలిపి చదివిన సెక్షన్ 5(1)(సి) కింద మంజూరు చేయబడింది. ఇది భారత పౌరుడిని వివాహం చేసుకున్న వ్యక్తి భారతదేశంలో ఏడు సంవత్సరాలు నివసించిన తర్వాత భారత పౌరుడిగా నమోదు చేసుకోవడానికి అనుమతిస్తుంది' అని ఆయన వివరించారు. రెండవ లబ్ధిదారుడు, సిల్చార్ పట్టణ నివాసి. 11 ఏళ్ల వయస్సులో బంగ్లాదేశ్‌లోని మౌల్విబజార్ జిల్లా నుండి భారతదేశానికి వచ్చారు. స్థానికంగా వివాహం చేసుకుని కుటుంబాన్ని ప్రారంభించారు. ఆయన సహజీకరణ ప్రక్రియ ద్వారా పౌరసత్వం పొందారు. 1971 కటాఫ్ తేదీ తర్వాత భారతదేశంలోకి ప్రవేశించి, పౌరసత్వ (సవరణ) చట్టం కింద పౌరసత్వం పొందిన నలుగురు వ్యక్తులు ప్రస్తుతం అసోంలో ఉన్నారు. గత 18 నెలల్లో తాను సుమారు 25 మంది దరఖాస్తుదారులకు సహాయం చేశానని దేబ్ చెప్పారు. అయితే చాలా దరఖాస్తులు తిరస్కరించబడ్డాయి లేదా పెండింగ్‌లో ఉన్నాయి.

### కేరళ స్థానిక సంస్థల్లో భారీ విజయమంటూ

## బిజెపి గోబెల్స్ ప్రచారం

ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మండిపాటు



తిరువనంతపురం/న్యూఢిల్లీ: కేరళ స్థానిక సంస్థల ఎన్నికలలో తాము భారీ విజయం సాధించామని చెప్పుకోవడం ద్వారా బిజెపి ఒక తప్పుడు కథనాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తోందని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మొత్తం 1,199 స్థానిక సంస్థలలో, బిజెపి కేవలం ఎనిమిదింటిలో మాత్రమే తన బలాన్ని పెంచుకుందని వేణుగోపాల్ చెప్పారు. శనివారం ప్రధానమంత్రి (మోదీ), రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, ఇతర బిజెపి నాయకులు ఒకరికొకరు సమర్థించుకుంటూ కేరళలో ఒక పెద్ద మార్పు వచ్చిందని చెప్పుకున్నారు. అయితే వారు తిరువనంతపురం కార్పొరేషన్‌ను గెలుచుకోవడం నిజమేనని, తాము దానిని తేలికగా తీసుకోవడం లేదన్నారు. కానీ ఆ కార్పొరేషన్ కాకుండా, తిరువనంతపురం జిల్లా పంచాయతీలో వారికి ఒక్క సీటు కూడా రాలేదన్నారు. 2020 స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలతో పోల్చి చూస్తే, ఈసారి రెండు కొత్త మునిసిపాలిటీలను గెలుచుకున్నప్పటికీ, పాలక్కాడ, పండలం మునిసిపాలిటీలలో బిజెపి తన మెజారిటీని కోల్పోయిందని వేణుగోపాల్ అన్నారు. కేరళ బిజెపి వైపు పయనిస్తోందని ఒక తప్పుడు కథనాన్ని ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్రజల మనస్తత్వాన్ని మార్చడానికి ప్రధానమంత్రి, ఇతరులు చేస్తున్న పిఆర్ ఆధారిత ప్రయత్నం ఇది అని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీగా, బిజెపి సహజంగానే కొన్ని సీట్లు గెలుచుకుంటుందని వేణుగోపాల్ అన్నారు. 2020లో, బిజెపి 21 స్థానిక సంస్థలను నియంత్రించగా, ఈసారి, అది 29 గెలుచుకుందన్నారు. అంటే కేరళలోని స్థానిక సంస్థలలో బిజెపి ఉనికి ఇప్పటికీ ఒక శాతం కంటే తక్కువగానే ఉందన్నారు. ఇలాంటి దుర్మార్గపు ఎత్తుగడలు రాష్ట్రంలో పనిచేయవని హెచ్చరించారు. కేరళలో బిజెపి పాగా వేయకుండా నిరోధించడమే కాంగ్రెస్, యుడిఎఫ్ స్పష్టమైన వైఖరి అని ఆయన పునరుద్ఘాటించారు, అయితే బిజెపిని ఆపే పేరుతో సిపిఐ(ఎం) వంటి పార్టీలతో అధికారాన్ని పంచుకోవడం ఊహించలేని విషయమని స్పష్టం చేశారు. యుడిఎఫ్ విజయం వెనుక ప్రధాన కారణం పినరయి విజయన్ ప్రభుత్వమేనని వేణుగోపాల్ అన్నారు. ఆ ప్రభుత్వం తన చర్యల ద్వారా ప్రజల నుండి విస్తృత వ్యతిరేకతను మూటగట్టుకుందని ఆయన ఆరోపించారు. యుడిఎఫ్ పనితీరును ప్రశంసిస్తూ 2020తో పోలిస్తే ఈ కూటమి గణనీయమైన పురోగతిని సాధించిందని, గ్రామ పంచాయతీలలో తన సంఖ్యను 321 నుండి 505కు, బ్లాక్ పంచాయతీలలో 38 నుండి 79కి, జిల్లా పంచాయతీలలో 2 నుండి 7కి, మునిసిపాలిటీలలో 39 నుండి 54కి, కార్పొరేషన్లలో 1 నుండి 4కి పెంచుకుందని వేణుగోపాల్ చెప్పారు. 'ఈ విజయం ఏ ఒక్క వ్యక్తికి చెందింది కాదు. ఇది సామూహిక నాయకత్వం, సామూహిక కృషి ఫలితం. ఒక్క రోజు కూడా వృథా చేయకుండా, అసెంబ్లీ ఎన్నికల కోసం వ్యూహాలు, కార్యక్రమాలతో ముందుకు సాగాలని పార్టీ నిర్ణయించింది' అని ఆయన అన్నారు.

### లడఖ్ విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ హెచ్ఐఎఎల్‌కు..

## యుజిసి 'గుర్తింపు' మంజూరు చేయాలి

కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్‌సింగ్



న్యూఢిల్లీ: లడఖ్‌కు చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్థాపించిన హిమాలయన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆల్టర్నేటివ్స్ (హెచ్ఐఎఎల్) ఆదర్శప్రాయంగా పనిచేస్తున్నదని, దానికి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) తప్పక గుర్తింపు మంజూరు చేయాలని పార్లమెంటరీ ప్యానెల్ ప్రస్తావించింది. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఒక నివేదికలో, కమిటీకి నేతృత్వం వహించిన కాంగ్రెస్ ఎంపి దిగ్విజయ్ సింగ్ హెచ్ఐఎఎల్ గుర్తింపు యుజిసి వద్ద పెండింగ్‌లో ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ఏఎల్ నమూనాను విద్యా మంత్రిత్వ శాఖ నిశితంగా అధ్యయనం చేయాలని, విద్యా కేంద్రాల ఆవిష్కరణ లేదా ఇతర జోక్యాల ద్వారా ఇది మరెక్కడ ఎలా ప్రతిరూపంగా ఉంటుందో పరిశీలించాలని కూడా ప్యానెల్ సిఫార్సు చేసింది. 'హెచ్ఐఎల్‌కు యుజిసి ఇంకా గుర్తింపు ఇచ్చిందని, ఈ విషయం చాలా సంవత్సరాలుగా పరిశీలనలో ఉందని తెలుసుకుని కమిటీ ఆందోళన చెందింది. హెచ్ఐఎఎల్ స్థానిక సమాజంపై అద్భుతమైన ప్రభావాన్ని సాధించింది. దాని మంచు స్థూపాలు, ఇతర కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యకలాపాల ద్వారా అంతర్జాతీయంగా గుర్తింపు పొందింది' అని కమిటీ గమనించింది. అనుభవపూర్వకమైన, ప్రాజెక్ట్ ఆధారిత సమాజ ఒప్పందం భారతీయ జ్ఞాన వ్యవస్థ (ఐకెఎస్) ఏకీకరణకు పిలుపునిచ్చే నూతన విద్యావిధానం(ఎన్ఇపి)2020 అమలులో హెచ్ఐఎఎల్ ఆదర్శప్రాయంగా ఉందని పార్లమెంటరీ ప్యానెల్ గుర్తించింది. 'హెచ్ఐఏఎల్‌కు గుర్తింపు మంజూరు చేయడంలో యుజిసి విఫలమైందని ప్యానెల్ సిఫార్సు చేసింది. అంతేకాకుండా ప్యానెల్ ప్రోత్సహిస్తోంది. హెచ్ఐఏఎల్ నమూనాను యుజిసి, డిపార్ట్‌మెంట్ నిశితంగా అధ్యయనం చేయాలి. దానిని సెంటర్ ఆఫ్ ఇన్నోవేషన్ లేదా ఇతర జోక్యాల ద్వారా ఇతర చోట్ల ఎలా ప్రతిబింబించవచ్చో పరిశీలించాలి' అని నివేదిక తెలిపింది. లడఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరవ షెడ్యూల్ హోదాను డిమాండ్‌చేస్తూ నిర్వహించిన ఆందోళనలలో చోటుచేసుకున్న హింసాత్మక నిరసనలలో కేంద్రపాలిత ప్రాంతంలో నలుగురు మరణించగా, 90మంది క్షతగాత్రులయ్యారు. రెండు రోజుల తర్వాత సెప్టెంబరు 26న వాంగ్‌చుక్‌ను కఠినమైన ఎన్ఎస్ఏ కింద అదుపులోకి తీసుకున్నారు. హింసను ప్రేరేపించాడని ప్రభుత్వం ఆయనపై ఆరోపించింది. లడఖ్ పరిపాలన హెచ్ఐఏఎల్‌కు భూమి కేటాయింపును దర్దు చేసింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉల్లంఘలను పేర్కొంటూ దాని విదేశీవిరాళ (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సిఆర్ఏ) రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది.

### కారుపైకి దూసుకెళ్లిన బస్సు

## ముగ్గురు మృతి

హమీర్‌పూర్(యుపి):బుందేల్‌ఖండ్ హైవేపై ఆదివారం ఉదయం కారుపైకి బస్సు దూసుకెళ్లడంతో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యుపిలోని హమీర్‌పూర్ బుందేల్‌ఖండ్ ఎక్స్‌ప్రెస్ హైవేపై ఆదివారం ఉదయం మౌదహా పోలీస్‌స్టేషన్ పరిధిలో అధిక వేగంతో బస్సు కారుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. మృతులు సిద్దగోపాల్(60), రామ్ సహోదర్ (40), ఘనశ్యామ్ (55) మహోబా జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. తీవ్ర గాయాలపాలైన నలుగురు బాధితులని అత్యవసర చికిత్స నిమిత్తం బంద మెడికల్ కాలేజికి తరలించారు. వీరందరు కలిసి మృతుల్లో ఒకరైన తన తల్లి అస్థికలను ప్రయాగ్‌రాజ్‌లో నిమజ్జనం చేయడానికి వెళ్తున్నారని మౌదహా ఎస్‌హెచ్ఓ సంతోష్ తెలిపారు. ఈ సంఘటన అనంతరం బస్సు డ్రైవర్ పరారయ్యాడు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## కశ్మీర్‌లో భారీగా పడిపోయిన ఉష్ణోగ్రతలు

ఘనీభవన స్థాయి కంటే ఎక్కువగా నమోదు



శ్రీనగర్:కశ్మీర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. రీజియన్‌లో ఎత్తయిన ప్రాంత్రాల్లోని అనేక ప్రదేశాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు ఘనీభవన స్థానం కంటే ఎక్కువగా ఉన్నాయని, ఈ విధంగా ఉండడం ఈ నెలలో ఇదే తొలిసారి అని అధికారులు చెప్పారు. జమ్ముకశ్మీర్ గందేర్‌బాల్ జిల్లాలోని శ్రీనగర్-ద్రాస్ అక్షం వెంబడి జోజిలా పాస్, మినామార్గ్, బాల్టాల్ వద్ద మంచు కురిసింది. బండిపోరా జిల్లా గురేజ్ లోయలోని తులైల్‌లో కూడా భారీగా మంచు కురిసినట్లు అధికారులు తెలిపారు. ఈ డిసెంబర్‌లో మొదటిసారిగా జమ్ముకశ్మీర్ వేసవి రాజధాని శ్రీనగర్‌లో శుక్రవారం రాత్రి మైనస్ 2.9 డిగ్రీల సెల్సియస్‌తో పోలిస్తే దాదాపు ఐదు డిగ్రీలు ఎక్కువగా 2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఈ సీజన్‌లో రాత్రి ఉష్ణోగ్రత సాధారణం కంటే 3.2 డిగ్రీలు ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌లో పుల్వామా అత్యంత శీతల ప్రదేశం. మైనస్ 2.7 డిగ్రీల సెల్సియస్ కనిష్టంగా నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రత ఘనీభవన స్థానం కంటే తక్కువగా ఉన్న ఏకైక ప్రదేశం ఇదే. శ్రీనగర్, లోయలోని చాలా ప్రాంతాలను తెల్లవారుజామున దట్టమైన పొగమంచు కప్పేసింది. దక్షిణ కశ్మీర్ లోని ఖాజిగుండ్, కోకెర్నాగ్‌లలో 0.8 డిగ్రీల సెల్సియస్ కనిష్టంగా నమోదవగా, ఉత్తరకశ్మీర్ లోని కుప్వారాలో కనిష్టంగా 1.2 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. గుల్మార్గ్‌లో, కనిష్ట ఉష్ణోగ్రత 1.4 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. దక్షిణ కశ్మీర్‌లోని అమర్‌నాథ్ యాత్రకు బేస్ క్యాంప్ లలో ఒకటైన పహల్గామ్‌లో కనిష్టంగా 2.4 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. డిసెంబర్ 21న ప్రారంభమయ్యే 40 రోజుల అత్యంత కఠినమైన శీతాకాలం 'చిల్లై కలాన్' వైపు కశ్మీర్ కదులుతోంది. ఆ సమయంలో హిమపాతం ఎక్కువగా ఉంటుంది. పాదరసం గణనీయంగా తగ్గుతుంది. డిసెంబర్ 2021 తేదీలలో 'చిల్లై కలాన్' ప్రారంభమైనప్పుడు లోయలోని చెల్లాచెదురుగా ఉన్న ప్రదేశాలలో తేలికపాటి వర్షం లేదా మంచు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# సాహితీ విహారి



## సాధారణ పదాలు.. జీవిత సత్యాలు..

కాలాతీత రచన..

భుజంగరాయ శర్మ శత జయంతి నేడు

సినీ గీతాలను కవిత్వంగా పరిగణలోకి తీసుకోవాలా? లేదా? అనేది దశాబ్దాలుగా చర్చకు వస్తున్న అంశం... ఇప్పటికీ ఏకాభిప్రాయం లేని అంశం కూడా ఇదే. ఓ కవి రాసిన కవితలను సినిమాల్లో పాటలుగా ఎంచుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. మహాకవి శ్రీశ్రీ 'మహాప్రస్థానం'లోని ఎన్నో గేయాలు పాటల రూపంలో వినిపించాయి. ఆయన నేరుగా సినిమాలకు రాసిన పాటలను ఇప్పటికీ, ఉద్యమాలకు స్ఫూర్తిగానూ... ఆత్మస్థైర్యానికి ప్రతీకలుగానూ పరిగణిస్తాం. కాబట్టి, సినిమాలో పాటా లేక పుస్తకంలో కవితనా అనే తేడా లేకుండా, అభ్యుదయ భావాలతో గొప్ప సందేశాలనిచ్చే ప్రగతిశీల రచనలకు గౌరవించి తీరాలి. ఎస్వి భుజంగరాయ శర్మగా అందరికీ తెలిసిన శ్రీరాం వేంకట భుజంగరాయశర్మ శత జయంతి సందర్భంగా ఆయన రాసిన ఓ పాటను ప్రస్తావించుకోవడం సముచితం. అర్థవంతం. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కొల్లూరు గ్రామంలో 1925 డిసెంబరు 15న జన్మించిన భుజంగరాయ శర్మ గొప్ప కవి. విమర్శకుడు. చిత్రకారుడు. నటుడు. ప్రయోక్త. విద్యావంతుడు. ఒక్క మాటలో చెప్పాలంటే బహుముఖ ప్రతిభావంతుడు. ఆయన సినిమాల పట్ల అంతగా శ్రద్ధ చూపలేదు. అలాంటి ప్రయత్నం కూడా చేయలేదు. కానీ, అప్రయత్నంగానే ఓ సినిమాలో పాట రాయాల్సి వచ్చింది. 1967లో విడుదలైన 'రంగులరాట్నం' సినిమా కోసం భుజంగరాయ శర్మ రాసిన 'ఇంతేరా ఈ జీవితం.. తిరిగే రంగుల రాట్నము' అనే టైటిల్ సాంగ్ అప్పటికీ.. ఇప్పటికీ.. ఎప్పటికీ ఓ ఆణిముత్యంగా నిలిచిపోతుంది. బతుకు సారాన్ని, జీవితంలో ఎదురయ్యే ఎత్తుపల్లాలలను... ఆటుపోట్లను అత్యంత సరళ భాషలో చెప్పడం ఆయనకు మాత్రమే సాధ్యమైంది. ఈ పాట జీవితం మీద ఉన్న నిర్మమమైన కానీ నిజాయితీ గల తాత్విక గీతం. ఇందులో గొప్పతనం భావోద్వేగ ఆర్భాటంలో కాదు, నిర్దాక్షిణ్యమైన సత్యాన్ని ప్రశాంతంగా చెప్పడంలో ఉంది. పల్లవిలోనే జీవితంలోని అస్థిరతను పునాది చేసుకొని కదులుతాయి. సంపద శాశ్వతం కాదు, పేదరికం కూడా శాశ్వతం కాదు. కాలం ఒకే తీరుగా ప్రవహించదు.

పాట ప్రారంభంలోనే

**'కలిమి నిలవదు లేమి మిగలదు**
**కలకాలం ఒక రీతి గడవదు**
**నవ్విన కళ్ళే చెమ్మగిల్లవా**
**వాడిన బ్రతుకే పచ్చగిల్లదా'** అంటూ గొప్ప ఆశాభావాన్ని ఆవిష్కరిస్తాడు. సంపద ఎప్పటికీ నిలవదు... పేదరికం ఎప్పటికీ కొనసాగదు.. అన్ని రోజులు ఒక్కటిగా నడవవు అంటూ, గర్వపడాల్సిన అవసరంగానీ... కుంగిపోవాల్సిన ఆగత్యంగానీ లేవని అంటాడు. నవ్విన కళ్లే చెమ్మగిల్లుతాయంటూ, ఎంత గొప్పవాడికైనా జీవితంలో బాధలు తప్పవని హెచ్చరిక చేస్తాడు. అదే సమయంలో, వాడిపోయిన బతుకులు కూడా, ఎప్పుడో ఒకప్పుడు మళ్లీ చిగురిస్తాయన్న వాస్తవాన్ని తేల్చి చెప్తాడు. గిరగిర తిరిగే 'రంగుల రాట్నం'లో ఏదీ స్థిరం కాదు.. బాధ లేదా సంతోషం... కష్టం లేదా సుఖం... ఐశ్వర్యం లేదా పేదరికం.. ఏదీ శాశ్వతం కాదు. నిరంతర మార్పే ప్రకృతి నియమం. విశ్వ ప్రయాణమే మార్పులమయం. మొదటి నాలుగు పంక్తుల్లో ఆశావాదం లేదు, నిరాశావాదం లేదు.. ఉన్నది కేవలం యథార్థం. నవ్విన కళ్ళు కూడా తడుస్తాయి, వాడిన జీవితం కూడా మళ్లీ పచ్చబడుతుంది. అంటే బాధ శాశ్వతం కాదు, ఆనందం కూడా శాశ్వతం కాదు.

మొదటి చరణంలో..

**'ఏనుగుపైని నవాబు పల్లకిలోని షరాబు**
**గుఱ్ఱము మీది జనాబు గాడిదపైని గరీబు**
**నడిచే దారుల గమ్యమొక్కటే**
**నడిపే వానికి అందరొక్కటే'** తారతమ్యాలు ఎన్ని ఉన్నా... జీవన రీతిలు ఎంత విభిన్నమైనా.. చివరి మజిలీ ఒక్కటేనన్న తాత్విక ధోరణి ఇందులో కనిపిస్తుంది. నడిచేదారుల గమ్యమొక్కటేనని చెప్పడం ద్వారా చిన్నాపెద్దాలేని జీవితాలను... అంతరాలు లేని సమాజాన్ని సూచిస్తాడు రచయిత. ఏనుగు–పల్లకి–గాడిద వంటి ప్రతీకలతో సామాజిక అసమానతను చూపిస్తూనే, దాని అర్థరహితత్వాన్ని బట్టబయలు చేస్తుంది. ఎవరెంత ఎత్తులో ఉన్నా, నడిచే దారి ఒకటే, నడిపేవాడు.. కాలం.. అందరికీ ఒకడే. ఇది అహంకారానికి సూటి దెబ్బ.

**'కోరిక ఒకటి జనించు తీరక ఎడద దహించు'** అంటూ బుద్ధుడి సూత్రాన్ని చెప్పినా..

**'కోరనిదేదో వచ్చు శాంతి సుఖాలను తెచ్చు'** అంటూ రేపువచ్చే మంచి రోజును ప్రస్తావించినా.. వాస్తవ జీవిత సత్యాలను అద్భుతంగా వివరిస్తాడు భుజంగరాయ శర్మ.

**'ఏది శాపమో ఏది వరమ్మో**
**తెలిసీ తెలియక అలమటించుటే'** అనే వాక్యాలు దాదాపు ప్రతి ఒక్కరికీ, ఏదో ఒక సమయంలో వర్తిస్తాయి. ఏది మంచో... ఏది చెడో తెలుసుకోలేకపోతే, పొరపాటు నిర్ణయాలు తీసుకుంటే, జీవితమంతా అలమటించక తప్పదని చెప్పకనే చెప్పాడు. కోరికలపై ఉన్న భాగం ఈ పాటలోని తాత్విక హృదయం. కోరినది దక్కకపోతే దహనం, కోరనిదే వచ్చి శాంతి ఇవ్వడం– ఇక్కడ మనిషి తన అజ్ఞానంతో తానే తన్నుకుంటున్నాడనే భావన స్పష్టంగా కనిపిస్తుంది. ఏది వరమో, ఏది శాపమో మనకు ముందుగా తెలియదు; తెలిసీ తెలియక అలమటించడమే మనిషి స్వభావం. సినిమాలో సందర్భాను గుణంగా వచ్చే పాట కాబట్టి, అందులోని ఘట్టాల ఆధారంగా...



**'త్యాగమొకరిది ఫలితమొ–కరిది**
**అమ్మప్రాణమా ఇద్దరిదీ**
**వ్యథలూ బాధలు కష్టగాథలు**
**చివరికి కంచికి వెళ్ళే కథలే'** అంటూ తర్వాతి చరణాలు సాగుతాయి. తర్వాతి చరణం కూడా సినిమాలో సన్నివేశానికి, సందర్భానికి తగట్టుగానే ఉంటుంది. అదే సమయంలో రచయిత తనదైన శైలిని కూడా అందులో పొందుపరచడం ఓ అద్భుత ప్రయోగం. నిజంగా, 'త్యాగమొకరిది ఫలితమొకరిది' అన్న పంక్తి కఠినమైన నిజం. శ్రమ చేసే వాడు ఫలితం పొందడు, ప్రేమించే వాడు బాధ పడతాడు. అమ్మ ప్రాణం ఇద్దరిదీ అన్నది త్యాగానికి అత్యున్నత ఉదాహరణ. ఇక్కడ భావోద్వేగం ఉంది కానీ సెంటిమెంటాలిటీ లేదు.

**'ఆగదు వలపు ఆగదు వగపు**
**ఆరదు జీవనమాగదు**
**ఎవరు కులికినా ఎవరు కుమిలినా**
**ఆగదు కాలం ఆగదు'** సంతోషాలు.. సంతాపాలు... కష్టాలు.. సుఖాలు.. కన్నీళ్లు.. కేరింతలు.. ఇలాంటి వాటితో సంబంధం లేకుండా కాలం ముందుకు సాగుతునే ఉంటుంది. చివరికి కంచికి వెళ్లే కథలే అన్న మాట మొత్తం గీతానికి మూలసూత్రం. ఎంత పోరాటం, ఎంత ప్రేమ, ఎంత బాధ... అన్నీ చివరికి ముగిసేవే.

**'ఇరుగింటిలోన ఖేదం పొరుగింటిలో ప్రమోదం**
**రాలినపువ్వులు రెండు పూచే గుత్తులు మూడూ**
**ఒకరి కనులలో చీకటిరేయి**
**ఇరువురి మనసులు వెన్నెలహాయి'** అన్న జీవన వైవిధ్యాలను ప్రతీతాత్మకంగా వివరిస్తాడు రచయిత. ఈ విధంగా చివరి భాగంలో కాలాన్ని ఆపలేమనే సత్యాన్ని మళ్లీ దృఢంగా చెబుతుంది. ఎవరు నవ్వినా, ఎవరు కుమిలినా కాలం ముందుకే వెళ్తుంది. ఇది మనిషిని చిన్నవాడిగా చూపించదు; మనిషికి తన స్థానం గుర్తు చేస్తుంది. చివరి పంక్తుల్లో విరుద్ధ దృశ్యాలు.. ఇరుగింటిలో బాధ, పొరుగింటిలో ఆనందం; ఒకరి కళ్లలో చీకటి, మరొకరి మనసులో వెన్నెల.. జీవితం ఎప్పుడూ ఏకరేఖీయంగా ఉండదని సూచిస్తాయి. మొత్తంగా, ఈ పాట గొప్పతనం దాని నిజాయితీలో ఉంది. ఇది ఓదార్పు ఇవ్వదు, మోసం చేయదు, ఆశలు అమ్మదు. జీవితం ఎలా ఉందో అలా చూపిస్తుంది. అదే దీని విలువ, అదే దీని బలం. అందుకే ఇది కాలాతీత కవిత్వంగా విరాజిల్లుతున్నది. భుజంగరాయ శర్మ వంటి గొప్ప రచయిత సినిమాల పట్ల ఆసక్తి ప్రదర్శించలేదు... లేకపోతే మరెన్ని సమాజాన్ని తట్టి లేపే... జీవిత విలువలను తెలియచేసే.. నిజాలను కళ్ల ముందు ఉంచే పాటలు వచ్చి ఉండేవో!

– సత్యశ్రీ

### బహుముఖ ప్రజ్ఞ.. భుజంగ రాయ..

భుజంగరాయశర్మ గురించి సామాజిక మాధ్యమాల్లో ఉన్న సమాచారం మేరకు ఆయన ప్రాథమిక విద్య, సెకండరీ విద్య కొల్లూరులో ముగిసింది. తరువాత నెల్లూరులోని వెంకటగిరిరాజావారి కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివాడు. ఇంటర్ తర్వాత, వాల్తేరులోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు అభిమాన విషయంగా బిఎ(ఆనర్సు) పూర్తిచేశాడు. ఇతనికి ఏటుకూరి వెంకట నరసయ్య, పింగళి లక్ష్మీకాంతం, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి గురువులు. ఆనర్స్ డిగ్రీ సంపాదించిన తరువాత కొంత కాలం చెన్నైలోని పచ్చయప్ప కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశాడు. ఆ తర్వాత తన మిత్రుడైన దొడ్ల రామచంద్రారెడ్డిని ప్రోత్సహించి కావలిలో 1951లో 'విశ్వోదయ' విద్యా సాంస్కృతిక సేవా సంస్థ స్థాపింపచేశాడు. ఆ సంస్థ తరఫున నడిచిన 'విశ్వోదయ' కాలేజీలో తెలుగువిభాగం అధిపతిగా, ఆ తరువాత ప్రిన్సిపాల్‌గా పనిచేశాడు. ఈ కళాశాల లోగోను భుజంగరాయ శర్మ స్వయంగా చిత్రించాడు. కళాశాల ప్రార్థనాగీతం కూడా అతనే రాశాడు. ఆచార్య జి.న్ రెడ్డి, వకుళాభరణం రామకృష్ణ వంటి ఎంతో మంది ఆయనకు శిష్యులు. భుజంగరాయ శర్మ కొంతకాలం అధికార భాషా సంఘం సభ్యుడిగా వ్యవహరించాడు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు అధ్యయనమండలి చైర్మన్‌గా కూడా సేవలందించాడు. ఇతడిని ఆ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. యూనివర్సిటీలో చదువుకునే రోజులలో ఇతడు అనేక నాటకాలలో వేషాలు వేశాడు. ముద్దుకృష్ణ రచించిన 'అశోకం' నాటకంలో ప్రధాన పాత్ర, 'అనార్కలి' నాటకంలో సలీం, 'విశ్వంభర' నాటకంలో ప్రధాన పాత్ర, 'మెక్‌బెత్' నాటకంలో టైటిల్ పాత్ర ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. భుజంగరాయ శర్మ రచించిన అనేక నృత్య రూపకాలను వెంపటి చినసత్యం కూచిపూడి నాట్యబృందం దేశ విదేశాల్లో ప్రదర్శించింది. అప్పుడు ఆ బృందంతో పాటు ఇతడు కూడా అమెరికాలో పర్యటించాడు. పత్రాయని సంగీతరావు, వెంప టి చినసత్యంలతో కలిసి కూచిపూడి త్రయంగా పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నాడు. వారు ముగ్గురూ కలిసి రాసిన శ్రీకృష్ణ పారిజాతం, చండాలిక, కల్యాణ శాకుంతలం, శ్రీనివాస కల్యాణం,కళ్యాణ రుక్మిణి వంటి నృత్యరూపకాలు పేరుగాంచాయి. ఇవి ఆధునిక యక్షగానాలుగా పేరు పొందాయి. ఎవరూ ఇంతవరకూ దృష్టి పెట్టడానికి సాహసించని పరిశోధనాత్మక అంశాలను ఎంచుకోవడం భుజంగరాయశర్మ గొప్పతనం. ఇవి చాలా చిన్న అంశాలుగా పైకి కనిపించినా వీటికి పరిశోధన, అధ్యయనం ఎక్కువగా అవసరమవుతాయి. ఉదాహరణకు, ఒక భర్తను అర్థం చేసుకోవడమే కష్టసాధ్యమైన పరిస్థితిలో ద్రౌపది ఏకంగా అయిదుగురు భర్తలను ఎలా అర్థం చేసుకుందన్నది ఎవరికైనా ఆసక్తికరమే. ఇతడు తన 'విధి వంచిత ద్రౌపది' అనే వ్యాసంలో ద్రౌపది మనోగతాన్ని అద్భుతంగా ఆవిష్కరించాడు. అదే విధంగా ఇతడు శకుంతల, సత్యభామ, రాధ వంటి పాత్రలను కూడా విభిన్న కోణాల నుంచి విశ్లేషించాడు. ఈ నాయికల బాహ్య సౌందర్యం గురించి కాకుండా వారి అంతస్సౌందర్యానికి ఇతడు పెద్దపీట వేశాడు. ఇక ఊర్వశి పాత్ర గురించి కూడా శర్మ అద్భుత విశ్లేషణ జరిపాడు. పురాణ కథల్లో ఊర్వశి పాత్రను చిత్రీకరించిన తీరు నుంచి ఇటీవల రవీంద్రుడు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, చలం వంటి వారు మలచిన తీరు వరకూ ఆయన వివిధ కవుల, భావ కవుల ఊర్వశి చిత్రీకరణను తన 'సాహిత్యోర్వశి' వ్యాసంలో ప్రత్యేకంగా ప్రస్తావిస్తూనే ఆమె ఏ విధంగా స్త్రీపురుషుల మధ్య తరగని ఆకర్షణకు, కరగని అనురాగానికి ప్రతిరూపంగా నిలిచిందో చక్కని పదజాలంలో వివరించాడు. ఇతడు వ్రాసిన కవితా వాల్మీకం, తిక్కన్నగారివి సూర్యోదయాలు రెండు, నన్నయ్యగారి నాటకీయత, చిత్రాంగి, సత్య, ఆత్రేయ పద్యకవిత, కృష్ణశాస్త్రి, ఆచంట శారదా దేవిగారి వానజల్లు వంటి వ్యాసాలన్నీ పాఠకులను, పరిశోధనాభిలాషులను ఓ కొత్త, వినూత్న తెలుగు సాహితీ ప్రపంచంలోకి తీసుకువెడతాయి. ఇతడు రంగులరాట్నం, ఎర్రమల్లెలు మొదలైన సినిమాలకు గీతాలనురాశాడు. ఇతని రచనలన్నీ రెండు సంపుటాలలో వెలువడినాయి.

## విస్తృత ప్రపంచపు గవాక్షం.. ఓ పుస్తకం..




మనిషి ఆలోచనలకు, విలువలకు, దృక్పథానికి రూపం ఇచ్చేది పుస్తకం. అలాంటి పుస్తకాలను ఒకేచోట, అన్ని వర్గాల పాఠకులకు చేరువ చేసే వేదికే పుస్తక ప్రదర్శన (బుక్‌ఫెయిర్). ఇవి కేవలం పుస్తక విక్రయ కేంద్రాలు మాత్రమే కాకుండా, సాహిత్యానికి, ఆలోచనలకు, సంభాషణలకు జీవం పోసే సాంస్కృతిక ఉద్యమాలుగా కూడా భాసిల్లుతున్నాయి. నేటి వేగవంతమైన డిజిటల్ యుగంలో సమాచారానికి కొదవ లేదు. కానీ, ఆ సమాచారంలో లోతు, ఆలోచనాత్మకత, మానవీయ స్పర్శ తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో పుస్తక ప్రదర్శనలు మనలను మళ్లీ ఆలోచించే అలవాటు వైపు నడిపిస్తాయి. తెరల ప్రపంచం నుంచి పుటల ప్రపంచానికి తీసుకెళ్లి, మనలోని పాఠకుణ్ని మేల్కొలుపుతాయి. విభిన్న పుస్తకాలు విస్తృత దృక్పథాన్ని అందిస్తాయి. సమాజం నేడు ఆర్థిక అసమానతలు, ఉపాధి ఒత్తిళ్లు, సాంస్కృతిక సంఘర్షణలు, విలువల క్షీణత వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ సమస్యలను అర్థం చేసుకోవాలంటే ఒకే రకమైన పుస్తకాలు కాదు, విభిన్న రకాల పుస్తకాలు చదవడం అత్యవసరం. అదే విధంగా మనిషిలో అనుభూతులను పెంచడానికి కూడా సాహిత్యం అవసరం. సామాజిక శాస్త్ర పుస్తకాలు సమాజ గమనాన్ని అర్థం చేసుకునే దారి చూపిస్తాయి. ఆర్థిక గ్రంథాలు ఉపాధి, అభివృద్ధి, అవకాశాలపై స్పష్టత ఇస్తాయి. చరిత్ర, సంస్కృతి పుస్తకాలు మన మూలాలను గుర్తు చేస్తాయి. అదే రీతిలో, విజ్ఞాన, సాంకేతిక పుస్తకాలు భవిష్యత్తుకు సిద్ధం చేస్తాయి. పుస్తక ప్రదర్శనల్లో ఈ అన్నీ ఒకే వేదికపై లభించడం వల్ల పాఠకుడి చదువు పరిధి విస్తరిస్తుంది. ఇది ఏకపక్ష ఆలోచనలను నిలవరించే ప్రజాస్వామ్య ప్రక్రియ. ప్రగతిశీల వేదిక. పుస్తక ప్రదర్శనలు పాఠకుడు–రచయిత, ప్రచురణకర్త–సమాజం మధ్య సంభాషణను నిర్మిస్తాయి. సాహిత్య చర్చలు, పుస్తక ఆవిష్కరణలు, పిల్లల కార్యక్రమాలు.. ఇవన్నీ కలిసి సాంస్కృతిక చైతన్యాన్ని పెంచుతాయి. ముఖ్యంగా యువతకు ఇవి పఠనపు ఆనందాన్ని పరిచయం చేస్తాయి. ప్రాంతీయ భాషా ప్రచురణలు, చిన్న పుస్తక దుకాణాలు, కొత్త రచయితలకు పుస్తక ప్రదర్శనలు పెద్ద ఊతం. ఇది సాహిత్య ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. పుస్తకానికి విలువ పెరిగితే, ఆలోచనకు విలువ పెరుగుతుంది. స్థూలంగా చెప్పాలంటే, పుస్తక ప్రదర్శనలు మన సమాజానికి అవసరమైన ఆలోచనా వ్యాయామశాలలు. నేటి సంక్లిష్ట సామాజిక–ఆర్థిక–సాంస్కృతిక పరిస్థితుల్లో, విభిన్న రకాల పుస్తకాలు చదవడం మనలను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దుతుంది.

**పుస్తకం చేతిలో ఉంటే.. మనిషి మనసు విస్తరిస్తుంది..**
**పుస్తక ప్రదర్శనలో ఉంటే.. సమాజమే ఆలోచిస్తుంది..**




### హైదరాబాద్‌లో సాహితీ పండుగ..




హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2025 అనేది ప్రతి సంవత్సరం హైదరాబాద్‌లో నిర్వహించే పుస్తక ప్రదర్శన/బుక్ ఫెయిర్ దశాబ్దాలుగా, పుస్తక ప్రియులకు, విద్యార్థులకూ, రచయితలకు, ప్రచురణ సంస్థలకు ఒక ముఖ్యమైన సాంస్కృతిక వేడుకగా మారింది. ఈసారి 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఈ నెల 19వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ ఎన్‌టిఆర్ స్టేడియం (ఇందిరాపార్క్ వద్ద), హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 1:00 నుండి రాత్రి 9:00 గంటల వరకు వీక్షకులు, పుస్తక ప్రియులు సందర్శించవచ్చు. ఈ పుస్తక ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 200కి పైగా పబ్లిషర్స్, పుస్తక విక్రేతలు పాల్గొంటారు. పుస్తకాలను ప్రదర్శిస్తారు. అమ్మకాలు సాగిస్తారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ తదితర భాషల్లో ఈ బుక్‌ఫెయిర్‌లో పుస్తకాలు లభిస్తాయి. బాల సాహిత్యం నుంచి విజ్ఞాన గ్రంథాల వరకూ... నవలలు, కథానికల నుంచి, విద్యా, ఆధ్యాత్మిక వర్గాల వరకూ ఎన్నో పుస్తకాలు పలకరిస్తాయి. పుస్తక ప్రియులు కొత్త, పాత పుస్తకాలను కొనుగోలు చేయవచ్చు. రచయితలు తమ పుస్తకాలను పరిచయం చేసుకోవడానికి, పాఠకులతో మాట్లాడే అవకాశాలు లభిస్తుంది. ఇది పుస్తక పఠనాకి, ఆంతర్యం అర్థం చేసుకోవడానికి బాగా ఉపయోగపడుతుంది. ఈ బుక్‌ఫెయిర్‌లో చిన్నా పెద్దా సంస్థలు స్టాల్స్ ఏర్పాటు చేసి, పుస్తకాలను ప్రత్యేక తగ్గింపు ధరల్లో అందిస్తాయి. ఆఫర్లు కూడా ఉండడం సాహితీ ప్రియుల్లో కొత్త ఉత్సాహం నింపుతుంది. హైదరాబాద్ ప్రత్యేకతను నిలబెట్టే ఈ పుస్తక ప్రదర్శన కేవలం పబ్లిషర్లు తమ పుస్తకాల అమ్మకాలకు మాత్రమే పరిమితమైనదని అనుకోవడానికి వీల్లేదు. ఇది పాఠకులకు ఒక గొప్ప అవకాశాన్ని తెచ్చిపెడుతుంది. ఒకే చోట ఎన్నో రకాల పుస్తకాలు లభించడం వల్ల, ఎంపిక సమస్య తీరుతుంది. సమయం ఆదా అవుతుంది. అందుకే, ప్రతి ఏడాది లక్షలాది మంది పాఠకులు ఇందులో పాల్గొంటారు.

## భారత ఉపఖండ చరిత్ర

అమెరికాకు చెందిన చరిత్రకారిణి, రచయిత్రి ఆడ్రీ ట్రుష్కీ రచించిన 'ఇండియా: 5,000 ఇయర్స్ ఆఫ్ హిస్టరీ ఆన్ ది సబ్‌కాంటినెంట్' పుస్తకం ఒక సంక్షిప్త చారిత్రక గ్రంథం. దక్షిణాసియా చరిత్రను సాధారణంగా వలస పాలకుల దృష్టితో, లేదా ఉత్తర భారతంపై కేంద్రీకృతమైన రాజకీయ కథనాలతో చూసే స్వభావం చాలాకాలంగా ఉంది. అలాంటి కథనాలు దక్షిణ భారతానికి, అట్టడుగు వర్గాల స్వరాలకు, ప్రాంతీయ వైవిధ్యాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేకపోయాయి. ఈ లోటును భర్తీ చేసే ప్రయత్నంగా ఈ పుస్తకం నిలుస్తుంది. ఇది సమతుల్యంగా, సమగ్రంగా, విమర్శనాత్మక దృష్టితో భారత ఉపఖండ చరిత్రను పరిచయం చేస్తుంది. ఈ పుస్తకం సింధు లోయ నాగరికత (సుమారు క్రీస్తుపూర్వం 2500) నుండి ఆధునిక దక్షిణాసియా వరకూ విస్తరించిన అయిదువేల ఏళ్ల ప్రయాణాన్ని పాఠకులకు అందిస్తుంది. భారత ఉపఖండం ఎప్పుడూ స్థబ్ధమైన సమాజం కాదని, ఇక్కడ నిరంతరం ఆలోచన, పునర్‌ఆవిష్కరణ, విదేశీ సంవిధానాలతో సంబంధాలు, సంస్కరణలు, మతసామాజిక ప్రయోగాలు జరిగాయని రచయిత్రి అభిప్రాయం. అదే విషయాన్ని ఆమె బలంగా చెప్తుంది. సింధు నాగరికత మెసపొటేమియా వంటి ప్రాచీన నాగరికతలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉందనే కొత్త పరిశోధనలతో రచయిత్రి ముందుకు వెళుతుంది. ఇలాంటి ప్రయత్నాలు చాలా అరుదు. వేద సమాజంలో బ్రాహ్మణాధిక్యాన్ని ప్రశ్నిస్తూ బౌద్ధం, జైనిజం, ఆజీవికాలు, భక్తి ఉద్యమాలు వ్యక్తిగత అనుభవం, నైతికత, సమానత్వాన్ని ప్రాముఖ్యం ఇచ్చిన వైనాన్ని విపులంగా వర్ణించింది. గ్రీకు ప్రభావాలు, గంధార కళసంస్కృతులు, రోమన్లతో వాణిజ్యం, సిల్క్ రూట్ ద్వారా భారతదేశం ప్రపంచంతో సాగించిన బహుళముఖ సంబంధాలను రచయిత్రి చక్కగా వివరించింది. సముద్ర మార్గాల ద్వారా సంస్కృత సాహిత్యం ఆగ్నేయ ఆసియాకు ఎలా చేరిందో కూడా ఆసక్తికరంగా అందించడం విశేషం. ఇస్లామిక్ పాలన, మొఘలులు, హిందూ–ముస్లిం సంబంధాలపై విశ్లేషణ, ఢిల్లీ సుల్తానేట్, మొఘల్ కాలంలో హిందూ–ముస్లిం సామాజిక, సాంస్కృతిక సంబంధాలు ఎలా కలిసి పనిచేశాయో రచయిత్రి వివరంగా పేర్కొంది. ముఖ్యంగా బ్రిటిష్ పాలనా కాలంలోనే 'హిందూ ముస్లిం విభేదం'ను రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్దేశపూర్వకంగా పెంచారనే రచయిత్రి వ్యాఖ్య బలమైనది... చారిత్రక ఆధారాలు కలిగి ఉన్నది కూడా. వివిధ అనువాదాల ద్వారానే అనేక భారతీయులు తమ ధార్మిక గ్రంథాలను మొదటిసారి తెలిసుకున్న విషయాన్ని పుస్తకం గుర్తు చేస్తుంది. సంస్కృతం, ఫార్సీ, హిందీ, ఉర్దూ భాషలపై రచయిత్రికి ఉన్న పట్టు, పలు చారిత్రక మూలగ్రంథాల విశ్లేషణకు ఎంతో తోడ్పడింది. ప్రతి అధ్యాయానికి జోడించిన ప్రాచీన మూల పత్రాల అంశాలు, వేద సూక్తులు, అశోక శాసనాలు మొదలైనవి పాఠకులకు ప్రామాణికతతో కూడిన అనుభూతిని కలిగిస్తాయి. తాజా జన్యు శాస్త్ర పరిశోధనలు, వాతావరణ అధ్యయనాలు వంటి ఆధునిక శాస్త్రీయ సమాచారాన్ని కూడా చరిత్ర విశ్లేషణలో సమర్థంగా ఉపయోగించింది. సబాల్టర్న్ స్టడీస్‌పై రచయిత్రి చూపిన విమర్శ కొంత సూటిగా ఉన్నప్పటికీ, ఆ ఉద్యమం అట్టడుగు వర్గాల చరిత్రను వెలుగులోకి తెచ్చే విషయంలో చేసిన పాత్రను మరింత విపులంగా చెబితే బాగుండేది. భక్తి ఉద్యమ పరిధిలో బెంగాల్‌కి చెందిన చైతన్య మహాప్రభు వంటి ప్రముఖులను ప్రస్తావించకపోవడం లోపం. 1947 విభజన, స్వాతంత్ర్య ఉద్యమంపై చర్చ చాలా త్వరగా ముగిసినట్టు అనిపిస్తుంది. ముఖ్యంగా 1937 నుండి 1945–46 మధ్య ముస్లిం ఓటర్ల ప్రవర్తనలో వచ్చిన మార్పుకు కారణాలను వివరించలేదు. ఇలాంటి చిన్న చిన్న లోపాలున్నా, పుస్తకపు దృష్టి విస్తృతి, పరిశోధన లోతు, రచనా శైలి గమనార్హం. ఇది భారత చరిత్రను పునర్మూల్యాంకనం చేయాలనే తపన ఉన్న పాఠకులు, విద్యార్థులు, అధ్యాపకులు తప్పక చదవాల్సిన గ్రంథం. సంప్రదాయ కథనాలకతీతంగా భారత గతాన్ని కొత్త కోణంలో చూడటానికి ఇది ఆదర్శ పుస్తకం.




## ఈ వారం కవితలు




### విప్లవానికి వందేళ్లు

విప్లవానికి వందేళ్లు
'ఎర్రజెండా'కు శత సంకెళ్లు

ఉదయించే కిరణం
అస్తమించని అరుణం
ఎర్ర కర్షకుల ఆభరణం
మన ఎర్ర జెండా గమనం

విప్లవాల స్ఫూర్తి
ఉద్యమాల కీర్తి
అన్యాయపు వేటను అరికట్టే శక్తి

మన ఎర్ర జెండె విజయాల ధాత్రి

దాస్యపు సంకెళ్లు తెంచే పదునైన
ఆయుధం
చరిత్రలో నిలిచే చిరస్మరణీయ ధీరం
సమ సమాజ స్థాపనకై
సాగిపోతున్నది యుగయుగాలుగా
మన ఎర్ర జెండా విప్లవం

అన్యాయాలపై గర్జించే ఢమరుకం
అధర్మాన్ని ఎదురించే త్రిశూలం
విధ్వంసాన్ని దహించే త్రినేత్రం
మన ఎర్ర జెండా
బాధితులకు రక్షణ కవచం
ఆదేశాల గేయం
హక్కుల సాహిత్యం
పోరాడి గెలిచే విజయం

సాధించిన స్వేచ్ఛా కేతనం
మన ఎర్ర జెండా
మానవత్వం వెంటే ఉండే
విప్లవ నినాదం
మన ఎర్ర జెండా
ప్రగతి ప్రవాహం
మన ఎర్ర జెండా




మధుశ్రీ నలుబోల

### కమ్యూనిజం నీ అండ

దగాపడిన కార్మికా
కమ్యూనిజం నీ అండ
కుదేలైన కర్షకా
కమ్యూనిస్టు నీ వెంట
ప్రగతిశీల భావనలో
ప్రతిన బూని సాధనలో
వడివడిగా అడుగులేసి
పదపదరా రేపు మనదే

దోపిడీలు చేయలేదు
ఎరుపంటే భయమెందుకు?
పెట్టుబడుల కోటలేదు
పోరుబాట వెరపెందుకు?
కులమతాల చిచ్చురేపి
పదపదాన గీతగీసి
వేరుచేసి శాసించే
పాలకులను నిలదీయ
వడివడిగా అడుగులేసి

పదపదరా రేపు మనదే
నిరుద్యోగ సోదరా
ఉద్యమమే నీ మార్గం
దగాపడిన సోదరీ
ఎర్రసేన నీ ధ్యేయం
మార్పుకోరు దారులలో
మానవత్వ వెలుతురులో
వడివడిగా అడుగులేసి
పదపదరా రేపు మనదే



యువి రత్నం

### సిపిఐకి జై బోలో



జై బోలో జై బోలో
సిపిఐకి జై బోలో
త్యాగాలకు నిలయమైన
అమరుల పార్టీ
మన తాతలు, ముత్తాతలు
పోరాడిన పార్టీ
సెంచరీ నిండిన పార్టీ
మన సిపిఐ పార్టీ రా.!
కమ్యూనిస్ట్ పార్టీ రా.!
జై బోలో జై బోలో
సిపిఐకి జై బోలో

ఆటంకాలను ఎదిరించి
నిప్పుల వంతెన దాటింది
బ్రిటీష్ కుట్రలు ఛేదించి
నిజాము రాజుల తరిమింది

జైబోలో జైబోలో
సిపిఐకి జై బోలో
**చరణం**
మతోన్మాద నాటకాలు
సాగవంటూ చెప్పింది
పేదల కోసం పుట్టింది
ప్రజాపక్షమే నిలిచింది
జై బోలో జై బోలో
సిపిఐకి జై బోలో
నిర్బంధాలను ఎదిరించి
ప్రభుత్వాలను నిలదీసింది

చీకటి బ్రతుకులోన
వెలుగులు నింపింది
ప్రాణాలను లెక్కించని
వీరుల పార్టీ
ప్రజోద్యమాల పార్టీ రా
కలిసి పోరాడితే రాజ్యమే
మనదిరా
అంతరాలు తొలుగురా
ఆనందం వెలుగురా
జై బోలో జై బోలో
సిపిఐకి జై బోలో



గడ్డమీది చంద్ర మోహన్ గౌడ్

## మాజీ సింగరేణియులు పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్

**ప్రజాపక్షం/మణుగూరు:** మాజీ సింగరేణియులు పెన్షన్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ మణుగూరు ఏరియాలో ఈ నెల 16వ తేదీ మంగళవారం ట్రైపార్టైట్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం, పెన్షన్ అదాలత్, ప్రయాస్ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్తగూడెం వారి ఆధ్వర్యంలో ఉదయం 10.00 గంటలకు, యం.వి.టి.సి, పైలట్ కాలనీ, నిర్వహించబడుతుంది అన్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో పనిచేసి పదవీ విరమణ పొందిన మాజీ సింగరేణియులు, తాము పొందుతున్న పెన్షన్‌కు సంబంధించిన ఏవైనా సమస్యలు లేదా అభ్యంతరాలు ఉన్నట్లయితే, సంబంధిత ధృవీకరణ పత్రాలతో 16.12. 2025 ఉదయం 10.00 గంటలకుపై పేర్కొన్న స్థలంలో నిర్వహించబడే పెన్షన్ అదాలత్‌కు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గ్రామపంచాయతీ ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. విద్యానగర్ కాలనీ గ్రామపంచాయతీ పరిధిలోని 7వ వా ర్డులో నివాసం ఉంటున్న ఆయనకు అదే ప్రాంతంలో ఓటు ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆయన ఆదివారం ఇకే విద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసి బయటకు వచ్చిన అనంతరం ఆయనను పలువురు కలుసుకుని ఆప్యాయ ంగా పలుకరించా రు. ఎన్నికలు రా జ్యాంగ బద్ధంగా ప్ర శాంతమైన వాతావరణంలో జరిగేందు కు ప్రజలతో పాటు అధికారులు కృషి చేయాలని సూచించారు.

## మాజీ జెడ్‌పిటిసిపై యువకుడి ఘన విజయం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల కేంద్రం చంద్రుగొండ పంచాయితీలోని 3వ వార్డులో తాజా మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కొణకండ్ల వెంకటరెడ్డిపై యూత్ కాంగ్రెస్‌కు చెందిన యువకుడు యండీ ఇమ్రాన్ పాషా ఘన విజయం సాధించారు. వార్డులో మొత్తం 396 ఓట్లు ఉండగా 325 ఓట్లు పోలైయ్యాయి. ఇమ్రాన్‌కు 210 ఓట్లు రాగా వెంకటరెడ్డికి 97 ఓట్లు వచ్చాయి. చెల్లిన ఓట్లు 10 కాగా, బిజెపి బలపరిచిన అభ్యర్థికి 05 ఓట్లు వచ్చాయి. 113 ఓట్ల మెజార్టీతో సీనియర్ నాయకుడిని ఓడించిన ఇమ్రాన్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. వెంకటరెడ్డిని బిఆర్‌ఎస్, సిపిఎం పార్టీలు బలపరిచాయి.

## ఖమ్మం సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఖమ్మం ఆర్సిఎం పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ ఘనత వహించిన డాక్టర్ సగిలి ప్రకాష్ బిషప్ తండ్రి ఆదేశాల మేరకు ఆదివారం పునీత పాల్ పేతురు దేవాలయ చిరు హృదయ సభ విచారన గురువు సిద్దెల జేసు ప్రసాద్ అధ్యక్షతన ఆళ్లపల్లి విచారణ వ్యాప్తంగా గుండాల ముత్తాపురం, జిన్నెలగూడెం, మర్కోడు, ఆళ్లపల్లి పలు గ్రామాల్లో రోమన్ కతోలిక భక్తులకు నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందని ఖమ్మం డయాసిస్ సోషల్ సర్వీస్ డైరెక్టర్, రెవరెండ్ ఫాదర్ సురేష్, బిషప్ సలహాదారులు రెవరెండ్ ఫాదర్ ఐజాక్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రార్ధనతో పాటు చేతులందించి చేయూతగా ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో డీకన్ బ్రదర్ అరుణ్, డిఎస్ఎస్ సిస్టర్స్ సుపీరియర్ ప్రశాంత్, ఇన్చార్జి సిస్టర్ దామరిస్, ప్రిన్సిపాల్ మహిత, ఖమ్మం డయాసిస్ జ్యోతిర్మయి, ఆళ్లపల్లి విచారణ యానిమేటర్ పరమ ప్రభాకర్, ఉపదేశులు నారాయణ, నాగేశ్వరరావు, కిరణ్, రాములు, సంఘ నాయకులు నాగేశ్వరరావు, రాంబాబు, రామ్మూర్తి, బొమ్మెర సత్యం, యూత్ జోజీ బన్నీ, నవీన్, దళం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను ఆదరించండి



**ప్రజాపక్షం/గుండాల :** గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్‌పార్టీ సర్పంచి అభ్యర్థులను గెలిపించాలని పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జరగనున్న గ్రామపంచాయతీస్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో బాగంగా ఆదివారం మండలంలోని శెట్టిపల్లి, శంభునిగూడెం పంచాయతీల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. శెట్టిపల్లి పంచాయతీ అభ్యర్థి డిల్లి వసంతరావు, శంభునిగూడెం సర్పంచి అభ్యర్థి ఈసం సుమలతలను అత్యదిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పంచాయతీలే గ్రామాల పురోగతికి పునాదని, ప్రభుత్వ పథకాలు సమర్ధవంతంగా ప్రజలకు చేరాలంటే కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్ధుల నాయకత్వం అత్యంత కీలకం అన్నారు. అలాగే కాచనపల్లి సర్పంచి అభ్యర్థి బోడ వెంకట్రామ్, రోలగడ్డ పంచాయతి అభ్యర్థి దుగ్గిజ్యోతి వీరికి తమ అమూల్యమైన ఓటును వేసి గెలిపించాలని అభ్యర్ధించారు. ప్రచార కార్యక్రమంలో ఈసం సుదాకర్, రాజమాబు, ఎస్కె ఖదీర్, వాజీద్, ఎం కిరన్, అశోక్, రాజేష్ , చాట్ల పద్మ ఇంకా పాల్గొన్నారు.

## ప్రచారంలో ముందున్న కాంగ్రెస్



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా అధికార పార్టీ కాంగ్రెస్ గ్రామీణ ప్రాంతాలలో ముందంజలో ఉంది. పెద్ద కోరుకొండి, తెలగవరం, మర్లపాడు, రఘునాథగూడెం, లక్ష్మీపురం, ఎర్రబోయినపల్లి , ఓబుల్ రావు బంజర్, పేరువంచ, ముగ్గు వెంకటాపురం తదితర గ్రామాలలో దాంతో పాటు ఎస్సీ, ఎస్టీ ,బీసీ, స్థానాల్లో కూడా ముందంజలో ఉంది చివరికి ఓటరు మనసు ఎవరు గెలుస్తారో ఏమో తెలుసుకోవాల్సి ఉంది.

## 'కాసం ఫ్యాషన్స్' షోరూం ప్రారంభం

అలరించిన ప్రముఖ సినీ తార అనసూర్య భరద్వాజ్

**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 23వ స్టోర్‌ను ప్రముఖ సినీ తార, యాంకర్ అనసూర్య భరద్వాజ్ ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధిర చుట్టూ పక్కల ప్రాంత వాసులు షాపింగ్ కాసం ఫ్యాషన్స్‌లో చేయాలని అన్నారు. కాసం షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో గత 5 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటి వరకు తెలంగాణ ఆంధ్రప్రదేశ్‌లో 23 స్టోర్స్ ప్రారంభించామని అన్నారు. మా వస్త్రాలను ఎల్లప్పుడూ ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఆధునాతన ఫ్యాషన్ డిజైన్లను వినియోగదారులకు తక్కువ రేటుకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని తెలిపారు. అనసూర్య భరద్వాజ్‌ను చూడటానికి ఉదయం నుండి అభిమానులు పరిసర ప్రాంత యువతీ, యువకులు బారులు తీరారు. ముందుగా డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క సతీమణి, మల్లు నందిని ముఖ్యఅతిధిగా హాజరై కాసం ఫ్యాషన్స్ షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మధిరలో కాసం ఫ్యాషన్స్ షోరూమ్ ప్రారంభించటం ఎంతో అభినందనీయమని అన్నారు. కాసం షాపింగ్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.



# రెండవ దశ పోలింగ్ ప్రశాంతం

- జిల్లాలో 82.65 శాతం శాతం ఓటింగ్
- అత్యధికంగా అశ్వారావుపేట, అత్యల్పంగా చుంచుపల్లి
- ఓటు వేసిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- పటిష్ఠబందోబస్తు

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం జరిగిన మలివిడతలో జిల్లా వ్యాప్తంగా 82.65 శాతం ఓటింగ్ నమోదైంది. 156 గ్రామ పంచాయతీలకు గానూ 16 ఏకగ్రీవం కావడంతో, మరో ఇతర కారణాలతో 138 జిపిలకు, 1123 వార్డులకు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, ములకలపల్లి, పాల్వంచ మండలాల్లో ఈ ఎన్నికల ప్రక్రియ సాగింది. జిల్లాలోని అత్యధికంగా అశ్వారావుపేట మండలంలో 87.85 శాతం అత్యల్పంగా చుం చుపల్లి మండలంలో 66.19 శాతం ఓట్లు పోలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 196395 మంది ఓటర్లు ఉండగా, 162323 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. తొలివిడతతో పోలిస్తే మలి విడతలో 10.86 శాతం పో లింగ్ అదనంగా జరిగింది. ఎన్నికల సరళిని జి ల్లా కలెక్టర్, ఎస్‌పి రోహిత్ రాజ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సాధారణ ఎన్నికల పరిశీలకులు విశ్వేశ్వరరెడ్డి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులు, వద్ధుల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేశారు. ఆరోగ్య శిబిరాలు అందుబాటులో ఉంచారు. మౌలిక సదుపాయా లు కల్పించారు. మహిళలు, వయో వృద్ధుల కో సం ప్రత్యేక సదుపాయాల కల్పించారు. ఎమ్మెల్యే కూనంనేని ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, గట్టి బందో బస్తు నిర్వహించాలని సూచించారు.

| రెండవ దశ ఎన్నికల్లో మండలాల వారీగా వివరాలు | | |
|---|---|---|
| 1.అన్నపురెడ్డిపల్లి | 12,665(14,878) | 85.13 శాతం |
| 2. అశ్వారావుపేట | 26,239(29,867) | 87.85 శాతం |
| 3. చంద్రుగొండ | 18,810(21,891) | 85.93 శాతం |
| 4. చుంచుపల్లి | 23,964(36,204) | 66.19 శాతం |
| 5. దమ్మపేట | 36,164(42,184) | 85.73 శాతం |
| 6. ములకలపల్లి | 22,401(25,870) | 86.59 శాతం |
| 7. పాల్వంచ | 22,080(25,501) | 86.58 శాతం |
| మొత్తం | 1,62,323(1,96,395) | 82.65 శాతం |

## ఎన్నికల సరళిని పరిశీలించిన అధికారులు

- సూచనలు, సలహాలు ఇచ్చిన కలెక్టర్
- బందో బస్తు పర్యవేక్షించిన ఎస్‌పి
- మౌలిక సదుపాయాల కల్పనపై సంతృప్తి





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రెండో దశ గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సాధారణ ఎన్నికల పరిశీలకులు విశ్వేశ్వర రెడ్డి పరిశీలించారు. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని అచ్చుతాపురం గ్రామపంచాయతీ పోలింగ్ కేంద్రాల్లో ఆయన కలియతిరిగారు. ఓటర్లకోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతుల కల్పనపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పలు అంశాలపై ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. బ్యాలెట్ పేపర్లను కలెక్టర్ పరిశీలించారు. ఎన్నికల ముగిసేంత వరకు నియమాలు తప్పకుండా పాటించాలని, ప్రతీ అంశం పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటు హక్కును అంతా సద్వినియోగం చేసుకునేలా చూడాలని, వృద్ధులు, మహిళా ఓటర్లకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎస్‌పి రోహిత్ రాజ్ చుంచుపల్లి మండలపరిధిలోని రుద్రంపూర్, గౌతమ్‌పూర్, చుంచుపల్లితండా, బాబుక్యాంప్, రామాంజనేయ కాలనీ, పాల్వంచ మండల పరిధిలోని రంగాపురం, కేశవాపురం గ్రామ పంచాయతీల పరిధిలోని ఏర్పాటు చేసినపోలింగ్ బూతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల ప్రక్రయి ముగిసేంత వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఆసుబాక, తిరుమలకుంట,రెడ్డిగూడెం, వినాయకపురం గ్రామ పంచాయతీల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేస్తూ ప్రతీ ఓటరు తన ఓటు హక్కును వినియోగించుకునేలా ఎన్నికలసిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కౌటింగ్ కేంద్రాలకు భద్రత నడుమ తరలించాలని ఆదేశించారు. అదే విధంగా సాధారణ ఎన్నికల పరిశీలకులు విశ్వేశ్వరరెడ్డి చుంచుపల్లి మండలంలోని పలు పోలింగ్ స్టేషన్ల వద్దకు వెళ్లి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఓటింగ్ ప్రక్రియ, నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయన సమీఇంచారు. ప్రశాంతమైన వాతావరణంలో నిబంధనల ప్రకారం పోలింగ్ కొనసాగించాలని సిబ్బందికి సూచించారు.

# అంతర్జాతీయ ప్రమాణాలతో నగరాభివృద్ధి

మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణం

పలు వార్డుల్లో పర్యటించిన తుమ్మల





**ప్రజాపక్షం/ ఖమ్మం :** అంతర్జాతీయ ప్రమాణాలతో ఖమ్మం నగరాభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలో పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. మమత రోడ్డులో అమృత్ పథకం క్రింద రూ.249 కోట్లతో నిర్మిస్తున్న భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ పనుల పురోగతిని మంత్రి పరిశీలించి క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. అంతకు ముందు 10, 11 సహా పలు వార్డుల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ నగర సర్వతోముఖాభివృద్ధికి అధికారులకు నిర్దేశిత లక్ష్యాలను నిర్ణయించినట్లు తెలిపారు. వర్షపు నీరు నివాసాలను ముంచెత్తకుండా ఉండేలా మురుగు నీటి ప్రవాహాలను వేరువేరుగా పైపులైన్ల ద్వారా ఎస్‌టిపిలకు చేర్చడం లక్ష్యమన్నారు. వర్షపు నీరు వరద కాలవ రూపంలో మున్నేరుకు చేరేలా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వర్షపు నీరు, మురుగు నీరు కలవడం వల్ల పర్యావరణానికి ఇబ్బంది కలుగుతుందని దీనిని అరికట్టడం కోసం భారీ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు. నగరాభివృద్ధికి కావాల్సిన పనులకు నిధులు మంజూరు చేయడంతో పాటు ఆక్రమణలను కూడా వీలైనంత తొందరగా తొలగించి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా 8.5 కిలో మీటర్ల మురుగు నీటి పైపులైన్, నీటి డ్రైన్లు, అంతర్గత పైపులైన్లను అనుసంధానం చేసి మురుగునీటి శుద్ధి కేంద్రానికి తరలించనున్నట్లు తుమ్మల తెలిపారు. 44 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి కేంద్రానికి అవసరమైన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పుట్టకోటలో 9.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం గల మురుగు నీటి శుద్ధి కేంద్రం పనులు పూర్తి చేయాలన్నారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కార్పోరేషన్ ఎస్ఈ రంజిత్, ఇరిగేషన్ ఈఈ అనన్య, మున్సిపల్ కార్పోరేషన్ ఇంచార్జి ఈఈ టి. ధరణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నిజాలు తెలుసుకో 'తాతా'

మీరే దాడి చేసి సిపిఐపై విమర్శలా !

మాది అభివృద్ధి బాట : దండి సురేష్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధు నిజాలు తెలుసుకుని మాట్లాడితే మంచిదని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సూచించారు. దొంగే దొంగ అన్న చందంగా సిపిఎం, బిఆర్‌ఎస్ కార్యకర్తలే సిపిఐ కార్యకర్తల ఇండ్లపై దాడి చేసి తిరిగి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేతృత్వంలో సిపిఐ ప్రతినిధి బృందం చింతకాని మండలం కోదుమూరు గ్రామంలో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ సిపిఎం, బిఆర్‌ఎస్ కూటమి సిపిఐపై విజయం సాధించిన అనంతరం నక్కనబోయిన సుజాత, పరిభూషణాచారి, ఉద్దిని తిరపయ్య, బరిగల ఉపేందర్ తదితరుల ఇండ్లపై దాడి చేశారని ఆయన తెలిపారు. పదేళ్ల పాటు సిపిఐ సర్పంచ్‌గా కొనసాగిన కోదుమూరులో అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని సిపిఐ కృషితోనే ఎత్తిపోతల పథకం గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణం జరిగిందని సిపిఐ ఎప్పుడు గ్రామాల్లో ప్రశాంతతనే కోరుకుంటుందని అది మరిచి తాతా మధు బృందం ఇష్టానుసారంగా మాట్లాడటం వారి తెలియని తనానికి నిదర్శనమన్నారు. ప్రతినిధి బృందంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కొండపర్తి గోవిందరావు, కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపూడి రవి, నాయకులు వెంకటేశ్వరరావు, నక్కనబోయిన కృష్ణ, గోవిందరావు, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, నారపోగు నాగార్జున, కోటగిరి చారి, నక్కనబోయిన శ్రీను, కొండలు, నాగభూషణం, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ ప్రచారం

గుండ్లరేవు సర్పంచ్ అభ్యర్థి భూక్యా చంద్రబాబు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండలపరిధిలోని గుండ్లరేవు గ్రామ ప్రజలు తనను ఆశీర్వదించి గెలిపిస్తే ఎమ్మెల్యే, మంత్రుల సహకారంతో గుండ్లరేవు గ్రామ పంచాయతీని అభివృద్ధి చేసి ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతానని కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భూక్యా చంద్రబాబు తెలిపారు. గురువారం జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి భూక్యా చంద్రబాబుతో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు దుగ్గిన్ని నరసింహారావు తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గడప గడప తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజాపాలనలో ప్రజలు ఎంత స్వేచ్ఛగా ఉన్నారో అవగాహన కల్పిస్తూ ఎన్నికల ప్రచారంలో దూసుకు పోతున్నారు. గ్రామంలో ప్రజలు, మహిళలు అడుగడుగున సర్పంచ్ అభ్యర్థి భూక్యా చంద్రబాబుకు బ్రహ్మరథం పడుతూ అభిమానాన్ని చాటుకుంటూ ప్రచారంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుల సహకారంతో గుండ్లరేవు గ్రామంకు ప్రత్యేకమైన అభివృద్ధి నిధులను తీసుకువచ్చి అద్భుతమైన గ్రామంగా తీర్చిదిద్దుతానన్నారు. అదేవిధంగా మంచినీటి ఎద్దడి లేకుండా ప్రజలకు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను పూర్తిచేసేందుకు. ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తానన్నారు.

## 9 గ్రామ సర్పంచుల బిఆర్‌ఎస్ అభ్యర్థులు ఘన విజయం

అశ్వాపురం మండలంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండలంలో బిఆర్‌ఎస్ ఘన విజయంసాధించింది. మొండికుంట, గొందిగూడెం, నెల్లిపాక, గొల్లగూడెం, కళ్యాణపురం, ఎలకలగూడెం, చింతిర్యాల కాలనీ, ఆనందపురం, జగ్గారం గ్రామాల్లో బిఆర్‌ఎస మద్దతుతో పోటీ చేసిన అభ్యర్థులు సర్పంచులుగా గెలుపొందడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. 9 గ్రామాల సర్పంచుల విజయంతో మండల రాజకీయాల్లో బిఆర్‌ఎస్ జోరు కొనసాగుతోంది. ఈ విజయానికి గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ప్రధాన కారణమని పార్టీ నేతలు తెలిపారు. ఇంటింటి ప్రచారం, బూత్ స్థాయి సమన్వయం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రజల మద్దతు కూడగట్టారు. రైతు బంధు, దళితబంధు, రైతు భీమా, ఆసరా పింఛన్లు వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు కీలక పాత్ర పోషించారు. ఈ ఎన్నికలలో మొండికుంట బిఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి సంధ్య ఘన విజయం సాధించగా, ఆమెకు తన భర్త మర్రి మల్లారెడ్డి గతంలో మొండికుంట సర్పంచ్‌గా గెలుపొంది మొండికుంటను అభివృద్ధి పథంలో నడిపించిన అనుభవం రాజకీయ అనుభవం, గతంలో ఇదే గ్రామానికి ఉపసర్పంచ్‌గా చేసిన మేడవరపు సుధీర్ తదితర నాయకులు అండగా నిలిచి ప్రచారాన్ని విజయవంతం చేశారు. అశ్వాపురం మండలంలో ప్రతిపక్ష హో దాలో బిఆర్ఎస్ తొమ్మిది సర్పంచులను గెలుచుకోవడం శుభపరిణామమని ప్రజల్లో బిఆర్‌ఎస్ పార్టీ స్థానం అలానే ఉందని మండలంలో యువత ఉత్సాహంతో ఉరకలేస్తుందని, రాబోయే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికల్లో ఇంకా సమిష్టిగా కృషి చేసి మండల స్థాయిలో అన్ని స్థానాలను గెలిపించుకొని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్‌ఏ రేగా కాంతారావుకి బహుమతిగా అందజేస్తామని, మరొకసారి సర్పంచులుగా గెలిచిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి కోసం కష్టపడ్డ నాయకులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నేటితో ముగియనున్న ప్రచారం

గెలుపుపై ఎవరి అంచనాలు వారివే

పలు గ్రామాల్లో ముందే డిసైడ్ అయిన గెలుపు

మరికొన్ని గ్రామాల్లో ?నువ్వా నేనా? అన్నట్లు పోటీ





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 17న జరగనున్న పంచాయితీ పోరుకు ప్రచార పర్వం నేటితో ముగియనుంది. గత వారం రోజులుగా గ్రామాల్లో ప్రచారం హోరెత్తింది. గ్రామంలోని ప్రతి ఇంటిని అభ్యర్థులు ఒకటికి పది సార్లు సందర్శించి ఓటర్లను ప్రసన్నం చేసుకుని ఓట్లు అభ్యర్థించారు. తెల్లవారింది మొదలు ప్రచార పర్వం ప్రారంభించి ఒకరిపై, ఒకరు ఎత్తులకు పైఎత్తులు వేస్తూ మిత్రులు, శత్రువులను సైతం కలుసుకుంటూ తమ గుర్తులను గుచ్చి, గుచ్చి చూపుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అభ్యర్థుల ప్రచార హోరు ఈ విధంగా సాగుతుంటే మైకుల సందడి గ్రామాల్లో సంక్రాంతి కంటే ముందే పండగ వాతావరణాన్ని తీసుకొచ్చింది. అంది వచ్చిన అవకాశాన్ని సైతం ఓటర్లు సద్వినియోగం చేసుకుంటూ ఇంట్లో చిన్న అవసరాన్ని సైతం అవకాశంగా మలుచుకుంటూ అభ్యర్థుల ముక్కు పిండి మరి పనులు చేపించుకుంటున్నారు. సెల్ ఫోన్ రిపేర్ దగ్గర నుండి , బైక్ లలో ఇంజన్ ఆయిల్, వాహనాల టైర్లు, ట్యూబ్లు, క్లచ్ వైర్లు ఇలా ఏది పడితే అడుగుతూ అభ్యర్థులను సర్వం సంకనాకిస్తున్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు నిలబడిన చోట పరిస్థితి మరింత దిగజారుతుంది. ఓటర్లు అడుగుతున్న ప్రతి పనిని చేసి పెడుతున్న అభ్యర్థులు, వారి అనుచరులు గెలుపు పై అంచనాలను పెంచుకుంటూ 17న సాయంత్రం గల్లా ఎగర వేసేది మేమే అంటూ జబ్బులు చరుచుకుంటున్నారు. సత్తుపల్లి మండలంలోని పలు గ్రామాల్లో అధికార ప్రతిపక్ష పార్టీలు హోరా హోరీగా తలపడుతుండగా, మరికొన్ని గ్రామాల్లో అధికార పార్టీకి , తమ పార్టీలోని రెబల్ అభ్యర్థులతోనే పోటీ రావడం, ఆ పోటీ సైతం నువ్వా, నేనా అన్నట్లు సాగుతుండడంతో గెలుపు పై అంచనాకు రాలేకపోతున్నారు విశ్లేషకులు. అధికారం వచ్చిన నాటినుండి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంట్, ఉచిత గ్యాస్, ఫ్రీ బస్, సన్న వడ్లుకు బోనస్ లాంటి ఎన్నో పథకాలను అధికార పక్షం అందిస్తున్నప్పటికీ ఓటర్లు అధికార పార్టీపై దయ చూపేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో కొన్నిచోట్ల రెబల్స్ తమ ఆధిపత్యం ప్రదర్శించేలా కనిపిస్తున్నారు. రెబల్స్ బరిలో ఉన్నచోట సైలెంట్ ఓటింగ్ జరుగుతుందని గెలుపు పక్కాగా తమకే అందుతుందని అధికార పక్షం ఆశగా చూస్తుంది. కోట్లకు, కోట్ల నిధులతో గ్రామాల అభివృద్ధి జరుగుతున్న చోట, అధికార పార్టీకి బలమైన నాయకత్వం ఉన్న చోట కూడా పోటీ నువ్వా, నేనా అన్నట్లు సాగుతూ ఉండడం విశ్లేషకులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అయితే మరికొన్ని గ్రామాలలో పోటీ అనివార్యమైన గెలుపు మాత్రం పక్కాగా డిసైడ్ చేసుకున్నారు అధికార, ప్రతిపక్షాలకు చెందిన నాయకులు. ఈ నెల 17న జరిగే పంచాయితీ ఎన్నికలలో ఓటరు దేవుళ్ళు ఇచ్చే తీర్పులు పట్టే అధికార, ప్రతిపక్ష పార్టీలు రానున్న రోజుల్లో ఏ విధంగా ముందుకు వెళ్లాలి అనే ఓ ఆలోచనకు వస్తాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## నేతాజీని అభినందించిన మల్లు నందిని



**ప్రజాపక్షం/చింతకాని:** నేరడ సర్పంచ్ గా ఎన్నికైన దూసరి నేతాజీ ఆదివారం డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని విక్రమార్కను కలిసి సన్మానించారు. మధిర క్యాంపు కార్యాలయంలో నూతన పాలక వర్గ సభ్యులను నందిని విక్రమార్క శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నందిని విక్రమార్క మాట్లాడుతూ నేరడ పంచాయతీని రాష్ట్రంలో మోడల్ పంచాయతీగా తీర్చి దిద్దాలని, పంచాయతీ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్ కోట బాలేష్, వార్డు సభ్యులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మంకెన నాగేశ్వరరావు, నాయకులు ఆలస్యం వెంకయ్య, నున్న నాగయ్య, కందిమల్ల పానకాలు, వంకాయలపాటి మాధవరావు, జి వెంకన్న, సతీష్ పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ములుగు:** జిల్లాలో జరుగుతున్న రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదివారం కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి పోలింగ్ జరుగుతున్న విధానాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టీఎస్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటాపూర్ మండలంలో 116, ములుగు మండలంలో 92, మల్లంపల్లి మండలంలో 53, పోలింగ్ కేంద్రాలను క్రిటికల్, సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించి, వాటిని జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నేరుగా వెబ్‌కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ మూడు మండలాలకు సూక్ష్మ పరిశీలకులను నియమించి, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఈడిఎం దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

## మేడారం వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు : ఎస్‌పి

**ప్రజాపక్షం/ములుగు:** ఆసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతర 2026 జనవరి 22 తేదీ నుండి జరిగే సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు జరుగుతున్నాయని అలాగే మేడారంలో దేవాలయ అభివృద్ధి పనులను జిల్లా ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ కేకన్ ఐపిఎస్ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా పనులు పూర్తి చేయాలని వారు అన్నారు.



## గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాలలోని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి గ్రామాల అభివృద్ధికి అండగా చేయూతనివ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి గ్రామాభివృద్ధికి బాటలు వేయాలని ఆమె పిలుపునిచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, కాంగ్రెస్ అభ్యర్థులు శ్రీనివాస్, శ్రీశైలం, రమ్య, స్వరూప, శ్రీపతిరెడ్డి, దేవేందర్, రజిత, సుధాకర్, అనిల్‌కుమార్, శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జనగామలో 82.69 శాతం




**ప్రజాపక్షం / జనగామ:** జనగామలో గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుండి ఓటర్లు భారులు తీరి ఓటు వేశారు. 88వేల 532 మంది ఓటు వేయడంతో 82.69 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్ సింగ్‌లో పాటు జిల్లా పరిశీలకులు రవికిరన్, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ పోలింగ్ సరళిని స్వయంగా పరిశీలించారు. జనగామ జిల్లాలో రెండో విడత పోలింగ్ ఆదివారం జరిగింది. బచ్చన్నపేట, జనగామ, నర్మెట, తరిగొప్పుల మండలాల్లోని 79 పంచాయతీలకు ఎన్నికలు జరగనుండగా ఆరు ఏకగ్రీవం కావడంతో 73 పంచాయతీలకు పోలింగ్ జరిగింది. 251 మంది సర్పంచ్ పదవి కోసం 1465 మంది వార్డు సభ్యుల పదవి కోసం పోటీ పడ్డారు. లక్షా 10వేల120 మంది ఓటర్లు ఉండగా లక్షా 7వేల 67మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభం కాగా 9 గంటల వరకు 17వేల 900 మంది ఓటు వేయడంతో 16.72 శాతం పోలింగ్ జరిగింది. 11 గంటల వరకు 54వేల 712 మంది ఓటు వేయడంతో 51.10 శాతం పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం 1 గంట వరకు 94వేల 776 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషుల ఓటింగ్ శాతం 89.44 శాతం కాగా మహిళ ఓటర్ల పోలింగ్ శాతాం 87.62 శాతం. ఓవరాల్‌గా 88.52 శాతం పోలింగ్ జరిగింది.

**పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ప్రముఖులు :** పంచాయతీ ఎన్నికల సందర్భంగా పలువురు ప్రములుకు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలీస్ కమీషనర్ సన్‌ప్రీత్ సింగ్ జనగామలోని శామీర్ పేట పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ బచ్చన్నపేటలో సందర్శించి పరిశీలించారు. జిల్లా పరిశీలకులు రవికిరన్, జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డిసిపి రాజమహేంద్రనాయక్‌కు పలు కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించడంతో పాటు ఓట్ల లెక్కింపు సందర్భంగా కట్టుదిట్టమైన చర్యలపై పలు సూచనలు చేశారు.

## ప్రజా ప్రభుత్వంలో సబ్బండ వర్గాల సంక్షేమం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ :** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ పాలనలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఉన్న 57వ డివిజన్‌లో సూమర్ 50 మంది కీలక నాయకులు బిఆర్‌ఎస్, బిజెపి పార్టీల నుంచి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్ల సిద్ధాంతంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. హైదరాబాద్ నగరానికి దీటుగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం పట్ల ఆకర్షితులై పార్టీలోకి వచ్చిన నాయకులకు సాదర స్వాగతం పలికారు.చేరిన వారిలో ప్రధానంగా బిఆర్‌ఎస్‌నుంచి రెండ్ల శ్రీనివాస్, అనుచరగణం, బిజెపి నుంచి బొంగు కనక లక్ష్మి ,పద్మ, వారి అనుచరులు పార్టీలో చేరారు. అనంతరం గోకుల్ నగర్ జంక్షన్ వద్ద గల సివిల్ సప్లై గోదాం లను పరిశీలించారు. రానున్న రోజుల్లో గోదాములను నగర శివారులో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపా రు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఇవి శ్రీనివాస్ రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, దివిజన్ అధ్యక్షులు బంక సతీష్,సీనియర్ నాయకులు చంద్రశేఖర్,చంద్రమౌళి, శంకర్, లలిత, మౌనిక, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి ఓటేయండి :ఝాన్సిరెడ్డి



**ప్రజాపక్షం/దేవరుప్పుల:** అభివృద్ధికి ఓటువేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ధర్మాపురం గ్రామ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దౌపాటి అశ్విని రవికి మద్దతుగా ఇంటింటి ప్రచారంలో ఝాన్సిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ అభివృద్ధికి ఓటువేసి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి మీ గ్రామాన్ని మరింత అబివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామాల నాయకులు, యువజన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్తు

వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ జిల్లా పెద్దపెండ్యాలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన ఆరోహన్2025 వార్షికోత్సవ కార్యక్రమానికి వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎంపి కడియం కావ్య జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు. విద్యే విద్యార్థుల జీవితాన్ని మలిచే ప్రధాన ఆయుధమని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమ ఆసక్తులు, నైపుణ్యాలను గుర్తించి స్పష్టమైన లక్ష్యాలు పెట్టుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, కఠిన శ్రమ, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని అన్నారు. అలాగే ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి భయపడకుండా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. వైఫల్యాలను భయపడకుం డా అవే విజయానికి మెట్లుగా మలచుకోని ముం దుకు సాగాలన్నారు. విద్యార్థులు తమ కెరీర్ ఎం పికలో ఇతరుల ఒత్తిడికి లోనుకాకుండా తమ ఇష్టాలను, సామర్థ్యాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. లక్ష్యం స్పష్టంగా ఉంటే భవిష్యత్తులో తప్పక విజయం సాధిస్తారని స్పష్టం చేశారు. విద్యార్థులకు సరైన దిశానిర్దేశం చేయడంలో కెరీర్ గైడెన్స్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని, ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలల్లో నిరంతరం నిర్వహించాల ని ఎంపి సూచించారు. విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల పాత్ర కీలకమని తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు ఎంపీ సర్టిఫికెట్‌లు, మెమెంటోలను అందజేశారు. అనంతరం ఎంపి డాక్టర్ కడియం కావ్య విద్యార్థులతో మమేకమై వారిని ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుద్ధి, డిపిఎస్ డైరెక్టర్ రాజి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి, వైస్ చైర్మన్ రవి కిరణ్ రెడ్డి, ప్రిన్సిపల్ ఇన్నా రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు,తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారీ బందోబస్తు మధ్య ఎన్నికలు

జిల్లా ఎస్‌పి సంకీర్త్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికలు కొనసాగాయని జిల్లా ఎస్‌పి సిరి శెట్టి సంకీర్త్ తెలిపారు. ఆదివారం రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు భూపాలపల్లి, చిట్యాల, పలిమల నాలుగు మండలాల పరిధిలో జరిగినట్లు తెలిపారు. నేపథ్యంలో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ చిట్యాల మండలం గిద్దముత్తారం పోలింగ్ బూత్‌ను భూపాలపల్లి జిల్లా ఎస్‌పి సిరిశెట్టి సంకీర్త్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రంలో ఏవైనా సమస్యలు తలెత్తినట్లయితే వాటిని వెంటనే పరిష్కరించాలని, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వహించాలని అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు.

## ప్రశాంతంగా పోలింగ్

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ములుగు మండలం జంగాలపల్లి, మల్లంపల్లి, మండల కేంద్రంలో, వెంకటాపూర్ మండల కేంద్రంలో , లక్ష్మీ దేవిపేటలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సిబ్బంది డ్యూటీల అమలు, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదైన పోలింగ్ శాతం పరిశీలించి పోలింగ్ కేంద్రాల సందర్శన ఫారంలో సంతకాలు చేశారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణకు సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదన్నారు.

## సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/ వరంగల్:** గ్రామపంచాయతీ ఎన్నికల రెండవ విడత పోలింగ్ నేపథ్యంలో వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదివారం గీసుకొండ మండలంలోని గీసుకొండ, గంగాదేవిపల్లి పోలింగ్ కేంద్రాలు, దుగ్గొండి మండలంలోని వెంకటాపూర్, దేశాయిపల్లి పోలింగ్ కేంద్రాలు, నల్లబెల్లి మండలంలోని నల్లబెల్లి సుమంగళి ఫంక్షన్ హాల్, నందిగామ పోలింగ్ కేంద్రాలు, సంగెం మండలంలోని సంగెం జడ్పీ హై స్కూల్, మొండ్రాయి గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలతో పాటు పలు పోలింగ్ కేంద్రాలలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సిబ్బంది డ్యూటీల అమలు, పోలింగ్ సాగుతున్న విధానం, భద్రతా చర్యలు వంటి అంశాలను వివరంగా పరిశీలించారు. సమర్థవంతమైన పోలింగ్ నిర్వహణకు సంబంధిత అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో ఏ విధమైన నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని, ప్రతి ఓటరికి సౌకర్యవంతమైన, అంతరాయం లేని వాతావరణం కల్పించడం సిబ్బందిపైనున్న ప్రధాన బాధ్యత అన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పరిష్కరించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ, పారదర్శకత, నిబంధనల ఖచ్చితమైన అమలు అత్యంత ఔచిత్యం కలదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటింగ్ శాతం పెంచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ఎన్నికల సూచనల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లో నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ప్రతి మండలానికి రెండు చొప్పున హరిత (గ్రీన్) పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొదటి విడతలో హరిత పోలింగ్ కేంద్రాలలో మిగతా పోలింగ్ కేంద్రాలకంటే 2నుండి3 శాతం పోలింగ్ పెరిగిందని, అన్నారు. రెండవ విడతలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ నిర్వహణకు అన్ని చర్యలు తీసుకున్నామని, 82 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో ఎప్పటికపుడు కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుండి కౌటింగ్ ప్రారంభమవుతుందని, ముందుగా వార్డుల కౌంటింగ్, తర్వాత గ్రామపంచాయతీలో సర్పంచ్ కౌంటింగ్ జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, ఆర్డీఓ సుమా, నోడల్ అధికారులు, ఎంపిడివోలు, తహాశీల్దార్లు, ఇతర విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు మండలాల్లో 85.25 శాతం పోలింగ్

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** జిల్లాలో నిర్వహించిన గ్రామ పంచాయతీ 2వ విడత ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జిల్లాలోని భూపాలపల్లి, చిట్యాల, పలిమెల, మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 9 గంటలకు 26.40 శాతం, 11 గంటలకు 62.37 శాతం, మధ్యాహ్నం 1 గంటకు వరకు 84.14 శాతం పోలింగ్ నమోదైందని తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 82,728 మంది ఓటర్లకు గాను 70,526 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, మొత్తంగా 85.25 శాతం పోలింగ్ నమోదు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

**మండలాల వారీగా నమోదైన పోలింగ్ శాతం :** భూపాలపల్లి 83.24 శాతం, చిట్యాల 84.55 శాతం, పలిమెల 86.38 శాతం, టేకుమట్ల 88.72 శాతం పోలింగ్ శాతం నమోదైనట్టు తెలిపారు. సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదని, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించామని తెలిపారు. ఓటర్లు పెద్ద సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదివారం భూపాలపల్లి మండల పరిధిలోని గొర్లవీడు ప్రాథమికోన్నత. పాఠశాలను ఎస్పి సంకీర్త్ తో కలిసి పరిశీలించారు. అనంతరం కొంపెల్లి జడ్పీ ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గొర్లవీడు ప్రాథమికోన్నత పాఠశాలలో 3496 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగానికి 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు, పోలింగ్ జరుగుతున్న అంశాలను సమగ్రంగా పరిశీలించారు. వయోవృద్ధులను, దివ్యాన్ గులకు వీల్ ఛైర్ సదుపాయం కల్పించినట్లు తెలిపారు.రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఆదివారం ఐడిఓసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ కంట్రోల్ రూమ్ నుండి పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, సాధారణ పరిశీలకులు ఫణీంద్ర రెడ్డి పరిశీలించారు. క్రిటికల్, సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన మొత్తం 33 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ సరళిని వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు.

## హనుమకొండలో 87.25 శాతం

పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు



**ప్రజాపక్షం/హనుమకొండ:** హనుమకొండ జిల్లాలో రెండో విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని మొత్తం ఐదు మండలాలలో జరిగిన పోలింగ్ మొత్తం 87.25 శాతం నమోదు అయింది. జిల్లాలోని పరకాల, వేలేరు, ధర్మసాగర్, ఐనవోలు,హసన్ పర్తి మండలాలలో ఆదివారంరెండత పోలింగ్ జరిగింది. వీటిలో పరకాలలో 86.90 శాతం,వేలేరులో 86.97 శాతం, ఐనవోలులో 88.61 శాతం,హసన్ పర్తిలో 87.90 శాతం,ధర్మసాగర్‌లో 85.85 శాతం పోలింగ్ నమోదు అయింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్ పరకాల, హసన్ పర్తి మండలాలలో పర్యటించి ఎన్నికల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత, డిసిఒ సంజీవరెడ్డి, తహసీల్దార్లు కిరణ్ కుమార్ విక్రమ్ కుమార్, ఎంపిడిఒలు సుమన వాణి, నర్మద, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పాలనలో అన్ని వ్యవస్థలూ నిర్వీర్యం

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి




**ప్రజాపక్షం/ఆత్మకూరు :** ఆత్మకూరు మండలంలోని గ్రామాలలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదివారం స్థానిక ఎన్నికల ప్రచారాల్లో పాల్గొన్నారు. రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదివారం కటాక్షపురు గ్రామం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభమై నాగయ్యపల్లి గ్రామంలో ముగిసింది. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ నీళ్లు నిధులు నియామకాల కోసం అనేక బలిదానాలతో సాధించుకున్న తెలంగాణ కల్వకుంట్ల కుటుంబం చేతిలో దోపిడీకి గురైందని అన్నారు. మిగులు బడ్జెట్‌తో ఏర్పడిన తెలంగాణను ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి అప్పుల తెలంగాణగా మా ర్చారు. తెలంగాణ ఏర్పడితే యువత ఉద్యోగాలు లభించి ఒక గౌరవమైనటువంటి జీవితం గడపచ్చని కలలుగన్న యువత బతుకులు బజారుకీడ్చారు. కెసిఆర్ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం కావడంతో ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాలలో విధ్వంసం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థుల ద్వారా అభివృద్ధి పనులకు హామీలు తీసుకుంటూ, మీరు గెలిచిన తర్వాత వాటిలో ముఖ్యమైనవి తన దృష్టికి తీసుకు వస్తే వాటి అమలకు కృషి చేస్తానని హామీ ఇస్తూ మండలంలోని గ్రామాలలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేస్తూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులకు ఓట్లు వేయాలని ఓటర్లను కోరారు . ఈ సందర్భంగా మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసిలు సొసైటీ చైర్మన్లు వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## కవిత్వం రాయడం కన్నా.. విమర్శే కష్టం

అరసం సాహితీ సభలో డాక్టర్ బన్నా అయిలయ్య

బండారు రాజ్ కుమార్‌కు

వాసిరెడ్డి సాహితీ పురస్కారం అందజేత



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** సాహితీ రంగంలో కవిత్వం రాసే వారి సంఖ్య పెరిగిందని, అయితే కవిత్వం రాయడం కన్నా విమర్శ రాయడం కష్టమైన పనిగా ప్రముఖ సాహితీ విమర్శకులు ఆచార్య బన్న అయిలయ్య అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం ప్రతీ ఏటా నిర్వహిస్తున్న ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు స్మారక సాహితీ పురస్కారం 2025 సంవత్సరానికి సాహితీ విమర్శకు అందించారు. వర్ధమాన కవి బండారు రాజ్ కుమార్ రాసిన తెలంగాణ కవి ముద్ర విమర్శ గ్రంథానికి ఈ పురస్కారం లభించింది. జిల్లా అరసం అధ్యక్షుడు బూర భిక్షపతి అధ్యక్షతన స్థానిక లష్కర్ బజార్ లోని బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతకు నగదు బహుమతిగా 5వేల రూపాయలు, మెమెంటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపన్యాసం చేసిన ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ రాజ్ కుమార్ రాసిన గ్రంథములో తెలంగాణలోని 52 మంది కవుల కవిత్వాలను ఒక ప్రణాళిక ప్రకారంగా రచయిత పూర్వాపరాలను, కవిత్వ నిర్మాణ పద్ధతులను కవిత్వంపై తన అభిప్రాయాలను చక్కగా విశ్లేషించి నట్లు తెలిపారు. ఈ సమావేశంలో గౌరవ అతిథిగా పాల్గన్న రాష్ట్ర అరసం అధ్యక్షుడు డాక్టర్ పల్లేరు వీరాస్వామి అరసం సంక్షిప్త చరిత్రను వివరించారు. ఆచార్య వాసిరెడ్డి భాస్కర్ రావు సంక్షిప్త జీవిత చరిత్రను, సాహితీ సేవలను డాక్టర్ వాసిరెడ్డి క్రిష్ణ పరిచయం చేశారు. బహుమతి పొందిన తెలంగాణ కవి ముద్రను అరసం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నిధి వివరించి తెలిపారు. జిల్లా అరసం కార్యక్రమాలను కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ తెలిపారు. రచయిత్రి గజ్జెల స్వరూపారాణి తొలుత స్వాగత వచనాలు తెలుపగా సభలో వల్లంపట్ల నాగేశ్వరరావు, విఆర్ విద్యార్థి, డాక్టర్ కాయిత వెంకటి, గూళ్ల వెంకటయ్య, గట్టు రాధిక, ఎర్ర ప్రసూన, కోడం కుమారస్వామి, పిట్ట సాంబయ్య, మేకిరి దామోదర్, డాక్టర్ టి. శ్రీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రెండవ విడత పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వరంగల్ సిపి

**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆదివారం జరుగుతున్న గ్రామపంచాయతీ రెండవ విడత ఎన్నికలకు సంబంధించి పలు గ్రామపంచాయతీలో జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్ సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ జనగామ జిల్లా లోని, శామీర్ పేట, బచ్చన్నపేట, నర్మెట్ట, మచ్చు పహాడ్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన భద్రత ఏర్పాటతో పాటు ఎన్నికలు జరుగుతున్న తీరుతెన్నులపై పోలీసు కమిషనర్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా పోలింగ్, ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై కమిషనర్ అధికారులకు పలు సూచన సలహాలు అందజేశారు. సిపి వెంట డిసిపి కుమార్, రాజమహేంద్ర నాయక్, ఎసిపి చైతన్య, ఎసిపి నర్సయ్య, రమణ బాబుతో పాటు స్థానిక ఇన్స్ స్పెక్టర్లు, ఎస్. ఐలు పాల్గొన్నారు.

# క్రీడ

# భారత్ జయభేరి..

## పాకిస్థాన్‌పై చెలరేగిన జార్జ్, తనిష్క్..



అండర్–19 ఆసియా కప్‌ను భారత జట్టు రెండో విక్టరీ కొట్టింది. తొలి పోరులో ఆతిథ్య యూఏఈని చిత్తుగా ఓడించిన టీమిండియా ఈసారి పాకిస్థాన్‌ను 90 పరుగులతో మట్టికరిపించింది. దుబాయ్‌లోని ఐసిసి అకాడమీ మైదానంలో అరోన్ జార్జ్(85) అర్థ శతకంతో చెలరేగగా.. బౌలర్లు దీపేశ్ దేవేంద్రన్(3–16), కనిష్క్ చౌహాన్(3–33) మూడేసి వికెట్లతో దాయాది బ్యాటర్లను బెంబేలెత్తాంచారు. దాంతో.. ప్రత్యర్థిని 41.1 ఓవర్లలో 150కే ఆలౌట్ చేసింది భారత్. వరుసగా రెండో విజయంతో గ్రూప్ ఏ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది ఆయుష్ మాత్రే సేన. అండర్–19 ఆసియా కప్‌లో భారత జట్టు అదరగొడుతోంది. తొలి పోరులో యూఏఈపై భారీ విజయంతో బోణీ కొట్టిన టీమిండియా రెండో మ్యాచ్‌లో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఇటీవల రైజింగ్ స్టార్స్ ఆసియాకప్‌లో ఎదరైన ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటూ 90 పరుగులతో దాయాదిని మట్టికరిపించింది యువ భారత బృందం. తొలుత ఆడిన భారత జట్టుకు ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(5) శుభారంభమివ్వలేదు. కెప్టెన్ ఆయుస్ మాత్రే సైతం(38)కే సయ్యాం ఓవర్లో వెనుదిరిగాడు. 78కే రెండు బిగ్ వికెట్లు పడిన వేళ క్రీజలో పాతుకుపోయిన అరోన్ జార్జ్(85) జట్టుకు భారీ స్కోర్ అందించాడు. పాక్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న జార్జ్ సూపర్ అర్ధ శతకం బాదేయగా.. ఆఖర్లో కనిష్క్ చౌహాన్(46) ధనాధన్ ఆడడంతో టీమిండియా 240 పరుగులకే ఆలౌటయ్యింది.

### ఆదిలోనే దెబ్బకొట్టిన దీపేశ్

ఛేదనలో పాకిస్థాన్‌కు భారత బౌలర్లు దీపేశ్ దేవేంద్రన్(3–16), కనిష్క్ చౌహాన్(3–33)లు చుక్కలు చూపించారు. పవర్ ప్లేలోనే ఓపెనర్ సమీర్ మిన్హాస్(9)ను ఔట్ చేసిన దీపేశ్ వికెట్ల వేటకు తెర తీశాడు. ఆకసేపటికే కనిష్క్ ఓవర్లో ఉస్మాన్ ఖాన్(16) ఔటయ్యాడు. వీరిద్దరి విజృంభణతో 77కే ఐదు వికెట్లు కోల్పోయిన పాక్‌ను కెప్టెన్ ఫర్హాన్ యూసఫ్(23), హుజైఫా అహ్సాన్(70)లు ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ, యూసఫ్‌ను వైభవ్ పెవిలియన్ పంపగా.. అర్ధ శతకంతో మెరిసిన అహ్సాన్.. వైభవ్ స్టన్నింగ్ క్యాచ్‌తో పెవిలియన్ చేరాడు. అంతే.. పాక్ ఓటమి ఖాయమైంది. చివరి బ్యాటర్ అలీ రజా(6)ను కుమార్ సింగ్ బోల్తా కొట్టించగా 90 పరుగులతో టీమిండియా జయకేతనం ఎగురవేసింది. గ్రూప్ దశ మూడో మ్యాచ్‌లో మాత్రే బృందం డిసెంబర్ 16న మలేషియాతో తలపడనుంది.

## యశస్వి విధ్వంసం..



### ముంబైకి చారిత్రక విజయం

విశాఖపట్నం వేదికగా.. భారత జట్టు, దక్షిణాఫ్రికా మధ్య ఇటీవల జరిగిన మూడో వన్డేలో యశస్వి జైస్వాల్ ఈ ఫార్మాట్లో తన తొలి సెంచరీ సాధించిన విషయం తెలిసిందే. అదే ఫామ్‌ను కొనసాగిస్తూ.. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా హరియాణా, ముంబయికి మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తుఫాన్ ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 48 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. చివరికి 50 బంతుల్లో 101 పరుగుల (16 ఫోర్లు, 1 సిక్స్) వద్ద ఔటయ్యాడు. సర్ఫరాజ్ ఖాన్ (64; 25 బంతుల్లో, 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా వేగంగా పరుగులు రాబట్టాడు. దీంతో హరియాణా నిర్దేశించిన 235 పరుగుల భారీ లక్ష్యాన్ని ముంబయి మరో 15 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. అంతకు ముందు టాస్ గెలిచిన ముంబయి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ ప్రారంభిన హరియాణా నిర్ణీత 20 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. కెప్టెన్, ఓపెనర్ అనికేత్ కుమార్ (89; 42 బంతుల్లో, 10 ఫోర్లు, 6 సిక్స్‌లు), నిశాంత్ సింధు (63*; 38 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించారు. సమంత్ జఖర్ (31; 14 బంతుల్లో, 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) రిటైర్డ్ ఔట్‌గా వెనుదిరిగాడు. సుమిత్ కుమార్ (16*, 4 బంతుల్లో, 4 ఫోర్లు) తాను ఎదుర్కొన్న నాలుగు బంతులను బౌండరీకి తరలించాడు. ముంబయి బౌలర్లలో సాయిరాజ్ పాటిల్ ఒక్కడే 2 వికెట్లు తీసుకున్నారు. మిగతా బౌలర్లు వికెట్లు తీసుకోవడంలో విఫలమయ్యారు. అనంతరం ఛేదనకు దిగిన ముంబయి జట్టులో యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ రాణించారు. వీరు రెండో వికెట్‌కు కేవలం 37 బంతుల్లోనే 88 పరుగులు జతచేశారు. అజింక్య రహానే (21; 10 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. అంగ్క్రిష్ రఘువంశీ (7), సూర్యాంశ్ షిడ్జే (13), కెప్టెన్ శార్దూల్ ఠాకూర్ (2) బ్యాటింగ్‌లో విఫలమయ్యారు. సాయిరాజ్ పాటిల్ (8*), అథర్వ అంకోలేకర్ (10*) పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. దీంతో ముంబయి జట్టు 17.3 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 238 పరుగులు సాధించి 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. హరియాణా బౌలర్లలో సమంత్ జఖర్ 2, అన్షుల్ కాంబోజ్, ఇషాంత్ భరద్వాజ్, సుమిత్ కుమార్, అమిత్ రాణా తలో వికెట్ తీసుకున్నారు.

## పంజాబ్‌పై ఆంధ్ర విజయం



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ సూపర్ లీగ్ దశలో ఆంధ్ర తొలి విజయం సాధించింది. గ్రూప్ ఎలో పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ 5 వికెట్ల నష్టానికి 205 పరుగులు చేసింది. ఈ లక్ష్య ఛేదనలో ఆరంభంలో తడబడిన ఆంధ్ర ఆలస్యంగా పుంజుకుని అద్భుత విజయం అందుకుంది. శ్రీకర్ భరత్ (1), అశ్విన్ హెబ్బార్ (4), నితీశ్ కుమార్ రెడ్డి (0) నిరాశపర్చడంతో 12 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. రికీ భుయ్ (15), పైలా అవినాష్ (13) కూడా త్వరగా పెవిలియన్ చేరడంతో 56 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయి ఘోర ఓటమి దిశగా పయనించింది. కానీ, ఈ దశలో హేమంత్ రెడ్డి (109*; 53 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లు), ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (53*; 35 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) గొప్పగా పోరాడి జట్టుకు అద్భుత విజయాన్ని అందించారు. తొలుత పంజాబ్ బ్యాటర్లలో హర్నూర్ సింగ్ (42; 30 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), అన్మోల్‌ప్రీత్ సింగ్ (47; 27 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు), సలీల్ అరోడా (42*; 22 బంతుల్లో 5 ఫోర్లు), రమణ్‌దీప్ సింగ్ (43; 18 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (20) పరుగులు చేశాడు. ఆంధ్ర బౌలర్లలో నితీశ్ కుమార్ రెడ్డి, సత్యనారాయణ రాజు, సౌరభ్ కుమార్, ప్రథ్వీ రాజ్ తలో వికెట్ పడగొట్టారు. ఈ ఇన్నింగ్స్‌తో టీ20ల్లో ఆంధ్ర తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా హేమంత్ రెడ్డి నిలిచాడు. అంతకుముందు ఈ రికార్డు రికీ భుయ్ (108) పేరిట ఉండేది.


# ఫోకస్ ఆరోగ్యం

# ఆరోగ్యానికి శాకాహారం...

శాకాహారంలో అత్యవసర పోషకాలైన ఫైబర్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్ సి/ఈ, మెగ్నీషియం, మంచి కొవ్వు లాంటివి సమృద్ధిగా ఉంటాయి..



వ్యక్తిగత ఆరోగ్యం, జంతు సంక్షేమం, పర్యావరణ సమతుల్యత సాధనలో మొక్కలు/వృక్ష ఆధార శాకాహార జీవన శైలి దోహదపడుతున్నది. శాకాహారంలో పోషక విలువలు మెండుగా ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా దినదినం శాకాహారులు పెరగడం గమనిస్తున్నాం. శాకాహారం తీసుకోవడం వల్ల వాతావరణ ప్రతికూల మార్పుల కట్టడి, వ్యక్తిగత ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, జంతు సంక్షేమం లాంటి ఉపయోగాలు కలుగుతున్నాయి. శాకాహారులు పెరిగితే జంతు సంహారం తగ్గుతుంది. మాంసాహారంతో పోల్చితే శాకాహారం జీర్ణం కావడం తేలిక. శాకాహార ప్రయోజనాలను వివరించడానికి ప్రచారాలు, అవగాహన సదస్సులు, విద్యాలయాల్లో పోటీలు, పౌర సమాజంలో చైతన్య కార్యక్రమాలు, మొక్కల ఆధారిత ఆహార పదార్థాలను ప్రోత్సహించే ప్రభుత్వ చర్యలు, ఉచిత శాకాహార పంపిణీ, సామాజిక మాధ్యమ ప్రచారాలు, ర్యాలీలు, శాకాహార వంటల పోటీలు లాంటి పలు కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించుకోవచ్చు. శాకాహారంతో భూమాతను ఎనలేని మేలును చేసిన వారం అవుతాం. శాకాహారంతో జంతు రక్షణ, భూగ్రహ పరిరక్షణ జరుగుతాయి. మనం తీసుకునే ఆహారమా మన ఆరోగ్యానికి పునాది అని తెలుసుకోవాలి. గుండె సంబంధ వ్యాధులు, స్ట్రోక్, క్యాన్సర్, టైప్2 మధుమేహం లాంటి జబ్బుల కట్టడికి శాకాహారం దోహదపడుతున్నది. మాంసాహారం కోసం జంతు సంహారం జరుగుతోంది. మాంసాహార జంతువులను పెంచడానికి అపారమైన హరిత వనాలు లేదా అడవులు కావాలి. శాకాహార పంటలు పండించడానికి తక్కువ నీరు, నేల, ఇంధనం అవసరం అవుతాయి. పపంచవ్యాప్తంగా దాదాపు 355 మిలియన్ల శాకాహారులు ఉన్నట్లు అంచనా. ప్రపంచ దేశాల్లో అత్యధికంగా భారత్‌లోనే దాదాపు 40 శాతం వరకు ప్రజలు శాకాహారం తీసుకుంటున్నారు. ఆధ్యాత్మిక, పలు ఆచారాలతో శాకాహారులకు ప్రపంచ కేంద్రంగా భారతం నిలుస్తున్నది. ఇజ్రాయిల్, తైవాన్, ఇటలీ, జర్మనీ, ఆస్ట్రియా లాంటి దేశాల్లో కూడా అధిక శాకాహారులు కనిపిస్తారు. ఇతర దేశాల్లో 10–15 శాతం ప్రజలు మాత్రమే శాకాహారం తీసుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఒక కాలరీ విలువ కలిగిన మాంసాహారం కోసం 78 కాలరీల శిలాజ ఇంధనం అవసరం అవుతుండగా, 1 కాలరీ శాకాహారం పండించడానికి కేవలం 1 కాలరీ ఇంధనం మాత్రమే అవసరం అవుతుంది. శాకాహారంలో అత్యవసర పోషకాలైన ఫైబర్, ఫోలిక్ ఆసిడ్, విటమిన్ సి/ఈ, మెగ్నీషియం, మంచి కొవ్వు లాంటివి సమృద్ధిగా ఉంటాయి. తక్కువ కొలెస్టరాల్‌ను కలిగిన శాకాహారం తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం, శరీర బరువు సమతుల్యంగా ఉంటాయి. పలు రకాల వెజిటేరియన్ డైట్‌లో లాంక్టోఓవెజిటేరియన్స్ (శాకాహారం, గుడ్లు, పాల ఉత్పత్తులు తీసుకోవడం), లాక్టోవెజిటేరియన్స్ (శాకాహారం, పాల ఉత్పత్తులు తీసుకోవడం), ఓడ వెజిటేయన్స్ (శాకాహారం, గుడ్లు తీసుకోవడం, పాల ఉత్పత్తులను నిషేధించడం), ఫ్లెగ్జీటేరియన్స్ (శాకాహారంతో పాటు అరుదుగా మాంసాహారం కూడా తీసుకోవడం), పెస్కటేరియన్స్ (శాకాహారంతో పాటు చేపలను తీసుకోవడం), వీగన్స్ (కేవలం మొక్కల ఆధార ఆహారం మాత్రమే తీసుకోవడం) లాంటి ఆహార అలవాట్లను పాటించే ప్రజలు ఉన్నారు. శాకాహార భోజనాలను ప్రోత్సహిస్తూ, మాంసాహారాన్ని క్రమంగా తగ్గించుకునే ప్రయత్నాలు చేయడం వల్ల ప్రత్యక్షంగా ఆరోగ్యం మెరుగుపడడంతో పాటు పరోక్షంగా జంతువుల శ్రేయస్సు, పర్యావరణ సమతుల్యత పెరుగుతాయి. మన జీవనశైలిలో స్వల్ప మార్పులు చేసుకొనడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని గమనించి, మాంసాహారులు క్రమంగా శాకాహారం వైపు మారడానికి అడుగులు వేయాలి, ఆరోగ్యాలు మెరుగు పడాలి.



## 'ఎపిలెప్సీ'పై అవగాహన అవసరం

మెదడుకు అకస్మాత్తుగా, అనియంత్రిత విద్యుత్తు సంభవించుట (ఫిట్స్) వల్ల వచ్చే దీర్ఘకాల నాడీ సంబంధ రుగ్మతను మూర్ఛ వ్యాధి లేదా ఎపిలెప్సీ అంటారు. ఈ వ్యాధిగ్రస్తుల ప్రవర్తన, కదలికలు, భావాలు, స్పృహ కోల్పోవడం లేదా స్పృహ స్థాయిలు మారుతూ ఉంటాయి. పునరావృతం కాగల మూర్ఛలు వచ్చినపుడు ఎపిలెప్సీ నిర్ధారించబడుతుంది. తలకు గాయాలు కావడం, ఆల్కహాల్ పాయిజనింగ్, ఆక్సీజన్ లేకపోవడం, కొన్ని ప్రత్యేక మందులు తీసుకోవడం, విపరీతమైన ఉష్ణోగ్రతలు, రక్తంలో గ్లూకోజ్ చాలా తక్కువగా ఉండడం లాంటి ప్రధాన కారణాలు మూర్ఛ రోగానికి దారి తీస్తాయి. వయో, లింగ, జాతి భేదాలు లేని మూర్ఛ రోగం అల్పాదాయ, మధ్యాదాయ దేశాల్లో (75 శాతం వరకు) అధికంగా కనిపిస్తున్నది. మందులతో నయం కాని సందర్భాల్లో శస్త్ర చికిత్స చేసి నియంత్రణ చేయవచ్చు. కొంత మందిలో జీవితకాలం పాటు చికిత్సలు కొనసాగించాల్సి రావచ్చు. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 7 కోట్లు (ప్రతి వెయ్యి మందిలో 5 నుంచి 9 మందికి), ఇండియాలోనే 1.2 కోట్ల మూర్ఛ వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు అంచనా. భారత్లో 8 నుంచి 12 ఏళ్ల వయస్సు కలిగిన బాలలు వెయ్యిలో 22 మంది చిన్నారుల్లో మూర్ఛ రుగ్మత కనిపిస్తుంది. మూర్ఛ రోగ నిర్ధారణ, చికిత్స, వ్యాధిగ్రస్తులకు చేయూత ఇవ్వడం లాంటి అంశాలను అవగాహన పర్చడానికి జాతీయ మూర్ఛ రోగ దినం వేదికలు ఉపయోగపడుతున్నాయి. ఎపిలెప్సీకి సంబంధించిన ప్రధాన అంశాల్లో అవగాహన, వ్యాధిగ్రస్తులు ఎదుర్కొంటున్న సవాళ్లు, రోగులకు/కుటుంబాలకు సహాయం చేయడం, మూర్ఛ రోగం పట్ల దురభిప్రాయాలను రూపుమాపుతూ ధైర్యాన్నివ్వడం, చికిత్స వివరాలు తెలుపడం, సదస్సులు/కార్యశాలలు/చర్చలు/వీధి ప్రదర్శనలు నిర్వహించడం లాంటి కార్యక్రమాలు చేపట్టవచ్చును. ఎపిలెప్సీని నయం చేయడానికి ఆంటీఎపిలెప్సీ ఔషధాలు వినియోగిస్తారు. ఈ మందులు పని చేయని స్థితిలో శస్త్ర చికిత్సలు చేయడం కూడా జరుగుతుంది. కొన్ని కేసుల్లో ఆహార నియమాల మార్పులు, జీవనశైలి మార్పులు, మానసిక ధైర్యం ఇవ్వడం లాంటివి కూడా సత్ఫలితాలను ఇవ్వవచ్చు. నియంత్రించగల మూర్ఛ రోగం పట్ల అపోహలను తొలగిస్తూ, సమాజంలో వారికి తగు ప్రాధాన్యం లేదా ధైర్యాన్ని నూరిపోస్తూ, సహానుభూతిని అందిస్తూ, అవగాహనలను కొనసాగిస్తూ, రోగగ్రస్తమైన కుటుంబాలకు చేయూతనిస్తూ, వైద్య చికిత్సలను అవగాహన పరుస్తూ, వారి జీవన ప్రమాణాలను పెంచే ప్రయత్నాలను చేద్దాం, వారికి మేమున్నామనే ధైర్యాన్ని కలిగిద్దాం.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## ఓటు హక్కు వినియోగించుకున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

**ప్రజాపక్షం/ఖమ్మం :** రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఆదివారం ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగానే పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లాలో ఎన్నికలు జరిగిన ఆరు మండలాల్లో అత్యధికంగా ఖమ్మం రూరల్ మండలంలో 93.76 శాతం పోల్ కాగా అతి తక్కువగా కామేపల్లి మండలంలో 87.03 శాతం పోలైంది. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అశ్వారావుపేట తదితర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు విద్యానగర్ కాలనీలో ఓటు హక్కును వినియోగించుకోగా శాసన మండలి సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్ పిండిప్రోలులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఖమ్మం సిపి సునీల్ దత్ పలు సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల పరిశీలకులు ఖర్తడే కాళీచరణ్ సుధమరావు నేలకొండపల్లి, ముదిగొండ, కూసుమంచి, ఖమ్మం రూరల్ మండలాల్లో పలు కేంద్రాలను తనిఖీ చేశారు.



## ప్రజాసమస్యలపై కమ్యూనిస్టులవి రాజీలేని పోరాటాలు : ఎమ్మెల్సీ సత్యం



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ముత్యాల అంజయ్యను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మహమ్మదాబాద్ గ్రామంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం చేస్తూ ప్రజలను కలిసి సిపిఐ అభ్యర్థికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులవి రాజీలేని పోరాటాలు అన్నారు. గ్రామాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం సిపిఐ ఎల్లప్పుడు పోరాడుతుందని తెలిపారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన ముత్యాల అంజయ్య సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామానికి న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్, మిత్రపక్షాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కూనంనేని ఇలాకాలో ఎర్రదండు విజయఢంకా

### రెండు మండలాల్లో భారీగా సర్పంచ్ స్థానాలు కైవసం
### వార్డుల్లోనూ కొనసాగిన విజయ పరంపర

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కూనంనేని సాంబశివరావు ఇలాకాలో ఎర్రదండు విజయఢంకా మోగించింది. గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికలు భాగం గా నియోజకవర్గంలోని చుంచుపల్లి, పాల్వంచ మండలాల్లో ఆదివారం నిర్వహించారు. చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా శాంతిశ్రీ ఏకగ్రీవంగా కాగా, 4–ఇంకైన్ సర్పంచ్‌గా అజ్మీరాసింధు, బాబుక్యాంపు సర్పంచ్‌గా నూనావత్‌కుమారి, గౌతంపూర్ సర్పంచ్‌గా సపావత్ కళ్యాణి,, పెనుబల్లి సర్పంచ్‌గా రెడ్డి సుజాత, పెనగడప సర్పంచ్‌గా కారం సీతారాములు, రామాంజనేయ కాలనీ సర్పంచ్‌గా తాగోరి సరిత, ప్రశాంతినగర్ సర్పంచ్‌గా వాడే రాములు సమీప అభ్యర్థులుపై భారీ విజయం సాధించారు. అదే విధంగా పాల్వంచ మండలంలో 4 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం కాగా రేగులుగూడెం సర్పంచ్‌గా కుర్సం రాములు, మందెరకలపాడు సర్పంచ్‌గా బాణోత్ లక్ష్మి, కారెగట్టు సర్పంచ్‌గా వట్టం బాబూరావు, పునుకుల సర్పంచ్‌గా వజ్జా కృష్ణవేణి, ప్రబాత్ నగర్ సర్పంచ్‌గా బోజన్ నిషారాణి, లక్ష్మీ దేవిపల్లి ఎస్ సర్పంచ్‌గా భూక్యా మంజుల, నాగారం కాలనీ సర్పంచ్‌గా తేజావత్ వినోద్ కుమార్, దంతెలబోర ఎస్‌సి కాలనీ సర్పంచ్‌గా సోదె వెంకట రమణలు 9 స్థానాల్లో గెలుపొందారు. సీతాయిగూడెంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై సిపిఐ బలపరిచిన పిట్టల రామ లక్ష్మయ్య 12 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

### ప్రత్యర్థులకు చుక్కలు చూపించిన ఎర్రసైన్యం

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న అనూహ్య పరిణామాలతో ఒంటరి పోరుకు సిద్ధపడ్డ సిపిఐ అవాకులు చెవాకులు పేలిన వారికి చుక్కలు చూపించింది. పోటీ చేసిన ప్రతీ స్థానంలో అగ్రభాగాన నిలిచింది. డబ్బు, మద్యం ఎరవేసి ఓటర్లను ప్రలోబాలకు గురిచేసేందుకు ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు సారధ్యం, జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా నేతృత్వంలో నియోజకవర్గంలో తిరుగులేని శక్తిగా సిపిఐ నిలిచింది. కమ్యూనిస్టులదేముందిలే అంటూ నోళ్లు పారేసుకున్న వారి నోళ్లు వెల్లబెట్టేలా దిమ్మతిరిగే సమాధానం చెప్పింది.





## ఖమ్మం, యాద్రాద్రి, సూర్యాపేట జిల్లాల సిపిఐ సర్పంచులు

### గూడూరుపాడులో సిపిఐ ఘన విజయం

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా గూడూరుపాడులో మరోసారి సిపిఐ తన సత్తాను చాటింది. ఖమ్మం రూరల్ మండలం గూడూరుపాడులో సిపిఐ అభ్యర్థిగా బరిలో దిగిన పుచ్చకాయల శ్రీదేవి విజయం సాధించారు. ఖమ్మం రూరల్ మండలం పల్లె గూడెంలో సిపిఐకి చెందిన సృజన విజయం సాధించారు. దారెడులో బత్తుల వెంకటేశ్వర్లు విజయం సాధించారు.

### దుప్పల్లి సర్పంచ్‌గా సిపిఐ నాయకుడు జావిద్ విజయం

**వలిగొండ :** యాద్రాద్రి జిల్లా వలిగొండ మండలం దుప్పల్లి గ్రామం సర్పంచ్‌గా సిపిఐ బలపరిచిన అభ్యర్థి జావీద్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆదివారం జరిగిన రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో సమీప అభ్యర్థిపై 260 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.



### శాంతినగర్‌లో సిపిఐ అభ్యర్థి

**కోదాడ(అనంతగిరి) :** సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని శాంతినగర్ గ్రామపంచాయతీకి జరిగిన ఎన్నికల్లో సిపిఐ సర్పంచ్ అభ్యర్థి వాడకొప్పుల ఉమ లింగయ్య విజయం సాధించారు. గ్రామంలో మొత్తం 1528ఓట్లకు 1404ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ బలపర్చిన బిఆర్ఎస్ అభ్యర్థి షేక్ ఖాజాబీపై 187ఓట్ల మెజార్టీ సాధించారు. మొత్తం 12 వార్డులు ఉండగా ఏడుగురు సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు.

**కోదాడ (చిలుకూరు) :** మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీకి ఆదివారం జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి మండవ జయమ్మ వెంకటేశ్వర్లు విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థి దేశగాని రాంబాయిపై 537 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 12వార్డులు ఉండగా సిపిఐ అభ్యర్థులు 5వార్డుల్లో విజయం సాధించారు.

### అల్వాలపురంలో సిపిఐ అభ్యర్థి పోతురాజు సత్యనారాయణ ఘన విజయం

**కోదాడ రూరల్ :** మండలంలోని అల్వాలపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థి పోతురాజు సత్యనారాయణ ఘన విజయం సాధించారు. ఆయన సమీప ప్రత్యర్థి బిఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి మీసాల శోభారాణిపై 246 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం గ్రామంలో 853 ఓట్లు ఉండగా 781 ఓట్లు పోలైయ్యాయి. ఇందులో 11 ఓట్లు చెల్లనివి కాగా సత్యనారాయణకు 508 ఓట్లు రాగా శోభారాణికి 262 ఓట్లు వచ్చాయి. మొత్తం 8 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు 4 స్థానాల్లో విజయం సాధించారు.

### జెర్రిపోతులగూడెం సర్పంచ్‌గా లలిత

**కోదాడ(చిలుకూరు) :** మండలంలోని జెర్రిపోతుల గూడెం గ్రామ పంచాయతీకి ఆదివారం జరిగిన ఎన్నికల్లో బిఆర్ఎస్, బిజెపి బలపర్చిన సిపిఐ అభ్యర్థి గుగులోతు లలిత ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థిపై 365 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 12 వార్డులు ఉండగా 8 వార్డుల్లో సిపిఐ అభ్యర్థులు విజయం సాధించారు.

### వార్డు సభ్యురాలిగా సిపిఐ గెలుపు

**ధర్మసాగర్ :** హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్ గ్రామంలో మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలిగా సిపిఐ బలపరిచిన ఆరవ వార్డు మెంబర్ చిలుక ప్రతిభ గెలుపొందారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సబ్ కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాసాగర్:రెండో విడత సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు కొనసాగేలా చూడాలని స్థానిక అధికారులకు,ఓటర్లకు, అదేవిధంగా ఎన్నికల్లో పోటీచేస్తున్న అభ్యర్థులను సూచించారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్, మహ్మద్‌నగర్ మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు.

## పగిలిన మిషన్ భగీరథ పైప్ లైన్

### వృథాగా పోతున్న తాగునీరు;పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/అల్లాదుర్గం:మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం లోపం వల్ల ప్రతిగ్రామానికి అందవలసిన తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతున్నాయి. మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ఐబి చౌరస్తా వద్ద మిషన్ భగీరథ పైప్లైన్ పగిలి భారీ ఎత్తున ఎగిసి పడి నీళ్లు వృథాగా రోడ్డుపై పారుతున్నాయి. పక్షం రోజుల క్రితమే ఇదే ప్రాంతంలో పైప్‌లైన్ పగిలింది. మరల ఈ ప్రాంతంలోనే పైప్ లైన్ పగలడం పట్ల పలు గ్రామస్తులు అధికారుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తూతూ మంత్రంగా మరమ్మతులు కారణంగానే ఇలాంటి సమస్యలు పునరావృతం అవుతున్నట్లు పలు గ్రామస్తులు పేర్కొంటున్నారు. మండల అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నట్లు వారు ఆరోపించారు. సుమారు గంటసేపు నీళ్లు రోడ్డుపై ఉధృతంగా ప్రవహించాయి. ఇప్పటికైనా మిషన్ భగీరథ ఉన్నతాధికారులు స్పందించి విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని, తాత్కాలికంగా మరమ్మతులు కాకుండా పట్టిష్ఠంగా పైప్ లైన్ మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరారు.

## ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు రికార్డు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :నిర్మల్ పట్టణంలోని ఆల్ఫోర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో,భారత దేశ మహనీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని (ఏ.ఎం.ఓ.టి)పరీక్ష అత్యంత విజయవంతంగా నిర్వహించబడింది.ఈ పరీక్షకు వివిధ పాఠశాలలకు చెందిన మొత్తం 1603 మంది విద్యార్థులు హాజరుకావడం విశేషం ఇది అల్ఫోర్స్ గర్ల్స్ జూనియర్ కాలేజీ,నిర్మల్ కేంద్రంలో ఇప్పటివరకు నమోదైన రికార్డు బ్రేకింగ్ హాజరు కావడం గమనార్హం.తరగతి 3 నుండి 10 వరకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని పరీక్షను విజయవంతం చేశారు.విద్యార్థుల్లో గణతంపై ఆసక్తిని పెంపొందించడం,వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే ఈ ఏఎంఓటి పరీక్ష యొక్క ప్రధాన లక్ష్యం అని నిర్వాహకులు తెలిపారు.భవిష్యత్తులో కూడా విద్యార్థుల విద్యా అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని,ఇలాంటి ప్రతిష్టాత్మక గణిత పరీక్షలను మరింత విస్తృత స్థాయిలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

## ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి



ప్రజాపక్షం/గజ్వేల్:తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో అహ్మదీపూర్ సర్పంచ్ గా బ్యాగారి ప్రభాకర్ ఎన్నికవగా, ఆదివారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, వార్డు మెంబర్లు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం వారిని మాజీ మంత్రి హరీష్ రావు అభినందిస్తూ శాలువాతో సన్మానించారు.అహ్మదీపూర్ పంచాయతీ ఎన్నికలలో బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి ప్రభాకర్ 352 ఓట్ల మెజారిటీతో గెలుపొందడం పట్ల కేసీఆర్ పై ఉన్న ప్రజాభిమానానికి నిదర్శనంగా నిలుస్తున్నట్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్ది రాజిరెడ్డి, పాల రమేష్ గౌడ్,అహ్మద్,నిజామోద్దీన్,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నా రు.

## విజయోత్సవ ర్యాలీలకు అనుమతి లేదు

### ఆసిఫాబాద్ జిల్లా ఎస్పి నికితా పంత్



ప్రజాపక్షం/ఆసిఫాబాద్:గ్రామపంచాయతీ ఎన్నికల ఫలితాల అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, టపాకాయలు కాల్చడం లాంటి చర్యలకు అనుమతి లేదని జిల్లా ఎస్పి నితికా పంత్ తెలిపారు. గురువారం జిల్లాలో కొనసాగుతున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాల లెక్కింపు సందర్భంగా ఆమె మాట్లాడారు. లెక్కింపు కేంద్రాల వద్ద శాంతిభద్రతలు కాపాడేందుకు, అసాంఘిక చర్యలు జరగకుండా 750 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉన్నారని పేర్కొన్నారు. భద్రత కోసం ప్రత్యేక బందోబస్తు, క్యూఆర్టి టీంలు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉంచామన్నారు. గెలిచిన అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఉండాలన్నారు. బైక్ ర్యాలీలు, డీజేలు, టపాకాయలు కాల్చడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే వారిపై, నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తామని హెచ్చరించారు. సంబంధిత అధికారులు నిర్దేశించిన తేదీల్లో మాత్రమే ర్యాలీలు జరుపుకోవాలని సూచించారు.

## గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి

### ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ప్రజాపక్షం /సంగారెడ్డి ;సంగారెడ్డి ,సదాశివపేట, పట్టణంలో ఎమ్మెల్యే చింతాప్రభాకర్‌ను నూతన సర్పంచులు కలిసారు. వారికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. హరిదాస్‌పూర్, మారేపల్లి , తమ్ముల బాయ్ తండా ,మారేపల్లి, మాచిరెడ్డి పల్లి , చర్లగూడెం, నూతన సర్పంచులు వార్డు మెంబర్లు ఎమ్మెల్యేను కలిసారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపకు కృషి చేసిన పార్టీ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.కెసిఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కంది మండల పార్టీ అధ్యక్షుడుమదుసూదన్ రెడ్డి, మాణిక్యం ,మాజీ సర్పంచ్, మొగులయ్య, మాజీ సర్పంచ్ తదితరులున్నారు.

# 436 కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్

### పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



ప్రజాపక్షం /సంగారెడ్డి:జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఉదయం 7.00 గంటలకు ప్రశాంతంగా ప్రారంభమయ్యింది. ఓటు హక్కు వినియోగంచుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం నుండి ఓటర్లు బారులు తీరారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ప్రావీణ్య చౌటుకూరు మండలంలోని చౌటకూర్ ,సుల్తాన్ పూర్ గ్రామ పంచాయతీలలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పోలింగ్ కేంద్రం లోని ఏర్పాట్లను వసతులను పరిశీలించారు. హెల్ప్ డెస్క్ మెడికల్ క్యాంపు ,దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్ చైర్స్ తదతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం రెండవ విడతలో 229 సర్పంచ్ స్థానాలకు 1941 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగాయి. కలెక్టర్ పర్యవేక్షణలో అందోల్ చౌటకూర్ ఝురాసంఘం ,కోహీర్, మొగుడంపల్లి , మునిపల్లి, పుల్కల్, రాయికోడ్, వట్పల్లి ,జహీరాబాద్ మండలాల పరిదిలో ఓటింగ్, కౌంటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఏలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని ప్రశాంత వాతావరణంలో ఓటరు స్వేచ్ఛా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశామని 436 కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ జరిపించాలమని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ సరళిని పరిశీలించడంతో పాటు స్థానిక పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరిగిందన్నారు. అనంతరం మద్యాహ్నం 2.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా చర్యలు చేట్టారు. కౌటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదనానికి తావు లేకుండా జాగ్రత్తగ ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

**జిల్లా ఎస్‌పి పరితోష్ ఫంకజ్ ఆధ్వర్యంలో పటిష్ఠమైన భద్రత ఏర్పాట్లు**

జిల్లా ఎస్‌పిపరితోష్ ఫంకజ్ ఆధ్వర్యంలో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. ఎన్నికల సాదారణ పరిశీలకులు కార్తిక్ రెడ్డి , సుల్తాన్‌పూర్, తాడ్డాన్‌పల్లి , గౌంగ్లూరు సంగుపేట ,డాకూర్, మర్వెల్లి, వట్పల్లి నాగులపల్లి, పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, , అందోల్ మండలం డాకూర్ ,బ్రాహ్మణపల్లి, పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ తీరుతెన్నులను పరిశీలించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి పాండు పాల్గొనగా జనరల్ అబ్జర్వర్ వెంట హౌసింగ్ పీడి చలపతిరావు, తహసీల్దార్ పాల్గొన్నారు.

## ఏడుపాయల క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ప్రజాపక్షం/పాపన్నపేట:ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వన దుర్గామాత క్షేత్రంలో ఆదివారం భక్తులతో జనసంద్రమైంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఏడుపాయలకు భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు వేకువ జామునే అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించి భక్తులకు వనదుర్గమ్మ దర్శనం కల్పించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగు జిల్లాలు, జంట నగరాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మ దర్శనానికి తరలివచ్చారు. చెక్ డ్యామ్, అమ్మ వారి ప్రధాన ఆలయం ముందున్న మంజీరా నదీ పాయలో పుణ్యస్నానాలు ఆచరించి వనదుర్గాదేవి దర్శనానికి బారులు తీరారు. రు. పలువురు భక్తులు అమ్మవారికి డప్పు చప్పుల్ల మధ్య బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. మరి కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల జయ జయ ద్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గాదేవి క్షేత్రం హోరెత్తింది.ఆలయ అర్చకులు పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు. ఎస్ఐ సార శ్రీనివాస్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## డ్యాంగాపూర్ పోలింగ్ కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### అధికారులకు కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు..



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :జిల్లాలో రెండో దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా,జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఆదివారం నిర్మల్ గ్రామీణ మండలం,డ్యాంగాపూర్ గ్రామంలో ఆకస్మికంగా పర్యటించారు.పోలింగ్ కేంద్రాల తనిఖీ డ్యాంగాపూర్ గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాల,అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ అభినవ్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా అక్కడ కొనసాగుతున్న పోలింగ్ సరళిని దగ్గరగా పరిశీలించారు.ఓటర్లకు ఏర్పాటు చేసిన కనీస సౌకర్యాలు(తాగునీరు,నీడ,లైటింగ్ వంటివి )సరిగా ఉన్నాయో లేదో పరిశీలించారు.ఇప్పటివరకు నమోదైన పోలింగ్ వివరాలను అక్కడి ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు.అధికారులకు కట్టుదిట్టమైన సూచనలు ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ అధికారులకు కీలక సూచనలు చేశారు.ఓటింగ్ ప్రక్రియతో పాటు,అనంతరం జరిగే కౌంటింగ్,ఉప సర్పంచ్ ఎన్నికలను అత్యంత పకడ్బందీగా,ఎటువంటి లోపాలు లేకుండా,పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.కౌంటింగ్ ప్రక్రియను ఫలితాలను త్వరగా వెల్లడించాలని ఆమె స్పష్టం చేశారు.కలెక్టర్‌తో పాటు పర్యటించిన అధికారులు ఈ ఎన్నికల కేంద్రం తనిఖీలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్,ఎంపిడిఓ గజానన్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో ఎన్నికల సిబ్బంది మరింత అప్రమత్తమై విధులను నిర్వర్తించారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రామగుండం సిపి





ప్రజాపక్షం/వేమనపల్లి/ బెల్లంపల్లి:వేమనపల్లి మండలంలో జరుగుతున్న గ్రామపంచాయతీ రెండో విడత ఎన్నికల పోలింగ్ కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సందర్శించారు. ఆదివారం మంచిర్యాల జోన్ బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలోని తాళ్ళగురిజాల, నెన్నెల గ్రామాల్లో పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికలు జరుగుతున్న తీరుపై అధికారులతో సమీక్షించారు. పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలపై, ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ, ఫలితాల వెల్లడి పూర్తయ్యే వరకు పూర్తి అప్రమత్తతతో ఉండాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ప్రజలు శాంతియుతంగా సహకరించాలని, గెలుపు ఓటముల విషయంలో ఎవరూ ఉద్రిక్తతలకు లోనుకాకుండా ఉండాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు భద్రతా చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపి వెంట మంచిర్యాల ఎసిపి ఆర్ ప్రకాష్, నెన్నెల ఎస్ఐ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## నూతన సర్పంచులకు అండగా ఉంటా

### ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి హామీ



ప్రజాపక్షం/ఎడపల్లి:గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని, నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. గ్రామాలకు సంబంధించిన నిధులు సక్రమంగా మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీనిచ్చారు. ఆదివారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఓ పంక్షన్ హాల్‌లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు జాన్కంపేట్, ఏఆర్పి క్యాంప్, బాపునగర్, దుబ్బ తండా, జైతాపూర్, జమ్లం, కుర్నాపల్లి, మంగల్‌పహాడ్, ఎమ్మెస్సీ ఫారం, పోచారం, వడ్డేపల్లి గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందగా వారందరిని ఎమ్మెల్యే శాలువాలతో, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ముందస్తు గా మహిళలకు డ్వాక్రా సంఘాల ద్వారా ఆర్థిక సహాయం చే యడం జరుగుతుందన్నారు. ఎవరికీ ఏ సమస్య ఉన్నా తన దృ ష్టికి తీసుకరావాలని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎ మ్మెల్యే తెలిపారు. గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలని ఈ సందర్భంగా నూతన సర్పంచ్‌లను ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా బ్లాక్ అధ్యక్షుడు బిల్లా రామ్మోహన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఈరంటి లింగం, సొసైటీ ఛైర్మన్ నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో ఆయేషా మస్రత్ ఖానం తనిఖీ



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:గ్రామ పంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం ఆదివారం,జిల్లాలో రెండో విడత ఎన్నికలు జరుగుతున్న పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.దిలావర్‌పూర్, నిర్మల్ గ్రామీణ మండలంలోని వెంగ్వాపేట్,తల్వేద,లంగ్డాపూర్,దిలావర్‌పూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.ఆయా పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ సరళిని చూశారు.ఓట్లు వేయడానికి వచ్చిన ఓటర్లకు ఏవైనా ఇబ్బందులు ఉన్నాయోమో పరిశీలించారు.అధికారులతో మాట్లాడుతూ,ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని పకడ్బందీగా పూర్తి చేయాలని అన్నారు.

## రెండ విడత పంచాయతీ ఎన్నికల్లో 84.54 శాతం పోలింగ్

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



ప్రజాపక్షం / కాగజ్ నగర్ :జిల్లాలో రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, మధ్యాహ్నం 1 గంట వరకు సగటున 84.54 శాతం పోలింగ్ నమోదైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే తెలిపారు. ఆదివారం పెంచికలపేట మండలంలోని బొంబాయిగూడా, చెడువాయి గ్రామపంచాయతీలలో జరుగుతున్న పోలింగ్ సరళిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత కీలకమైనదని, ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. దహెగాం మండలంలో అత్యధికంగా 90.09 శాతం పోలింగ్ నమోదైందని, బెజ్జూరు 82.11, చింతలమానేపల్లి 84.88, కౌటాల 83.88, పెంచికల్‌పేట్ 88.72, సిర్పూర్ (టి) మండలంలో 84.22 శాతం చొప్పున పోలింగ్ నమోదైనట్లు వివరించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల పోలింగ్,కౌంటింగ్ ప్రక్రియ పర్యవేక్షణ



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్:రెండవ విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా అత్యంత ప్రశాంత వాతావరణంలో,ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసింది.పోలీస్ శాఖ పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయడంతో ఓటర్లు స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.పోలింగ్ కేంద్రాలలో ఎస్‌పివిస్తృత పర్యవేక్షణ పోలీస్ శాఖ తరపున తీసుకున్న భద్రతా చర్యలను జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ స్వయంగా పర్యవేక్షించారు. నేపథ్యంలో,ఆమె కుంటాల పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంటాల,ఓల గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.అక్కడ బందోబస్తు,ప్రవేశనిష్క్రమణ మార్గాలు,బ్యారికేడింగ్,సిసిటివి పర్యవేక్షణ క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలను ఆమె సమగ్రంగా పరిశీలించారు.ముఖ్యంగా,మహిళలు,వృద్ధులు,వికలాంగ ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని,ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేలా అనుకూల వాతావరణం కల్పించాలని పోలింగ్,భద్రతా సిబ్బందిని ఎస్‌పిఆదేశించారు.అంతేకాకుండా,శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆమ హెచ్చరించారు.కలెక్టర్ కలిసి ధని పోలింగ్ కేంద్రం పర్యవేక్షణ ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ సారంగాపూర్ మండలం,ధని గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి సంయుక్తంగా పర్యవేక్షించారు.ఇద్దరు ఉన్నతాధికారులు పోలింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను,పోలింగ్ ప్రిక్రియ నిర్వహణ తీరును పరిశీలించి,అధికారులకు,సిబ్బందికి తగిన సూచనలు చేశారు. అలాగే,లోకేశ్వరం పోలింగ్ కేంద్రాన్ని కూడాఎఎస్‌పిసందర్శించి,భద్రతా ఏ ర్పాట్లను సమీక్షించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికల నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అధికారులకు సూ చించారు.కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా కౌంటింగ్ నిఘా రెండవ విడత పోలింగ్ ప్రశాంతంగా ముగిసిన తరువాత,పంచాయతీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ జిల్లాలో పారదర్శకంగా కొనసాగింది.కౌంటింగ్ సమయంలో కూడా భద్రతకు ఎలాంటి విఘాతం కలగకుండా,జిల్లా ఎస్‌పి డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచే నిరంతరం పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాల పర్యవేక్షణ,పోలీసు బందోబస్తుపై ఎస్‌పి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.అవసరమైన చోట అదనపు బలగాలను మోహరించేలా చర్య లు తీసుకుంటున్నట్లు ఆమె తెలియజేశారు .ఈ సమగ్ర పర్యవేక్షణలో జిల్లా ఎస్‌పివెంట బైంసా ఎఎస్‌పి రాజేష్ మీన ఐపిఎస్,ఇన్స్పెక్టర్లు,ఎస్ఐ అశోక్,ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు .పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీసు నిఘా కొనసాగిందని ఎస్‌పి కార్యాలయం ప్రకటించింది.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ప్రశాంతంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు

ప్రజాపక్షం/దుబ్బాక: దుబ్బాక నియోజక వర్గంలోని దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేటభూంపల్లి మండలాల్లో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బ్యాలెట్ పద్దతిలో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గంటల నుండి ప్రారంభం కాగా రాత్రి వరకు కొనసాగింది. దుబ్బాక మండలం హబ్సిపూర్, పెద్దగుండవెల్లి గ్రామాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమవతి సందర్శించారు. దుబ్బాక మండలంలోని 21 గ్రామాలకు గాను వెంకటగిరి తండా సర్పంచ్‌తో పాటు వార్డు మెంబర్లు సైతం ఏకగ్రీవం అయింది. పోతారం గ్రామ సర్పంచ్ ఏక్రగీవం అయింది. దీంతో 20 గ్రామాల్లో నిర్వహించిన పోలింగ్‌లో 86.87 శాతం పోలింగ్ నమోదైన్నట్లు ఎన్నికల సహాయ అధికారి, ఎంపిడివో భాస్కర్ శర్మ తెలిపారు. మిరుదొడ్డి మండలంలో 87.18 శాతం పోలింగ్ నమోదైంది. అక్బర్‌పేటభూంపల్లి మండలంలో 87.07 శాతం పోలింగ్ నమోదైంది.

## మంత్రి శ్రీధర్ బాబును కలిసిన నూతన సర్పంచులు



ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలంలో కాంగ్రెస్ బలపరచగా గెలుపొందిన నూతన సర్పంచ్‌లకు రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ బలపరచగా గెలుపొందిన నూతన సర్పంచ్‌లు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో ఆదివారం మంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు నూతన సర్పంచ్‌లను అభినందించారు. గ్రామాల అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం పక్షాన తన సహాయ, సహకారాలుంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు వాజీద్ పాషా, ఎన్నికైన సర్పంచులు బియ్యాని శివకుమార్, బొంతల అన్నపూర్ణ ఉపేందర్ , చిలువేరి జ్యోతి లక్ష్మ ణ్, ఇండ్ల కృష్ణవేణి సదానందం ,మేంగాని సమత తిరుపతి, తాని ప్రభాకర్ ,రాపల్లి రాజయ్య ,చొప్పరి సదానందం పెగడ తిరుమల, గడ్డం రాజేశం,మాజీ ఎంపిటిసి దొడ్డ గీతారాణి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బక్కతట్ల వినీత్ ఉన్నారు.

## ఓటు మన హక్కు...ఓటు వేయడం మన బాధ్యత: ఎంపి



ప్రజాపక్షం/దుబ్బాక: ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని, ఎన్నికలు ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభాలుగా ఉంటాయని, సమర్ధవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవడానికి ప్రతి పౌరుడు తన ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిన బాధ్యత ఉందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం దుబ్బాక మండలం పోతారం గ్రామంలో ఎమ్మెల్యే సతీమణితో కలిసి ఓటు హక్కును వియోగించుకున్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం అనుభవం, ప్రజలపై ప్రేమ ఉన్న నాయకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలందరూ స్వచ్ఛందంగా ఎన్నికల్లో పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అక్బర్‌పేట భూంపల్లి మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. భూంపల్లి గ్రామంలోని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ 2025కు అపూర్వ స్పందన



ప్రజాపక్షం/కరీంనగర్: ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మ్యథ్స్ ఒలంపియాడ్ 2025కు అపూర్వ స్పందన లభించినట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, గణితం ద్వారా విద్యార్థులకు మేధస్సు పెరుగుతుందని, ప్రతిభకు వన్నె తెస్తుందని అన్నారు. అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆరంభం నాటి నుండి శ్రీనివాస రామానుజన్ జ్ఞాపకార్థమై జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా చక్కటి ప్రణాళికలతో తెలంగాణ వ్యాప్తంగా 3వ తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించినట్లు తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈ పరీక్షకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 18,450 విద్యార్థులు హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఉంటాయన్నారు. మొదటి 3 స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.5000, రూ.3000, రూ.2000 నగదు బహుమతులను ఇవ్వడంతో పాటు ప్రశంస పత్రాలను అతిథుల చేతుల మీదుగా ఈనెల 22వ తేదీన కరీంనగర్ లో కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో మీదుగా బహుమతులు ప్రధానం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ లోని వివిధ ప్రాంతాల నుండి వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు: ఎస్‌పి



ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: రెండవ విడత సర్పంచ్ ఎన్నికలలో భాగంగా జగిత్యాల జిల్లాలోని 7 మండలాలలో ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతున్నాయని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా జగిత్యాల రూరల్ మండలంలోని ఎన్నికలు జరుగుతున్న జాబితాపూర్, లక్ష్మీపూర్, పొలస గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను జగిత్యాల జిల్లా ఎస్పీ సందర్శించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లులు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలో పెట్రోలింగ్ వాహనాలు, ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు సిబ్బందికి భద్రత పరమైన పలు సూచనలనుజగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ చేశారు.వృద్ధులు, దివ్యాంగులకు పోలీసు, గ్రామ పంచాయతీ సిబ్బంది సహాయం : రెండో విడత గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆదివారం పోలింగ్ ప్రశాంతంగా జరుగుతున్న సమయంలో ఓటు వేసేందుకు వచ్చే వృద్ధులు, వికలాంగులకు పోలీసు మరియు ధరూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. వృద్ధులు ఓటు వేయడానికి రాగా వీల్ చైర్ కూర్చోబెట్టుకొని పోలీసు, గ్రామ పంచాయతీ సిబ్బంది అందిస్తున్న సహాయ సహకారాల పట్ల పలు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# కరీంనగర్‌లో 86.58 శాతం పోలింగ్ నమోదు

కలెక్టర్ పమేలా సత్పతి





ప్రజాపక్షం/కరీంనగర్: జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రెండో విడతలో గన్నేరువరం, తిమ్మాపూర్, మానకొండూరు, చిగురుమామిడి, శంకరపట్నం మండలాల్లో ఆదివారం ఎన్నికలు జరిగాయి. ఈ విడతలో 113 గ్రామాలు 1046 వార్డులుండగా గన్నేరు వరం మండలంలో రెండు గ్రామాల సర్పంచ్ లు, అన్ని మండలాలు కలిపి 197 వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 111 గ్రామ పంచాయతీలకు 849 వార్డులకు ఆదివారం పోలింగ్ నిర్వహించారు. వీటిలో 436 మంది సర్పంచ్ అభ్యర్థులు, 2275 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు బరిలో నిలిచారు. రెండో విడతలో పోలింగ్ జరిగిన మండలాల పరిధిలో మొత్తం ఓటర్లు 1,85,003 ఉండగా ఇందులో పురుషులు 90,366, స్త్రీలు 94,635, ఇతరులు ఇద్దరున్నారు. ఆదివారం జరిగిన పోలింగ్ లో 1,60,164 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 79,014 కాగా స్త్రీలు 81,169, ఇతరులు ఒకరు ఉన్నారు. చిగురుమామిడిలో 85.82 శాతం, గన్నేరువరంలో 88.55 శాతం, మానకొండూర్ లో 86.66 శాతం, శంకరపట్నంలో 88.03 శాతం, తిమ్మాపూర్ లో 84.84 శాతం కాగా ఐదు మండలాల్లో మొత్తం పోలింగ్ 86.58 శాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు. ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించారు.

**వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళి పరిశీలించిన జిల్లా కలెక్టర్**

పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. జిల్లాలోని ఐదు మండలాల్లో రెండవ విడత పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో 162 పోలింగ్ స్టేషన్ల లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ స్క్రీన్ ల ద్వారా జిల్లా ఎన్నికల అధికారి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ ..

తిమ్మాపూర్ మండలం తిమ్మాపూర్ పంచాయతీ పరిధిలోని జోగయ్య పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, రామకృష్ణ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. చిగురుమామిడి మండలం చిన్న ముల్కనూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గన్నేరువరం మండలం గుండ్లపల్లి లోని శ్రీ రామకృష్ణ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ ను జాగ్రత్త పరచాలని ఆదేశించారు. మధ్యాహ్నం ఒంటి గంటలోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.

**డ్రోన్ కెమెరాలతో బందోబస్తును పర్యవేక్షించిన సిపి**

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న 05 మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను సీపీ సందర్శించారు. డ్రోన్ కెమెరాలను వినియోగిస్తూ, పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ లైన్, బందోబస్తు తీరును సీపీ పర్యవేక్షించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

## జిపి పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు పోలింగ్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ ఆదివారం పరిశీలించారు. బోయినపల్లి, నీలోజిపల్లి గ్రామాల్లోని పాఠశాలలు ఇంచార్జి కలెక్టర్, తంగళ్ళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ కేంద్రాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి సందర్శించారు. ఓటింగ్ పూర్తి అయిన తర్వాత చేపట్టనున్న ఓట్ల లెక్కింపు తదితర అంశాలపై సూచనలు చేశారు. ఈ పరిశీలనలో వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, సీపీఓ శ్రీనివాసాచారి, తహసీల్దార్లు నారాయణ రెడ్డి, జయంత్, ఎంపీడీఓలు జయశీల, లక్ష్మీ నారాయణ, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# రెండో విడతలో 84.15 శాతం పోలింగ్ నమోదు

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని, పెద్దపల్లి జిల్లాలో రెండవ విడత 84.15 శాతం పోలింగ్ నమోదైందని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఆదివారం జరిగిన పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ధర్మారం మండలంలోని జడ్పీహెచ్ఎస్ దొంగతుర్తి, జడ్పీహెచ్ఎస్ మేడారం, వ్యవసాయ మార్కెట్ యార్డ్ ధర్మారం, జడ్పీహెచ్ఎస్ ధర్మారం, పాలకుర్తి మండలంలోని జడ్పీహెచ్ఎస్ కుక్కల గూడూరు, జడ్పీహెచ్ఎస్ ఈసాల తక్కలపల్లి, జడ్‌పిహెచ్ఎస్ పాలకుర్తి, జడ్‌పిహెచ్ఎస్ బసంత్ నగర్ లోనిపోలింగ్ కేంద్రాలను ,అంతర్గాం మండలంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల ఆన్లైన్ ప్రక్రియ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్నం 1గంట వరకు పెద్దపల్లి జిల్లాలో రెండవ విడత ఎన్నికలు జరుగుతున్న 4మండలాల పరిధిలో 84.15శాతం వరకు పోలింగ్ నమోదైందని, 94వేల 807 మంది ఓటర్లు తమ ఓటు హక్కు పంచాయతీ ఎన్నికల్లో వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. రిసెప్షన్ కౌంటర్‌లో ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఎంపీడీవోలకు సూచించారు.ఎన్నికల రిపోర్టింగ్ సకాలంలో అందించాలని, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఎన్నికలో ప్రతి అంశం పారదర్శకంగా జరగాలని, ఎన్నికల సిబ్బందికి భోజన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. కౌంటింగ్ ప్రక్రియలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అన్నారు. ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో నరేందర్, పెద్దపల్లి ఆర్డీఓ బి.గంగయ్య, తాహసిల్దార్లు శ్రీనివాస్, సునీత, ఎంపీడీవోలు ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో పెద్ద ఎత్తున చేరికలు



ప్రజాపక్షం/వేములవాడ టౌన్ : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చందనం శ్రీనివాస్, స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు సభ్యులుగా విజయం సాధించిన నేరెల్ల సరిత గిరి ప్రసాద్, హరిదాసు, శ్రీనివాస్ సుమారు 50 మంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదివారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను నచ్చి కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు.

**కాంగ్రెస్‌లో చేరిన తుర్తి సర్పంచ్ గౌతమి-మహేష్..**

జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామానికి నూతంగా ఎన్నికైన నాయిని గౌతమిమహేష్ శనివారం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశీ వారిని ఘనంగా సత్కరించారు.

# అభివృద్ధిని చూసి ఓటు వేయండి

ఎమ్మెల్యే విజయరమణా రావు



ప్రజాపక్షం/పెద్దపల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తోనే గ్రామాల అభివృద్ధి అని,ఇప్పటివరకు చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు.ఆదివారం రోజున పెద్దపల్లి మండలంలోని పెద్దబొంకూరు, రాఘవాపూర్, రంగాపూర్, మారేడుగొండ, గుర్రాంపల్లి మరియు రాగినేడు గ్రామాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ అధికారంలో వచ్చినప్పటినుండి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, గ్రామాలలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తే మరిన్ని నిధులు తీసుకోవచ్చి పెద్దపల్లి మండలాన్ని సస్యశ్యామలంగా చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో 84.37 శాతం పోలింగ్ నమోదు

కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట జిల్లా రెండవ విడుతలో 10 మండలాల్లో 172గ్రామపంచాయతీలు, 1371వార్డు సభ్యులకు ఆదివారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గ్రామీణ ప్రాంతాల్లో. పల్లేలో ఉదయం నుండి ఓటర్లు బారులు తీరారు. మొదటిరెండు గంటల్లోనే 23శాతం, 11 గంటల వరకు 58శాతం, మధ్యాహ్నం 1గంట వరకు 84.37 శాతం పోలింగ్ నమోదైంది. 10 మండలాల పరిధిలోని 182 గ్రామపంచాయతీలకు 10 స్థానాలు ఏకగ్రీవం అయ్యారు. మిగిలిన 172 గ్రామపంచాయతీల్లో 244776 ఓటర్లకు 206529 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 38.247 మంది ఓటర్లు ఓటింగ్‌కు దూరంగా నిలిచారు. పల్లెల్లో ఓటర్లు ఉదయం పూట ఉత్సాహంగా పాల్గొనటంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు పెద్దఎత్తున బారులు తీరారు. 172 గ్రామపంచాయతీలకు 684మంది అభ్యర్థులు, 1371 వార్డు సభ్యులకు 3644 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. సిద్దిపేట డివిజన్ లోని భూంపల్లిలో 19గ్రామాలకు 3గ్రామాలు ఏకగ్రీవం కా గా, 16గ్రామాలు, బెజ్జంకి మండలంలో 24 గ్రా మాలకు ఒకటి ఏకగ్రీవం కాగా 23 గ్రా మాలలు, చిన్నకోడూరు మండలంలో 28 గ్రామాలకు ఒక గ్రామం ఏకగ్రీవం కాగా 27గ్రామాలు, దుబ్బాకలో 21గ్రామాలకు 2గ్రామాలుఏకగ్రీవం కాగా 19గ్రామాలకు ఎన్నికలు నిర్వహించారు. మిరుదొడ్డిలో 10,నంగునూర్‌లో 25 గ్రామాలకు 2గ్రామాలు ఏకగ్రీవం కావటంతో 23 గ్రామాలకున నిర్వహించారు. సిద్దిపేట అర్బన్ మండలం 12 గ్రామాలకు 1గ్రామం ఏకగ్రీ వం కావటంతో 11గ్రామాలకు, నారాయణరావుపేట 11గ్రామాలు, సిద్దిపేట రూరల్‌లో 15, తొగుటలో 12గ్రామాలకు పోలింగ్ నిర్వహించారు. పంచాయతీ పోలింగ్ ఎన్నికల తీరును సిద్దిపేట జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పరిశీలించారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఆధ్వర్యంలో పోలీసులు పంచాయతీ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తునుఏర్పాటు చేశారు. పోలింగ్‌ను ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ యంత్రాంగం గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. జిల్లాలోని పోలీస్ కమిషనర్‌తో పాటు ఏసిపిలు పరిస్థితిలు ఎప్పటికప్పుడు సమీక్షించారు.

## రాజన్న సిరిసిల్లలో రెండో ఫేజ్ పోలింగ్ 84.41శాతం

మొత్తం 1,04,905 ఓట్లలో పోలైన ఓట్లు 88,553

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో ఫేజ్ ఎన్నికల పోలింగ్ 84.41శాతం నమోదు అయింది. బోయినపల్లి, తంగళ్ళపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఆదివారం పోలింగ్ నిర్వహించారు. మూడు మండలాల్లో కలిపి మొత్తం 1,04,905 ఓట్లు ఉండగా, పోల్ అయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట వరకు 84.41 శాతం పోలింగ్ నమోదు అయింది.

**మండలాల వారిగా ఓటర్లు.. నమోదు అయిన పోలింగ్ శాతం..**

ఇల్లంతకుంట మండలంలో మొత్తం ఓటర్లు 35,932 మంది ఉండగా 30,584 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85.12 శాతం నమోదు అయింది. బోయినపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 30,505 మంది ఉండగా 25,858 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 84.77 శాతం నమోదు అయింది. తంగళ్ళపల్లి మండలంలో మొత్తం ఓటర్లు 38,468 మంది ఉండగా 32,111 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 83.47 శాతం నమోదు అయింది.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్‌పి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రెండవ విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే అన్నారు. ఆదివారం జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట, తంగళ్ళపల్లి మండలాలలో పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు, సిబ్బందికి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేల భద్రత పరమైన పలు సూచనలు చేశారు. పెట్రోలింగ్ వాహనాలు,ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారని అన్నారు.

**ఎన్నికల కోడ్ ముగిసే వరకు విజయోత్సవ ర్యాలీలు నిషేధం..**

గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికలు ముగిసే వరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని ఎన్నికల ఫలితాలు ప్రకటించిన అనంతరం, గెలిచిన అభ్యర్థులు లేదా వారి అనుచరులు విజయోత్సవ ర్యాలీలు, సభలు, బైక్ ర్యాలీలు, డీజేలు వంటి కార్యక్రమాలు నిర్వహించడం పూర్తిగా నిషేధం అన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఆంక్షలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎన్నికల నియమాలను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# కార్మికుల సంక్షేమమే ఐఎన్‌టియుసి లక్ష్యం



ప్రజాపక్షం/రామగిరి: సెంటినరీకాలనీ ఐఎన్టీయూసీ కార్యాలయంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. నరసింహారెడ్డి ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో ఐఎన్టీయూసీ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం, సింగరేణి సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తోందని కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐఎన్టీయూసీ నిరంతరం కృషి చేస్తోందని వారసత్వ ఉద్యోగాల విషయంలో అభ్యర్థుల వయోపరిమితిని 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు పెంచడం జరిగిందని అలాగే నైని బ్లాక్ పనుల ప్రారంభానికి సంబంధించి ఒడిశా ముఖ్యమంత్రి తో చర్చించి పనులు ప్రారంభించామని కార్మికుల సొంత ఇంటి పథకం కోసం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నీ సంప్రదించగా, ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే కార్మికుల ఆకాంక్ష నెరవేరుస్తామని హామీ ఇచ్చారని .గుర్తింపు సంఘం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి యాజమాన్యం, ప్రభుత్వంతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా కాలక్షేపం చేస్తోందని విమర్శించారు. ఐఎన్టీయూసీ మాత్రమే నిజంగా కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పోరాడుతుందని ఆయన తెలిపారుఅనంతరం ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి మాట్లాడుతూ సెంటనరీకాలనీ నుంచి గోదావరిఖని వరకు ఫోర్ లైన్ రోడ్ నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరయ్యాయని, అలాగే పోతన కాలనీ నుంచి సెంటనరీ కాలనీ వరకు నూతన వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రతి అంశంలోనూ కార్మికుల సంక్షేమానికి ఐఎన్టీయూసీ కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు.ఈ కార్యక్రమంలో టైషన్ శ్రీనివాస్ జాయింట్ సెక్రటరీ, గడం తిరుపతి యాదవ్, ఎలాంకి రామారావు సెంట్రల్ కార్యదర్శులు, ఎన్. శ్రీనివాస రావు, సత్రం సమ్మయ్య బ్రాంచ్ కార్యదర్శులు, సందేలా కుమార్ బ్రాంచ్ అసిస్టెంట్ కార్యదర్శి, ప్రేమ్ కుమార్, టి. ప్రవీణ్ రెడ్డి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## 'దేఖ్లేంగే సాలా' పాట ఆవిష్కరణ



'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, దర్శకుడు హరీష్ శంకర్ కలయికలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం నుంచి తొలి గీతంగా 'దేఖ్లేంగే సాలా' విడుదలైంది. ఈ గీతావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. అభిమానుల కోలాహలం నడుమ వైభవంగా జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుడు హరీష్ శంకర్, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్, నిర్మాత నవీన్ యెర్నేని, గీత రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం నుంచి విడుదలైన తొలి గీతం 'దేఖ్లేంగే సాలా' అభిమానులు, సినీ ప్రేమికుల్లో ఒక్కసారిగా భారీ ఉత్సాహాన్ని రేపింది. ఉత్సాహభరితమైన సంగీతం, అద్భుతమైన నృత్య రీతులతో రూపొందిన ఈ పాటలో పవన్ కళ్యాణ్ తన అత్యంత ప్రజాదరణ పొందిన అవతారంలో కనిపిస్తున్నారు. వింటేజ్ స్టైల్, రా ఇంటెన్సిటీతో ఒకప్పుడు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ఆయన తన ఐకానిక్ బ్లాక్‌బస్టర్ పాటల జ్ఞాపకాలను మళ్లీ గుర్తు చేస్తున్నారు.



## 'మన శంకర వర ప్రసాద్ గారు' జనవరి 12న రిలీజ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన ఎంటర్‌టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు'. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో విక్టరీ వెంకటేష్ కీలకమైన ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్లపై నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తుండగా, శ్రీమతి అర్చన సమర్పిస్తున్నారు. చిత్ర నిర్మాతలు సినిమా విడుదల తేదీని ప్రకటించారు. 'మన శంకర వర ప్రసాద్ గారు' పూర్తి షూటింగ్ షెడ్యూల్ను విజయవంతంగా పూర్తి చేసుకుని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులను వేగంగా జరుపుకుంటోంది. ఈ చిత్రం సంక్రాంతికి కేవలం 2 రోజుల ముందు, జనవరి 12న థియేటర్లలో విడుదల కానుంది. సోమవారం విడుదల కావడం వల్ల, ఈ చిత్రం ఏడు రోజుల లాంగ్ వీకెండ్ బెనిఫిట్ పొందుతుంది. పండుగ సెలవుల పూర్తిగా కలిసిరానున్నాయి. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీని, తమ్మిరాజు ఎడిటింగ్‌ను, ఏఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. కథను ఎస్.కృష్ణ, జి.ఆది నారాయణ సంయుక్తంగా రాశారు.

సందర్భంగా డైరెక్టర్ అనిల్ రావిపూడి మాట్లాడుతూ నిన్ననే ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకున్నాం. ఇది ఒక 20, 30 రోజుల జర్నీ ఉంటుంది. ఈ సినిమాని మేలో మొదలుపెట్టాం. మెగాస్టార్ చిరంజీవితో ఓపెనింగ్ ముహూర్తంతో స్టార్ట్ చేశాం. అక్కడ్నుంచి ఈ ఏడు ఎనిమిది నెలలో జర్నీ నాకు చాలా మెమొరబుల్. నిన్న ఆయనతో లాస్ట్ వర్కింగ్ డే. నేను ఇంకా ఆ ఎమోషన్‌లోనే ఉన్నాను. మేమిద్దరం కూడా ఒక మంచి మెమోరియల్ జర్నీగా షేర్ చేసుకున్నాం. ఒకరినొకరు మిస్ అవుతున్నామనే ఫీలింగ్ ఇద్దరిలో ఉంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన చిరంజీవికి థాంక్యూ సో మచ్. సంక్రాంతి అనగానే నాకు ఒక కనెక్షన్. ఎఫ్2, సరిలేరు నీకెవ్వరు, సంక్రాంతికి వస్తున్నాం.. ఇప్పుడు ఇది నా నాలుగో సంక్రాంతి. నాకెప్పుడూ సంక్రాంతి అంటే ఒత్తిడి ఉండదు. హాలిడేస్‌లో సరదాగా ఇంటికి వెళ్లి పండగ పూట థియేటర్స్ కి వెళ్లి ఒక మంచి ఎంటర్టైనర్ ని చూసే ఒక ఎనర్జీ లాగా ఫీల్ అవుతాను. అందుకే సంక్రాంతి ఎప్పుడు కూడా నా కెరియర్లో చాలా ప్రత్యేకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల పాల్గొన్నారు.

సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో పాప్ సింగర్ స్మిత క్వీన్ అఫ్ పాప్ సింగర్ స్మిత ఓజిమసక మసక సాంగ్ లాంచ్ అయ్యింది. స్మిత, నోయల్ నటించిన ఈ సాంగ్‌ని విజయ్ బిన్నీ అద్భుతంగా డైరెక్ట్ చేశారు. జార్జ్. సి.విలియమ్స్ అదిరిపోయే విజువల్స్ అందించారు. నాగేంద్ర తంగాల ఆర్ట్ డైరెక్టర్‌గా చేసిన ఈ పాటకి అడెలె ఎడిటర్. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు దేవా కట్టా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాప్ సింగర్ స్మిత మాట్లాడుతూ.. హాయ్ రబ్బా ఆల్బమ్

## 'మసక మసక' పాట అందరినీ అలరిస్తుంది



అమ్మ ఇన్వెస్ట్మెంట్ తోనే వచ్చింది. దేశ వ్యాప్తంగా పాపులర్ అయింది. అదే ఇంటి పేరుగా మారింది. ఇప్పుడు 'ఓజి' చేద్దామని అనుకున్నాం. 2026లో నా లైఫ్‌లో కేవలం మ్యూజిక్ మాత్రమే ఉండబోతుంది. ఈ సాంగ్‌ని నాగార్జున బిగ్ బాస్ స్టేజ్ మీద లాంచ్ చేశారు. సంక్రాంతికి ఒక పాట వస్తుంది. ఆ పాట ఒక ఫెస్టివల్ లాగా ఉంటుంది. ఇకపై వరుసగా పాటలు రాబోతున్నాయి. మార్చి చివరి నుంచి లైవ్ షోస్ కూడా ఉంటాయి. హైదరాబాద్, ఆంధ్రాలో రెండు లోకేషన్స్, యూఎస్, దుబాయ్, ఆస్ట్రేలియా, సింగపూర్ లో కూడా ఈవెంట్స్ ఉంటాయని స్మిత అన్నారు. నోయల్ మాట్లాడుతూ స్మిత కం బ్యాక్ అందరి కంటే ఎక్కువగా హ్యాపీనెస్ నాకే వచ్చింది. ఎందుకంటే వారితో కలిసి స్క్రీన్‌ని షేర్ చేసుకున్నాను. స్మిత అంటే అందరికీ ఇష్టం. నేను ఇండిపెండెంట్ మ్యూజిక్ చేయడానికి స్ఫూర్తి స్మిత. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ దేవా కట్టా, డైరెక్టర్ విజయ బిన్నీ పాల్గొన్నారు.

## నిర్మాతగా వెంకీ కుడుముల



యూనిక్ స్టోరీ టెల్లింగ్, హిలేరియస్ ఎంటర్టైన్మెంట్, యూత్ ఫుల్ ఫిల్మ్ మేకింగ్ సెన్సిబిలిటీస్‌తో ఆకట్టుకునే సక్సెస్ ఫుల్ డైరెక్టర్ వెంకీ కుడుముల, నిర్మాతగా కొత్త క్రియేటివ్ జర్నీని ప్రారంభించారు. తన కెరీర్‌లో ఈ ముఖ్యమైన మైల్ స్టోన్‌ని పురస్కరించుకుని వెంకీ కుడుముల తన సొంత బ్యానర్ 'వాట్ నెక్స్ట్ ఎంటర్టైన్మెంట్స్'పై తన తొలి ప్రొడక్షన్ వెంచర్‌ని అనౌన్స్ చేశారు.ఈ చిత్రంలో నటించే గురించి టైటిల్, ఫస్ట్ లుక్‌తో పాటు వెల్లడించనున్నారు. నూతన దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటి అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తోంది. ఎస్. తమన్ సంగీతం అందిస్తుండగా, సినీ పరిశ్రమలో ప్రతిభావంతుడైన న్యూ ఫేస్ రాజా మహాదేవన్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. ఈ కొత్త అధ్యాయం గురించి వెంకీ కుడుముల మాట్లాడుతూ.. కొత్త కథలను ప్రోత్సహించడం, కొత్త ప్రతిభకు అవకాశాలు ఇవ్వడం తన లక్ష్యమని అన్నారు. సినిమా అంటే నాకు అపారమైన ప్రేమ. ఈ రంగంలో నిలదొక్కుకోవడానికి ఎంత కష్టం ఉంటుందో నాకు తెలుసు. న బ్యానర్ ద్వారా అవకాశాల కోసం ఎదురు చూస్తున్న క్రియేటివ్ వాయిసెస్కి, చెప్పాల్సిన కథలకు ఒక వేదిక ఇవ్వాలనుకుంటున్నాను. ఎవరికైనా తొలి అడుగు వేయడానికి నేను సహాయం చేయగలిగితే, అదే నా అతి పెద్ద విజయం. ఈ ప్రయత్నం ద్వారా వెంకీ కుడుముల కేవలం తెరపై ఆకట్టుకునే కథలను చెప్పడమే కాకుండా, తెరవెనుక కొత్త ఆలోచనలు, కొత్త ప్రతిభను పెంపొందించే నిర్మాతగా కూడా తన పాత్రను విస్తరించుకుంటున్నారు. ఒరిజినాలిటీ, ఇన్నోవేషన్, ఫ్రెష్ పర్స్పెక్టివ్‌లకు వేదికగా తన బ్యానర్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతనని చెప్పారు.

## పాటకు మంచి రెస్పాన్స్ వచ్చింది — మిక్కీ జె మేయర్



సంగీత దర్శకుడు మిక్కీ జె మేయర్ ఛాంపియన్ సినిమా 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మ్యూజిక్ డైరెక్టర్ మిక్కీ జె మేయర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఛాంపియన్ చాలా ప్రత్యేకమైనది. ఇందులో ఎక్కువగా నిజాం బ్యాక్ డ్రాప్ ఉంటుంది. నిజాం కాలంలో గ్రామాలు, ప్రజలు, ఎమోషన్స్‌ని చాలా విభిన్నంగా చూపించడం జరిగింది. పీరియాడిక్ సినిమాలు చేయడం నాకు చాలా ఇష్టం. ఎందుకంటే ఒక టైం నుంచి మరో టైంలోకి వెళ్లి ఒక కాలాన్ని చూడడమనేది ఎప్పుడూ ఆసక్తికరంగా ఉంటుంది. మహానటి సినిమా కూడా అలాంటి అనుభూతిని ఇచ్చిన సినిమానే. ఛాంపియన్ మ్యూజిక్ విషయానికి వచ్చేసరికి తెలంగాణ జానపదంతో పాటు వెస్ట్రన్ మ్యూజిక్‌ని మిళితం చేసి ఒక జానర్ క్రియేట్ చేసే అవకాశం ఈ కథ కల్పించింది. ఇలాంటి మ్యూజిక్ క్రియేట్ చేయడం చాలా ఎంజాయ్ చేశాను. ఇందులో ఎమోషన్స్ ఆడియన్స్‌కి కనెక్ట్ అవుతాయి డైరెక్టర్ ప్రదీప్ ఈ కథని నాకు ఫోన్‌లో చెప్పారు. అయినా కథ చెప్పినప్పుడే నాకు చాలా నచ్చింది. ఖచ్చితంగా ఈ సినిమా చాలా ప్రత్యేకంగా ఉండబోతుంది అనిపించింది. ఈ కథ ఐడియా చాలా యూనిక్‌గా ఉంటుంది. మీరు సినిమా చూసిన తర్వాత ఇలాంటి ఐడియాతో ఇప్పటివరకు ఎవరు సినిమా చేయలేదు అనిపిస్తుంది.ఇది స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ ఉన్న సినిమానే గాని కథపరంగా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. ఇందులో హీరోది సికింద్రాబాద్. ఆయన మాట్లాడే స్లాంగ్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నేను కూడా సికింద్రాబాద్‌లోనే పెరిగాను. నాకు ఆ కల్చర్‌పై అవగాహన వుంది. గిరగిర పాటకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఆ పాటకు మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. అది మంచి కమర్షియల్ సాంగ్. నిజానికి హీరో ఇంట్రో సాంగ్ అది. సల్లం గుండాలి పాట కూడా చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. అది నా జోనర్ సాంగ్. ఇందులో మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి.

## 'నా పేరు శంబాల' పాట విడుదల

ఓ సినిమా విడుదలకు ముందే అన్ని డీల్స్ క్లోజ్ అవ్వడం, బిజినెస్ జరిగిపోవడం మామూలు విషయం కాదు. హీరో ఆది సాయి కుమార్ నటించిన సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్' మాత్రం విడుదలకు ముందే రికార్డులు క్రియేట్ చేసింది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభిమోజు, మహీధర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి యగంధర్ ముని దర్శకత్వం వహించారు. అర్చన అయ్యర్, స్వసిక, రవివర్మ, మధునందన్, శివ కార్తీక్ తదితరులు నటించిన ఈ మూవీ బిజినెస్ ఇప్పటికే పూర్తి అయింది. ఫాన్సీ రేటుకే ఈ సినిమాని మేకర్స్ అమ్మేశారు. శంబాల అంటూ టైటిల్ ప్రకటించిన క్షణం నుంచి ఈ చిత్రం ప్రేక్షకుల్లో అంచనాల్ని పెంచేసింది. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి వచ్చిన కంటెంట్, విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, మేకింగ్ వీడియో, టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. డిఫరెంట్ ప్రమోషన్స్‌తో శంబాల టీం జనాల్లోకి దూసుకుపోతోంది. డిసెంబర్ 25న శంబాల పేక్షకుల ముందుకు రానుంది. 'శంబాల' క్రేజ్ను క్యాష్ చేసుకునేందుకు ఓటీటీ సంస్థలో ఆహా పోటీ పడి గెలిచింది. ఇక శాటిలైట్ విషయంలో జీ నెట్వర్క్ ముందుండి హక్కులను కైవసం చేసుకుంది.




## త్వరలో గీతాంజలి రీ-రిలీజ్

భాగ్యలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్‌పై సి.పద్మజ నిర్మించిన గీతాంజలి (1989) చిత్రం వరల్ వైడ్ (చెన్నై మినహాయించి)గా రీరిలీజ్ హక్కులని శ్రీపద్మినీ సినిమాస్ అధినేత బూర్లె శివప్రసాద్ గతంలో పొంది వున్నారు. మణిగీతాంజలి చిత్రం 4కె డిజిటల్‌లో రీరిలీజ్ చేయనున్నారు. అత్యున్నత ప్రామాణికాలతో నిర్వహించి త్వరలో రీరిలీజ్ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ అద్భుతమైన చిత్రాన్ని ఎంతో ప్రేమతో ప్రేక్షకులు ఆదరిస్తారని మనస్ఫూర్తిగా నమ్ముతున్నామని శివ ప్రసాద్ చెప్పారు. ఈ చిత్రం నాకు ఎంతో ఇష్టమైనది. అందుకని ఈ గీతాంజలి రీరిలీజ్ హక్కులను పొందడం నాకు ఎంతో ఆనందంగా ఉందని' ఆయన తెలిపారు.




## జనవరి 1న మళ్ళీ థియేటర్లోకి నువ్వు నాకు నచ్చావ్




24 ఏళ్ళ క్రితం 2001 సెప్టెంబర్ 6న తెలుగు తెరపై వచ్చిన సినిమా 'నువ్వు నాకు నచ్చావ్'. వెంకటేష్ హీరోగా నటించిన ఈ చిత్రంలో ఆర్తి అగర్వాల్ హీరోయిన్ పరిచయమైంది. ఇప్పుడు 'నువు నాకు నచ్చావ్' సినిమాపూర్తి సాంకేతిక హంగులతో 4కెలో రీ రిలీజ్‌కి సిద్ధం అయ్యింది. ఈ సినిమా అప్పట్లో విదేశాల్లో పూర్తి స్థాయిలో రిలీజ్ కాలేదు. ఆ లోటుని తీర్చడం కోసం కూడా ఈ సినిమా జనవరి 1 న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా తీస్తున్నప్పుడే నిర్మాత 'స్రవంతి' రవికిశోర్ ఇది ఒక గొప్ప సినిమా అవుతుందనే నమ్మకంతోనే ఉన్నారు. విక్టరీ వెంకటేష్‌ని సరికొత్త పంథాలో ఆవిష్కరించిన సినిమా ఇది. 'నువ్వే కావాలి' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత విజయ భాస్కర్ త్రివిక్రమ్ ఫుల్ జోష్‌తో చేసిన సినిమా ఇది. అప్పటికే త్రివిక్రమ్‌కి 'మాటల మాంత్రికుడు' అనే ఇమేజ్ వచ్చేసింది.

# హనుక్కా వేడుకల్లో ఉగ్రదాడి?

### సిడ్నీ నగర బాండీ బీచ్‌లోకి దూసుకువచ్చి కాల్పులు జరిపిన అగంతకుడు

### 12 మంది మృతి, 8 మందికి గాయాలు



**సిడ్నీ :** రబ్బీనిక్ యూదుల పర్వదినం ''హనుక్కా'' సందర్భంగా ఆస్ట్రేలియా సిడ్నీ నగర బాండీ బీచ్‌లో జరుగుతున్న ఉత్సవంలో సాయుధ ఆగంతకుడు జరిపిన కాల్పుల్లో 11మంది మరణించారు. ఇద్దరు పోలీసు అధికారులతో సహా 29మంది గాయపడ్డారు. వీరిని అత్యవసరంగా ఆసుపత్రులకు తరలించారు. వీరి పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్లు న్యూ సౌత్ వేల్స్ పోలీసు అధికారులు చెప్పారు. మృతులసంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఉగ్రదాడిగా అనుమానిస్తున్నారు. జనంపై కాల్పులకు పాల్పడిన ఒక గన్‌మెన్‌ను పోలీసులు కాల్చి చంపారు. అతడి సహచరుడు కూడా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ముష్కరులు దాదాపు ఇరవైసార్లు కాల్పులు జరిపారు. చాలామంది వీటిని బాణసంచా కాల్పులుగా భావించారు. చాలా సేపటికిగానీ అందరికీ అవన్నీ తుపాకీ కాల్పులని అర్థంకాలేదు. ఆ తర్వాత పెద్ద సంఖ్యలో పోలీసులతోపాటు హెలికాప్టర్లలో కూడా పోలీసు అధికారులు, సాయుధ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. బాండీ బీచ్‌లో కాల్పుల సంఘటన చాలా దిగ్భ్రాంతికరంగా ఉందని, ఈ దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ ఆల్బనీస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దాడుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. చారిత్రక ప్రదేశం టాస్మానియాలో 1996లో జరిగిన కాల్పుల ఘటన తర్వాత ఆస్ట్రేలియాలో ఇంతపెద్ద హింసాత్మక ఘటన సంభవించడం మళ్ళీ ఇదే. ఆనాడు టాస్మానియాలో ఒక ముష్కరుడు జరిపిన కాల్పుల్లో 35 మంది మరణించారు. అనేక మంది గాయపడ్డారు. ప్రపంచవ్యాప్తంగా తుపాకులను నియంత్రించడానికి ఈఘటన ఒక మైలురాయి ఘట్టంగా మా రింది. కాల్పులు జరుపుతున్న ఆగంతకుణ్ణి నివారించేందుకు ఒక నిరాయుధుడు ప్రయత్నం చేస్తున్న దృశ్యాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఐతే యూదుల పర్వదినాన్ని లక్ష్యంగా చేసుకునే ఈ గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులకు పాల్పడ్డారా? అనే విషయాన్ని కూడా పరిశీలిస్తున్నారు. గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం నవంబరు 28 నుండి డిసెంబరు 27 వ తేదీ లోపు ఎప్పుడైనా ఎనిమిది రాత్రులపాటు ఈ హనుక్కా పర్వదినాన్ని నిర్వహిస్తారు. మెనోరా లేదా హనుక్కియా పండుగలో ఎనిమిది కొవ్వొత్తులను వెలిగిస్తారు.



# ఇంటర్‌స్పోర్ట్స్ మీట్ షురూ

### ఐఐటి హైదరాబాద్‌కు విచ్చేసిన సైనా నెహ్వాల్, పుల్లెల గోపిచంద్

### దేశంలోనే 23 ఐఐటిల నుంచి 2500 మంది విద్యార్థులు హాజరు

**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ప్రతిష్టాత్మకమైన ఐఐటి హైదరాబాద్‌కు బ్యాడ్మింటన్ దిగ్గజాలు సైనా నెహ్వాల్, పుల్లెల గోపీచంద్‌లు విచ్చేశారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఐఐటి హైదరాబాద్ వేదికగా ఇంటర్ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని వారు హాజరై ప్రారంభించారు. ఈ స్పోర్ట్స్ మీట్‌లో దేశంలోని అన్ని ఐఐటీలకు చెందిన 2500 మంది విద్యార్థులు పాల్గొని పోటీలో తమ ప్రతిభను కనబరచనున్నారు. నాలుగు రోజుల పాటు సాగే ఈ స్పోర్ట్స్ మీట్‌లో ఇండోర్, ఆవుట్ డోర్ గేమ్స్ నిర్వహించనుండగా పోటీలో నెగ్గిన వారికి బహుమతులను ప్రదానం చేయనున్నారు.

**అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొండి: సైనా నెహ్వాల్**

విద్యార్థులు అబ్దుల్ కలాం లాంటి మహనీయమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. సైనా నెహ్వాల్ స్పోర్ట్స్ మీట్ అనేది కేవలం కొన్ని రోజులకు పరిమితం కాకుండా రోజు ఉండేలా చూస్తే విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉండడమే కాకుండా చదువులో బాగా రాణించే అవకాశం ఉందని ఆమె తెలిపారు. దేశం గర్వించదగ్గ పనులు చేసేలా యువత ముందుకు సాగాలని నిత్యం స్పోర్ట్స్ ఆడుతూ శారీరిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం ఎంతో అవసరం అన్నారు. ఆరోగ్యవంతమైన పోషక ఆహారాన్ని తీసుకోవడం వల్ల శరీరం ఎప్పుడు ధృడంగా ఉంటుందన్నారు.

# నోబెల్ గ్రహీత, ప్రతిపక్షనేత సహా బెలారస్ జైలు నుండి 123మంది విడుదల

**మిన్స్క్:** తూర్పు యూరప్ దేశం బెలారస్ జైలు నుండి 123 మంది శనివారం విడుదలయ్యారు. వీరిలో బెలారస్‌లో కీలకమైన ప్రతిపక్ష నాయకురాలు కోలెస్నికోవా, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత అలెస్ బియా లియెట్స్కీలు కూడా జైలు నుండి విముక్తి చెందారు. అమెరికాతో సంబంధాలను మెరుగుపరచుకోవాలని గట్టిగా ఆకాంక్షిస్తున్న బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో తన పథకంలో భాగంగా వీరిని విడుదల చేశారు. డోనాల్డ్ ట్రంప్ ప్రతినిధి ఒకరు లుకషెంకోను ఇటీవల కలిశారు. ఈ సందర్భంగా ఉక్రేన్ ప్రభుత్వం ఒక ప్రకటన చేస్తూ బెలారస్ జైలులో ఖైదీలుగా ఉన్న 114 మంది తిరిగి తమ దేశానికి చేరుకున్నారని ప్రకటించింది. అదేవిధంగా ఒక అమెరికన్ జాతీయుడు కూడా విడుదలైనట్లు వాషింగ్టన్ వర్గాలు ప్రకటించాయి. బెలారస్‌లో మానవహక్కులకోసం పోరాటం చేసే ప్రజాస్వామ్య అనుకూలవాది, రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత అలెస్ బియా లియెట్స్కీ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడనే నెపంతో పదేళ్ళ జైలుశిక్ష విధించారు. ప్రపంచంలో వ్యవసాయ రంగానికి అవసరమైన పొటాష్‌ను ఉత్పత్తి చేయడంలో బెలారస్ అగ్రస్థానంలో ఉంది. కానీ అమెరికా మాత్రం బెలారస్ పొటాష్‌ను దిగుమతి చేసుకోకుండా ఆంక్షలు విధించింది. అమెరికాతో బలమైన వాణిజ్య సంబంధాలను కోరుకుంటున్న బెలారస్ నాయకుడు లుకషెంకో దేశంలో నియంతగా ఉన్నప్పటికీ చివరకు తలవొగ్గి జైలు నుండి 123 మందిని విడుదల చేశారు. లుకషెంకో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అత్యంత సన్నిహితుడు. ఈ సందర్భంగా ట్రంప్ దూత జాన్ కూలే రాయిటర్స్ వార్తా సంస్థతో మాట్లాడుతూ, బెలారస్‌లో ఇంకా 1000 మంది వరకూ రాజకీయ ఖైదీలు ఉన్నారని, వారందరినీ కూడా విడుదల చేయాల్సి ఉందని చెప్పారు. రాబోయే రోజుల్లో వీరందరికీ చెర నుండి విముక్తి కలుగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. 2024 జులై నుండి బెలారస్ 430 మంది రాజకీయ ఖైదీలను విడుదల చేసింది. పాశ్చాత్యదేశాలకు దగ్గరయ్యేందుకే ఈ చర్యలు తీసుకుంది.

# నితిన్ నబీన్

(మొదటి పేజీ తరువాయి)

యువ నాయకులలో ఆయన ఒకరని పార్టీ నాయకులు తెలిపారు. నబిన్ బిహార్ ప్రభుత్వంలో పలుమార్లు మంత్రిగా పనిచేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం, ఆయన బిహార్‌లో పిడబ్ల్యుడి మంత్రిగా, పాట్నాలోని బాంకిపూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఉన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడుగా జెపి నడ్డా 2020 జనవరిలో బాధ్యతలు చేపట్టారు. ఆయన తన పదవీకాలం పూర్తిచేశారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలతో సహా పలు కీలక ఎన్నికల సందర్భాలను పురస్కరించుకుని ఆయన పదవీకాలాన్ని పార్టీ పొడిగిస్తూ వచ్చింది. నబిన్ నియామకంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలుపుతూ ఆయన కష్టపడి పనిచేసే కార్యకర్తగా తనను తాను నిరూపించుకున్నారని, ఆయన శక్తి, అంకిత భావం పార్టీని బలోపేతం చేస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. నబీన్ అపారమైన సంస్థాగత అనుభవం ఉన్న యువ, శ్రమశీలి అయిన నాయకుడని, ఎమ్మెల్యేగా, బిహార్‌లో పలుమార్లు మంత్రిగా కూడా ఆయనకు అద్భుతమైన రికార్డు ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ఆయన శ్రద్ధగా పనిచేశారని కొనియాడారు. నబిన్ తన వినయపూర్వకమైన స్వభావానికి, నిరాడంబరమైన పనితీరుకు ప్రసిద్ధి చెందారని, రాబోయే కాలంలో ఆయన శక్తి, అంకితభావం మన పార్టీని బలోపేతం చేస్తాయని విశ్వసిస్తున్నానన్నారు. బిజెపి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎన్నికైనందుకు ఆయనకు అభినందనలు తెలిపుతూ మోదీ ఎక్స్‌లో పోస్టు చేశారు. నబిన్ యువకుడని, పరిపాలనలో, ప్రజల కోసం, సంస్థ కోసం పనిచేయడంలో ఆయనకు అపారమైన అనుభవం ఉందని పార్టీ నాయకులు తెలిపారు.

# భారత్‌కు కొత్త ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రధాని మార్పు అంశాన్ని వ్యాఖ్యానించారు. ఒక నెలలోపు ఒక మరాఠీ వ్యక్తి భారతదేశానికి ప్రధాని కాబోతున్నారని సూచిస్తూ ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన తర్వాత, శనివారం ఇక్కడ పింప్రి చించ్వాడ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో చవాన్ మాట్లాడుతూ, ఆ వ్యాఖ్యపై వివరణ కోరుతూ చాలా మంది తనను సంప్రదించారని చెప్పారు. 'ప్రపంచ స్థాయిలో చాలా పరిణామాలు జరుగుతున్నాయి. నేను ఆ పోస్ట్ చేసినప్పుడు, దాని అర్థం ఏమిటో వివరించమని చాలా మంది నన్ను అడిగారు. నా ప్రకటన ఒక ఊహాజనిత రాజకీయ అవకాశంపై ఆధారపడి ఉంది. మహారాష్ట్రకు చెందిన వ్యక్తి ప్రధాని అయితే, ప్రస్తుత ప్రధాని పదవి నుండి వైదొలగాల్సి ఉంటుంది. నేను కేవలం మార్పు వచ్చే అవకాశం గురించి మాత్రమే నొక్కి చెప్పాను' అని చవాన్ వివరించారు. మాజీ కేంద్ర మంత్రి మాట్లాడుతూ తన వ్యాఖ్యలు డిసెంబర్ 19వ తేదీకి సంబంధించినవని, ఆ రోజున అమెరికా కాంగ్రెస్ ఎప్‌స్టీన్ ఫైల్స్‌ను విడుదల చేస్తుందని, దీనికి విస్తృత ప్రపంచవ్యాప్త పరిణామాలు ఉండవచ్చని తాను భావిస్తున్నానని చెప్పారు. 'ఈ ఫైల్స్‌లో పలువురు పెద్ద నాయకులకు సంబంధించిన స్టింగ్ ఆపరేషన్ మెటీరియల్ ఉందని చెబుతున్నారు. కొన్ని పేర్లు ఇప్పటికే సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి' అని ఆయన అన్నారు. కొన్ని ఫోటోల రూపంలో కొంత డేటా ఇప్పటికే విడుదల అయిందని చవాన్ చెప్పారు. 'ఆ డేటాలో అధ్యక్షులు, ప్రధాన మంత్రుల వంటి పెద్ద ప్రపంచ నాయకులు ఉన్నారు. ఈ డేటా విడుదల మన దేశ రాజకీయాలను కూడా ప్రభావితం చేయవచ్చని ఒక వాదన ఉంది. అటువంటి పరిస్థితులలో పెద్ద పరిణామాలు జరగవచ్చు' అని చవాన్ అన్నారు. 'మరాఠీ వ్యక్తి' ప్రధాని అవుతారనే తన వాదన గురించి మాట్లాడుతూ, కొత్త ప్రధానిని నియమించాల్సి వస్తే, అది కేవలం బిజెపి నుండే ఉంటుందని చెప్పడం కేవలం ఒక రాజకీయ విశ్లేషణ మాత్రమే అని చవాన్ అన్నారు. కొత్త ముఖం కోసం బిజెపిలో ఉన్న అవకాశాలను బట్టి చూస్తే, తమకు మహారాష్ట్ర నుండి ప్రత్యామ్నాయాలు కనిపిస్తున్నాయని చవాన్ అన్నారు. అమెరికా కాంగ్రెస్ ఆమోదించి, గత నెలలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చట్టంగా సంతకం చేసిన ఎప్‌స్టీన్ ఫైల్స్ పారదర్శకత చట్టం ప్రకారం, న్యాయ శాఖ ఈనెల 19 నాటికి ఎప్‌స్టీన్‌కు సంబంధించిన రికార్డులను ప్రజలకు వెల్లడించాలి. ప్రముఖులు, రాజకీయ నాయకులు, బిలియనీర్లు, విద్యావేత్తలతో సాన్నిహిత్యం ఉన్నందుకు పేరుగాంచిన కోటీశ్వరుడైన మనీ మేనేజర్ ఎప్‌స్టీన్, 2019లో లైంగిక అక్రమ రవాణా కేసులో అరెస్టు అయిన ఒక నెల తర్వాత జైలులో ఆత్మహత్య చేసుకున్నాడు.



# యూనియన్లతో చర్చలు జరపాలి!

(మొదటి పేజీ తరువాయి)

ఆహ్వానించారు. ట్రిబ్యూన్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ గుప్తా స్వాగతం పలుకుతూ ప్రస్తుతం జర్నలిస్టులు క్లిష్టమైన పరిస్థితులని ఎదుర్కొంటున్న నేపథ్యంలో కాన్ఫెడరేషన్ వార్షిక సమావేశానికి కీలక ప్రాముఖ్యం ఉందన్నారు. కాన్ఫెడరేషన్ సెక్రటరీ జనరల్ ఎం.ఎస్.యాదవ్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు అమలులోకి రావడంతో వర్కింగ్ జర్నలిస్టుల చట్టం రద్దయ్యిందనీ, దాంతో జర్నలిస్టుల వేజ్ బోర్డు ఉనికిలో లేకుండా పోయిందన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని పునరుద్ధరించాలని అందుకు గవర్నర్ తమ పలుకుబడిని వినియోగించాలని కోరారు. సమావేశాలను ప్రారంభించిన పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య మనుగడలో మీడియా పాత్ర కీలకమైనదని కటారియా అన్నారు. స్వాతంత్రోద్యమ కాలంలో పత్రికలు కీలక భూమిక పోషించాయని ఆయన ప్రశంసించారు. వ్యవస్థలో లోపాలను ప్రశ్నించేటట్లు పౌరులను జాగృతం చేయాల్సిన బాధ్యత పాత్రికేయులపై ఉందని గవర్నర్ అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం, హక్కుల కోసం పోరాడటంతో పాటు, ప్రజాహితం కోసం కృషి చేయాలని జర్నలిస్టులకు ఆయన సూచించారు. ప్రకృతి విపత్తులు, ఆపరేషన్ సింధూర్ లాంటి సందర్భాల్లో పంజాబ్ ట్రిబ్యూన్ ఎంప్లాయీస్ యూనియన్ చేపట్టిన సహాయ కార్యక్రమాలు శ్లాఘనీయమని గవర్నర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో అన్నివర్గాల సమస్యలను వినాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం కనుగొనాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని గవర్నర్ అన్నారు. వివిధవర్గాల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వాలు, ప్రజా స్వామ్యంలో కీలక భూమిక పోషిస్తున్న మీడియా సిబ్బంది సమస్యలపై కూడా దృష్టి సారించాలని కోరారు. లేబర్ కోడ్‌ల అమలుపై కాన్ఫెడరేషన్ నేతలు లేవనెత్తిన సమస్యను ప్రస్తావిస్తూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను సంబంధిత బాధ్యుల దృష్టికి తీసుకు వెళ్తానని గవర్నర్ హామీ ఇచ్చారు. ఈ విషయంలో యూనియన్ల అభిప్రాయాలతో పాటు సంబంధిత అన్నివర్గాల అభిప్రాయాలు వినాలని, అన్ని వర్గాలతో చర్చలు జరపాలని, చర్చలద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయన్న నమ్మకం తనకు ఉందని గవర్నర్ గులాబ్ చంద్ కటారియా అన్నారు. ఐజెయు అధ్యక్షుడు కె.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షుడు మాట్లాడుతూ లేబర్ కోడ్లను రూపొందించే క్రమంలో బ్రిటిష్ పాలనా కాలం నాటి చట్టాలను మారిన పరిస్థితులకు అనుగుణంగా మారుస్తున్నామని ప్రభుత్వం చెప్పిందని, అయితే అందులో ఎంతమాత్రమూ వాస్తవం లేదన్నారు. స్వాతంత్ర్యానంతరం మొదటి ప్రెస్ కమిషన్ సిఫార్సు మేరకే వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని మన పార్లమెంటు చేసిందని, ఆ చట్టం ద్వారానే వర్కింగ్ జర్నలిస్ట్‌లకు పలు హక్కులు, సదుపాయాలు వచ్చాయని గుర్తు చేశారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టాన్ని పునరుద్ధరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా పోరాటాన్ని కొనసాగించాలని పిలుపు ఇచ్చారు. ఈ సమావేశంలో ఐజెయు సెక్రటరీ జనరల్ బల్విందర్ సింగ్ జమ్ము, జాతీయ కార్యదర్శులు డి.సోమసుందర్, వై.నరేందర్ రెడ్డి, డి.ఎస్.ఆర్. సుభాష్ సహా పదిహేను మంది ప్రతినిధుల బృందం ఐజెయు నుండి పాల్గొన్నది. కాన్ఫెడరేషన్‌లో భాగస్వాములుగా ఉన్న ఎనిమిది జాతీయస్థాయి జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com